# శుభోదయం!

WWW.SUBHODAYAMDAILY.COM

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 95, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం -20 - జూన్ - 2025


## పౌరులు.. టెహ్రాన్‌ను వెంటనే వీడండి



ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు.

ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. టెహ్రాన్‌లో ఉన్న పౌరులు వెంటనే వెళ్లిపోవాలని సూచించారు. మిగతా 2లో

## యుద్ధం మొదలైంది.. వారి అంతం చూస్తం

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ జూన్ 14న ఒక ప్రకటనలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ప్రారంభించిందని తెలిపారు.



ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ జూన్ 14న ఒక ప్రకటనలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ప్రారంభించిందని తెలిపారు. అలాగే "హిట్ అండ్ రన్" దాడులను మిగతా 2లో

## శుభాంశు రోదసియాత్ర మళ్లీ వాయిదా

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్ర 'ఆక్సియం-4 మిషన్' మరోసారి వాయిదా పడింది.

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా మిగతా 2లో



## కిషన్ రెడ్డి తెలంగాణ ద్రోహి... హరీశ్ రావు అసూయకు మందు లేదు: రేవంత్ రెడ్డి



2లో

కిషన్ రెడ్డి విశ్వసనీయత పెద్ద ప్రశ్నార్థకమన్న రేవంత్ రెడ్డి

బీఆర్ఎస్ ను బతికించేందుకు కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపణ

ఎన్ని ప్రాజెక్టులకు బీఆర్ఎస్ అనుమతులు తీసుకొచ్చిందో చెప్పాలని డిమాండ్

# 1500 టీఎంసీలపై వినియోగానికి అనుమతులు ఇవ్వండి..?

గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు ప్రీ - ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలి

ట్రైబ్యునల్ -1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014 లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఫిర్యాదు

జీడబ్ల్యూడీటీ-1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదు

ఏ నిబంధనలు పాటించకుండా వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు ప్రీ - ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ -1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014 లకు విరుద్ధంగా మిగతా 2లో



## మెట్రో ఫేజ్-2... ఇతర శాఖల అనుమతులు ఇప్పించాలని రేవంత్ రెడ్డి అభ్యర్థన

హైదరాబాద్ మెట్రో రెండో దశకు అనుమతివ్వాలని కేంద్రానికి సీఎం విజ్ఞప్తి

కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో రేవంత్ రెడ్డి భేటీ

76.4 కి.మీ. మేర మెట్రో ఫేజ్-2 ప్రతిపాదన

రూ.24,269 కోట్ల ప్రాజెక్టు, కేంద్రంతో కలిసి చేపట్టేందుకు రాష్ట్రం సిద్ధం

### ఈనెల 20, 21న మూడు రాష్ట్రాల్లో

# ప్రధాని మోదీ పర్యటన

### బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటన

బీహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ ప్రారంభోత్సవం, శంకుస్థాపన

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ కేంద్రంగా ప్రధాని మోదీ నేతృత్వం



ఢిల్లీ: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల(జూన్) 20, 21వ తేదీల్లో మూడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నట్లు అధికారికంగా ప్రధాని కార్యాలయం ప్రకటించింది. బీహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. ఒడిశాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రధానమంత్రి హాజరవుతున్నారు. 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలుపంచుకోనున్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మిగతా 2లో



### ఢిల్లీ గంగారామ్ ఆసుపత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్

ఉదర సంబంధిత అనారోగ్యానికి చికిత్స పొందిన ఆమె ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది

జూన్ 15న ఉదర సంబంధిత సమస్యతో సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే

"సాధారణ చికిత్సతో ఆమె పరిస్థితి మెరుగుపడింది. తదుపరి చికిత్సను ఔట్ పేషెంట్‌గా కొనసాగిస్తారు

# ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజం

### తన వ్యక్తిగత సంభాషణలు దొంగచాటుగా విన్నారు

కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు... రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి: షర్మిల

ఇది వ్యక్తిగత గోప్యతకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్య

ఇంతటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడతారా అని ప్రశ్న



విశాఖ: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది పచ్చి నిజమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. తన ఫోన్‌తో పాటు భర్త, దగ్గర వాళ్ల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. విశాఖపట్నం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి నిర్ధరించారు. ఆనాడు ట్యాపింగ్ జరిగిన నా ఆడియో ఒకటి నాకే వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు మిగతా 2లో

## యూకేకి బయల్దేరిన కేటీఆర్



2లో

ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరంలో కీలక ఉపన్యాసం ఇవ్వనున్న కేటీఆర్

తెలంగాణ ప్రగతిని వివరించనున్న వైనం

పెట్టుబడులు, పారిశ్రామిక విధానాలపై చర్చ

### ఒకప్పుడు గ్రామదేవతలకు

# పొట్టేళ్లు బలిచ్చేటప్పుడు 'రప్పా రప్పా' అనే వారు

సత్తెనపల్లిలో జగన్ పర్యటన... సీఎం చంద్రబాబు ఫైర్

ఇరుకు సందుల్లో సభలు పెట్టి హింసను ప్రేరేపించారన్న చంద్రబాబు

గంజాయి, బెట్టింగ్, రౌడీ మూకలకు విగ్రహాలు ఏర్పాటు చేస్తారా అని ప్రశ్న



అమరావతి: వైసీపీ అధినేత జగన్ పల్నాడు పర్యటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పర్యటన సందర్భంగా జగన్ అనుమతులను ఉల్లంఘించారని, హింసను ప్రోత్సహించేలా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. ఇవాళ అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, వైసీపీ నేతల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "పల్నాడు పర్యటనలో భాగంగా ఇరుకైన సందుల్లో సమావేశాలు నిర్వహించారు. మిగతా 2లో



2లో

## బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో మంత్రి లోకేశ్ భేటీ

ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యలో ఏఐ టూల్స్ వినియోగంపై చర్చ

నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారంపై ఒప్పందం

ఉన్నత విద్యలో సంస్కరణలు, సాంకేతిక మద్దతుపై సమీక్ష

# పౌరులు.. టెహ్రాన్‌ను వెంటనే వీడండి

కెనడా వేదికగా జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్ పాల్గొన్నారు. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందాన్ని అంగీకరించి ఉండాల్సిందని నొక్కి చెప్పారు. మరింత సమయం ఆలస్యం కాకముందే ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని సూచించారు. ఇప్పటికే రెండో అవకాశం ఇచ్చినట్లు గుర్తు చేశారు. తన సోషల్ మీడియా 'ట్రూత్' వేదికగా పోస్టు పెట్టారు."నేను చెప్పిన అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేసి ఉండాల్సింది. ఇప్పుడు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఎంత సిగ్గుమాలిన చర్య. ఇంకాస్త సులువుగా చెప్పాలంటే.. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. ఇప్పటికే పదే పదే చెప్పా. అందరూ టెహ్రాన్‌ను ఖాళీ చేయాలి" అని పోస్టు చేశారు. ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో యుద్ధం మరింత ఉద్రిక్తంగా మారే ప్రమాదం లేకపోలేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# యుద్ధం మొదలైంది.. వారి అంతం చూస్తం

ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని, తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ ప్రకటన ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మొదలైన సైనిక ఘర్షణల సందర్భంలో వచ్చింది, ఇందులో ఇజ్రాయెల్-ఇరాన్ యొక్క అణు, సైనిక స్థావరాలపై దాడులు చేసింది. దీంతో పశ్చిమ ఆసియా దేశాల్లో ఒక్కసారిగా అలజడి నెలకొంది. ఇరు దేశాల యుద్ధంపై మంగళవారం జీ7 దేశాలు చర్చించి ఇజ్రాయెల్ మద్దతు ఇచ్చాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఇరాన్ సుప్రీంకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు.తన ట్వీట్ లో "సో కాల్డ్ సుప్రీం లీడర్ ఎక్కడ దాక్కున్నాడో మాకు తెలుసు.. అతడిని చంపడం పెద్ద కష్టమేమి కాదు.. కానీ ఇప్పుడు మేము అలా చేయము" ఇరాన్ ప్రజలకు అమెరికా సైనికులు హాని కలిగించలేదు. మేము ఇరాన్ ప్రవర్తనపై ఎంతో ఓపికతో వేచి చూస్తున్నాము. ఎలాంటి షరతులు లేకుండా వెంటనే లొంగిపోండి.. అంటూ ఖమేనీకి ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజా యుద్ధ వాతావరణం లోకి అమెరికా కూడా అడుగు పెట్టడం, ఏకంగా ట్రంప్ వార్నింగ్ ఇవ్వడంతో ఇరాన్ సుప్రీం ఖమేనీ ఎక్స్ వేదికగా సంచలన పోస్ట్ పెట్టారు. "యుద్ధం మొదలైంది.. యూదు టెర్రరిస్టులకు సరైన సమాధానం చెబుతాం. వారిపై ఎటువంటి దయ చూపబోం.. అంటూ ఖమేనీ సంచలన హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఏ క్షణం ఎమ్ అవుతుందోనన్న టెన్షన్ వాతావరణం కనిపిస్తుంది.

# శుభాంశు రోదసియాత్ర మళ్లీ వాయిదా

రోదసియాత్ర 'ఆక్సియం-4 మిషన్' మరోసారి వాయిదా పడింది. ఈ ప్రయోగం జూలై 19న జరగాల్సి ఉంది. అయితే కొన్ని అనివార్య కారణాలతో 'ఆక్సియం-4 మిషన్'ను జూన్ 22న నిర్వహించనున్నట్లు 'నాసా' పేర్కొంది. భారతదేశపు రెండవ వ్యోమగామి శుభాన్షు శుక్లాను అంతరిక్షంలోకి తీసుకెళ్లే ఆక్సియం-4 మిషన్ ప్రయోగం తరచూ వాయిదా పడుతూ వస్తోంది.దీనికి ముందు ఫాల్కన్ 9 రాకెట్ రిపేర్ కారణంగా వాయిదా అనివార్యమయ్యింది. ఈ విషయాన్ని స్పేస్ ఎక్స్ నాడు సోషల్ మీడియా ప్లాట్‌ఫారం ఎక్స్‌లో తెలియజేసింది. పోస్ట్ స్టాటిక్ ఫైర్ బూస్టర్ తనిఖీల సమయంలో గుర్తించిన ఎల్ఓ ఎక్స్ లీక్‌ను రిపేర్ చేసేందుకు స్పేస్‌ఎక్స్ బృందాలకు అదనపు సమయం అవసరం కానున్నదని తెలిపింది. మరమ్మతు పూర్తయిన తర్వాత తదుపరి ప్రయోగ తేదీని తెలియజేస్తామని స్పేస్‌ఎక్స్ పేర్కొంది. అంతకుముందు ప్రయోగ ప్రాంతంలో అనుకూలమైన వాతావరణం లేని కారణంగా వాయిదా పడిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. భారతదేశ అంతరిక్ష లక్ష్యాల?కు ఒక మైలురాయిగా ఈ మిషన్ నిలవనుంది. యాక్సియమ్ స్పేస్, నాసా, స్పేస్‌ఎక్స్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)ల సహకారంలో ఈ ప్రయోగం జరుగుతోంది

### కిషన్ రెడ్డి తెలంగాణ ద్రోహి... హరీశ్ రావు

# అసూయకు మందు లేదు: రేవంత్ రెడ్డి

హైదరాబాద్: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కిషన్ రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని, ఆయన విశ్వసనీయతే ఒక పెద్ద ప్రశ్నార్థకమని సీఎం వ్యాఖ్యానించారు. అఖిలపక్ష సమావేశానికి హాజరుకాకుండా, ఢిల్లీలో పని ఉందని చెప్పి కిషన్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌ను రహస్యంగా కలిశారని విమర్శించారు. సి.ఆర్. పాటిల్‌ను రహస్యంగా కలవాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. తాము కూడా పాటిల్‌ను కలుస్తున్నామని, తమతో పాటు రావాలని కోరినా కిషన్ రెడ్డి స్పందించలేదని, అలా వస్తే ఆయన కిరీటం ఏమైనా పోతుందా అంటూ సీఎం ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌ను బతికించేందుకే కిషన్ రెడ్డి నీళ్ల సెంటిమెంట్‌ను ఆయుధంగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డి అన్ని రకాలుగా తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. అయితే, అఖిలపక్ష సమావేశానికి వచ్చిన బీజేపీ ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావులు ప్రభుత్వ వాదనలకు మద్దతు తెలిపారని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ వాదనతో వారు ఏకీభవించారని, భవిష్యత్ కార్యాచరణలో ప్రభుత్వానికి సహకరిస్తామని వారు చెప్పారని తెలిపారు. ప్రభుత్వం ఎక్కడికి వెళ్లినా తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని, ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చని వారు చెప్పారని, వారి మాటల్లో చిత్తశుద్ధి కనిపించిందని సీఎం అన్నారు. నదీ పరివాహక ప్రాంత అవసరాలు తీరిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని కేటాయించడం, తరలించడం, మళ్లించడం చేయాల్సి ఉంటుందని, అంతర్జాతీయ నీటి చట్టాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని తరలించాలని అన్నారు. జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీలను ఏర్పాటు చేసినా, వాటికి డీపీఆర్‌లు ఇవ్వలేదని పేర్కొన్నారు. జీఆర్ఎంబీకి సమాచారం ఇచ్చాక, తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని అనుమతులు పొందాల్సి ఉండగా, అవేవీ పాటించకుండా నేరుగా కేంద్రం నుంచి అనుమతులు పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్ రావు అక్కసుకు, అసూయకు మందు లేదని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. గత ఐదు నెలలుగా బనకచర్ల విషయంపై నిరంతరం ఫిర్యాదులు చేయడం వల్లే అనుమతులు ఇవ్వడానికి కేంద్రం వెనుకాడుతోందని అన్నారు. తమ ప్రయత్నాల వల్లే అనుమతుల విషయంలో కొంత పురోగతి వచ్చిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఎన్ని అనుమతులు తీసుకువచ్చారో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

### మెట్రో ఫేజ్-2... ఇతర శాఖల

## అనుమతులు ఇప్పించాలని రేవంత్ రెడ్డి అభ్యర్ధన

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం కేంద్ర మంత్రిని కోరారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగర అవసరాలకు అనుగుణంగా 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి కూలంకషంగా వివరించారు. సుమారు రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగరంలో ప్రయాణం వేగవంతం కావడమే కాకుండా, రోడ్లపై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని, తద్వారా సుస్థిరమైన అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి శాఖ చేసిన సూచనల మేరకు మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన మార్పులు చేర్పులతో కూడిన సవివరమైన ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇప్పటికే సమర్పించిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రెండో దశ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఇతర శాఖల నుంచి కూడా అనుమతులు త్వరితగతిన ఇప్పించాలని ఆయన కేంద్ర మంత్రికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో మెట్రో విస్తరణ ఆవశ్యకత, ప్రయోజనాలపై సమగ్ర చర్చ జరిగినట్లు సమాచారం.

# ఈనెల 20, 21న మూడు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ కేంద్రంగా ప్రధాని మోదీ నేతృత్వం వహించనున్నారు. 21వ తేదీన ఉదయం 6.30గంటలకు యోగా అనంతరం మోదీ ప్రసంగించనున్నారు. విశాఖ బీచ్ రోడ్డులో నిర్వహించే యోగా కార్యక్రమానికి సామాన్య ప్రజలతో కలిసి మోదీ పాల్గొంటారని ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది హాజరవుతారని ప్రధాని కార్యాలయం తెలిపింది. దేశవ్యాప్తంగా 3.5లక్షలకు పైగా ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుగుతోందని పేర్కొంది. 'యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్' ఇతివృత్తంతో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 2015లో ఐక్యరాజ్యసమితి జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిన నాటి నుంచి ఢిల్లీ, ఛండీఘడ్, లక్నో, మైసూరు, న్యూయార్క్, శ్రీనగర్ వంటి పలు ప్రదేశాల్లో నిర్వహించిన వేడుకలకు ప్రధాని మోదీ హాజరయ్యారని ప్రధాని కార్యాలయం పేర్కొంది.

# యూకేకి బయల్దేరిన కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ఉదయం బ్రిటన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఇంగ్లండ్‌లోని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో రేపు, ఎల్లుండి జరగనున్న 'ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం 2025' సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించనున్నారు. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే ప్రధాన ఇతివృత్తంతో ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా కేటీఆర్, గతంలో తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి తీసుకున్న చర్యలు, రాష్ట్ర అభివృద్ధి కోసం అమలు చేసిన పారిశ్రామిక విధానాలు, ప్రజా సేవలను మెరుగుపరచడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ విధంగా ఉపయోగించుకున్నారనే అంశాలపై మాట్లాడతారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు, పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు పాల్గొనే ఈ సదస్సులో, సాంకేతికత ద్వారా భారతదేశం సుస్థిర అభివృద్ధిని ఎలా సాధించగలదనే విషయంపై విస్తృతంగా చర్చించనున్నారు. కేటీఆర్ తన పర్యటన ముగించుకుని ఈ నెల 24న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

# 1500 టీఎంసీలపై వినియోగానికి అనుమతులు ఇవ్వండి..?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఫిర్యాదు చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఢిల్లీలో శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. బనకచర్లపై అభ్యంతరాలతో పాటు నీటి వాటాలకు సంబంధించి అనేక అంశాలను కేంద్ర మంత్రి గారికి వివరించారు. "బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయ. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోంది. జీడబ్ల్యూడీటీ-1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలి. బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోంది. ఏ నిబంధనలు పాటించకుండా వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలి. సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టింది. చ%+ౌఱ% -1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసింది. పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోంది. తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉంది. జాతీయ ప్రాజెక్టు పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఏపీ భావిస్తే.. పోలవరం - బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చి ఇచ్చంపల్లి - నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధం. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలి.



తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోం. అన్ని వేదికల ద్వారా సమస్యలు సామరస్య పూర్వకంగా పరిష్కారానికి ప్రయత్నిస్తాం. కేంద్ర స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం." అని వివరించారు.

1500 టీఎంసీలపై వినియోగానికి అనుమతులు ఇవ్వండి..?


తెలంగాణకు గోదావరి నదిలో 1000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు మొత్తంగా 1500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. 1500 టీఎంసీల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఏపీ చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదని రేవంత్ రెడ్డి గారు అన్నారు. "ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య పలు అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. పాలమూరు - రంగారెడ్డి, సమ్మక్క- సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలి. గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలి." అని కోరారు. తెలంగాణ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి గారు సానుకూలంగా స్పందించారని సమావేశం అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు మీడియాకు తెలిపారు. బనకచర్లకు సంబంధించిన డీపీఆర్ తమకు అందలేదని కేంద్ర మంత్రి చెప్పారని, త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని మంత్రి గారు వివరించారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ఎంపీలు మల్లు రవి గారు, రఘువీర్ రెడ్డి గారు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పి.జితేందర్ రెడ్డి గారు, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ గారితో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒకప్పుడు గ్రామదేవతలకు పొట్టేళ్లు బలిచ్చేటప్పుడు 'రప్పా రప్పా' అనే వారు



పరామర్శించడాన్ని కూడా చంద్రబాబు తప్పుబట్టారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నాగమల్లేశ్వరరావు చనిపోయారు. అప్పుడు అధికారంలో ఉన్నది వాళ్లే. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందే ఆ వ్యక్తి మరణించారు. వైసీపీ నేతల వాహనం ఢీకొనే ఆయన చనిపోతే అప్పుడు పట్టించుకోలేదు కానీ, ఇప్పుడు పరామర్శిస్తారా?" అని నిలదీశారు. రౌడీయిజం చేయాలంటూ అందరికీ మార్గదర్శనం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నిన్న సత్తెనపల్లిలో జగన్ పర్యటన సందర్భంగా జరిగిన ఘటనలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. "ఒకవైపు యోగా దినోత్సవం జరుగుతుంటే, మరోవైపు 'రప్పా రప్పా' అంటూ నినాదాలు చేస్తున్నారు. ఒకప్పుడు గ్రామ దేవతలకు పొట్టేళ్లను బలి ఇచ్చేటప్పుడు 'రప్పా రప్పా' అనేవారు. ఇప్పుడు ఎవరిని నరుకుతారు? ప్రజలనా?" అంటూ పరోక్షంగా సత్తెనపల్లి ఘటనలపై ఆయన మండిపడ్డారు. సత్తెనపల్లి పర్యటనకు ప్రభుత్వం ఆంక్షలు విధించినప్పటికీ, పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా సింగయ్య అనే వృద్ధ రైతు కారు కిందపడి మరణించడం, తొక్కిసలాట జరగడం వంటి ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించినట్లు స్పష్టమవుతోంది. "చట్టాన్ని ఉల్లంఘించేవాళ్లను ఏమనాలి? నేరస్తులతో కలిసి రాజకీయాలు చేయాల్సిన దుస్థితి వచ్చింది. ఇష్టానుసారంగా టెర్రరిజం సృష్టిస్తే చూస్తూ ఊరుకోం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఎవరినీ ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోవడం లేదని ఆయన తెలిపారు.

హింసను ప్రేరేపించడమే కాకుండా, పోలీసులపైనే నిందలు మోపారు. రాష్ట్రంలో ఇటువంటి పోకడలు ఎప్పుడైనా చూశామా?" అని చంద్రబాబు ప్రశ్నించారు. "చంపండి... నరకండి అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆనందిస్తున్నారు. సమాజంలో ఇలాంటి ధోరణులు చాలా ప్రమాదకరం" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని, ఇది సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదని హితవు పలికారు. "భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకుల గురించి ప్రజలు ఆలోచించాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మీరు మారాలి, లేకపోతే ప్రజలే మిమ్మల్ని మారుస్తారు. మారితే సమాజం అంగీకరిస్తుంది. తప్పుడు పనులతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తామంటే కుదరదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు. "రాజకీయం చేస్తే వదిలిపెట్టను, తాట తీస్తా" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఏడాది క్రితం మరణించిన నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని ఇప్పుడు




## ఏపీ, తెలంగాణ.. ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం: చంద్రబాబు

అమరావతి: సముద్రంలో కలిసే నీటి వాడకంపై సమస్య సృష్టించడం ఎంత వరకు సమంజసమని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుకుంటున్నాయని, పోలవరం తప్ప మిగతావన్నీ అనుమతి రాని ప్రాజెక్టులేనని చెప్పారు. "మనం మనం కొట్లాడుకుంటే ఎవరికి లాభం? తెలంగాణపై ఎప్పుడైనా గొడవ పడ్డానా? కృష్ణాలో తక్కువ నీటిపై గొడవ పడితే లాభం లేదు. కొత్త ట్రైబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలి. ఏపీ, తెలంగాణ ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం. ఎవరూ ఎవరిపైనా పోరాడాల్సిన అవసరం లేదు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయి. గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కృష్ణానదిలో మాత్రమే నీళ్లు తక్కువగా ఉన్నాయి. కొత్త అథారిటీ ఎలా కేటాయిస్తే అలా తీసుకుందాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు నేను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు "అని చంద్రబాబు అన్నారు.

# బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో మంత్రి లోకేశ భేటీ

అమరావతి: బ్రిటన్ మాజీ ప్రధాని, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) వ్యవస్థాపకుడు టోనీ బ్లెయిర్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ లో టోనీ బ్లెయిర్ ను మంత్రి లోకేశ్ కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. ఏపీ ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యావ్యవస్థలో ఏఐ టూల్స్ ను ఉపయోగించడానికి తమ సంస్థ అయిన టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) ద్వారా సహకరించేందుకు టోనీ బ్లెయిర్ అంగీకరించారు. ఆ మేరకు విద్యారంగంలో అధునాతన సాంకేతికతను అమలుచేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ఏపీ విద్యాశాఖ, టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ) నడుమ 2024 డిసెంబర్ లో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా టీబీఐ విజయవాడలో తమ ఎంబెడెడ్ బృందాన్ని మోహరించి రెండు ప్రధాన అంశాలపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తోంది. అందులో 1. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యలో సంస్కరణలు 2. గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ స్థాపన. ఏపీ విద్యాశాఖ, టీబీఐ నడుమ ఒప్పందం తర్వాత ఏ మేరకు పురోగతి సాధించారనే అంశంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న నైపుణ్యాభివృద్ధి ఎజెండా, స్కిల్ సెన్సస్, దేశం వెలుపల యువతకు ఉపాధి వంటి అంశాల్లో టీబీఐ సాంకేతిక మద్దతుపై ఈ సమావేశంలో చర్చించారు. గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సలహా బోర్డులో చేరాల్సిందిగా టోనీ బ్లెయిర్ ను మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా ఆహ్వానించారు. నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ మధ్య ఒప్పందం కుదిరింది. ఆగస్టులో విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్రాల విద్యామంత్రుల కాంక్లేవ్ కు టీబీఐ భాగస్వామిగా ఉంటుందని టోనీ బ్లెయిర్ అన్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్, టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఢిల్లీ గంగారామ్ ఆసుపత్రి నుంచి

# సోనియా గాంధీ డిశ్చార్జ్



ఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ గురువారం నగరంలోని సర్ గంగా రామ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఉదర సంబంధిత అనారోగ్యానికి చికిత్స పొందిన ఆమె ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. జూన్ 15న ఉదర సంబంధిత సమస్యతో సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. సర్ గంగా రామ్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ మాట్లాడుతూ, సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు ధృవీకరించారు. 78 ఏళ్ల సోనియా గాంధీకి చికిత్స అందించిన వైద్యులు డాక్టర్ ఎస్. నూండీ, డాక్టర్ అమితాబ్ యాదవ్, ఆమె పొత్తికడుపు ఇన్ఫెక్షన్‌తో బాధపడ్డారని, మందులతో చికిత్స అందించామని తెలిపారు. "సాధారణ చికిత్సతో ఆమె పరిస్థితి మెరుగుపడింది. తదుపరి చికిత్సను ఔట్ పేషెంట్‌గా కొనసాగిస్తారు, ఆమె ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తాం" అని వారు వివరించారు.లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఆమె కుమారుడు రాహుల్ గాంధీ నేడు తన 55వ పుట్టినరోజు జరుపుకుంటున్న రోజే సోనియా గాంధీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావడం వారి కుటుంబంలో సంతోషం కలిగించింది. వివిధ పార్టీల నాయకుల నుంచి రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తగా, తల్లి ఆరోగ్యం మెరుగుపడి ఇంటికి రావడం కుటుంబ సభ్యులకు మరింత ఆనందాన్ని కలిగించింది.

# ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజం

ఎక్కడికి రమ్మన్నా వస్తా. తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ వేగవంతం చేయాలి. ఆనాడు జగన్, కేసీఆర్ మధ్య ఉన్న సంబంధం చూసి రక్త సంబంధం కూడా చిన్నబోయింది. ఫోన్ ట్యాపింగ్.. తెలంగాణలో నన్ను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకు ఆ ఇద్దరు కలిసి వేసిన స్కెచ్.ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలిస్తే మీరు ఏం చేశారు అని నన్ను అడగొచ్చు. ఆనాడు ఉన్న పరిస్థితులు వేరు. అప్పుడు జగన్, కేసీఆర్ చేసినవి అరాచకాలు. వీరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చిన్నది. నేను జగన్‌కు తోడబుట్టిన చెల్లెల్ని. ఆ విషయం మరిచి నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదు అని కుట్ర చేశారు. నా భవిష్యత్తును పాతిపెట్టాలని ఎన్నో చేశారు. నాకు మద్దతు పలికిన వాళ్లను బెదిరించారు. రాజకీయంగా నా వాళ్లు రానివ్వకుండా చేశారు. నేను తెలంగాణలో పార్టీ పెట్టడంలో జగన్‌కు ఏ సంబంధం లేదు. కేసీఆర్ కోసం నన్ను తొక్కి పెట్టాలని చూశారు. నా చుట్టూ పరిస్థితులను కష్టతరం చేశారు. నా ప్రతి పోరాటానికి అడ్డుపడ్డారు." అని షర్మిల అన్నారు.తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ లపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మీడియా సమావేశంలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ, "ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?" అంటూ వైఎస్ జగన్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థి అయినందుకే తన వ్యక్తిగత సంభాషణలను కూడా దొంగచాటుగా విన్నారని, ఇది వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు కూడా విఘాతమని ఆమె పేర్కొన్నారు.తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఫోన్ ట్యాపింగ్ తతంగం నడిచిందని షర్మిల ఆరోపించారు. "ఒక మహిళ అని కూడా చూడకుండా, ఒక రాజకీయ నాయకురాలిగా నా కార్యకలాపాలను అడ్డుకోవడానికి, నా వ్యూహాలను తెలుసుకోవడానికి ఇంత నీచమైన చర్యలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆమె దుయ్యబట్టారు.ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రత్యర్థులపై నిఘా పెట్టడం, వారి సంభాషణలను రహస్యంగా వినడం వంటివి చట్టవ్యతిరేకమని, నైతికంగా కూడా తప్పని ఆమె స్పష్టం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరిపించాలని, ఇందులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె హితవు పలికారు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమైతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆమె హెచ్చరించారు. గతంలో వైవీ సుబ్బారెడ్డి సైతం ట్యాపింగ్ విషయాన్ని ధ్రువీకరించి, ఓ ఆడియోను తనకు వినిపించారని షర్మిల వెల్లడించారు. తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకే కేసీఆర్, జగన్ కలిసి ఈ కుట్ర పన్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఘటనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు తక్షణం విచారణను వేగవంతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసీఆర్ కోసం జగన్ తనను రాజకీయంగా అణచివేయాలని చూశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు ఎప్పుడు పిలిచినా తాను హాజరవుతానని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్దంగా 42 శాతం రిజర్వేషన్ కోసం బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బీసీల గొంతుకగా పనిచేస్తుందన్నారు.

# కాలువ మారాలి.. కలత తీరాలి

– దశబందు కాలువ మరమ్మత్తు పనులు పరిశీలించిన అధికారులు



రెంటచింతల, మండల రిపోర్టర్ –శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): సాగునీటి కాలువల మరమ్మత్తు పనులు వ్యవసాయ ఉత్పాదతకు ఎంతో కీలకం. రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పంట కాలువల శివారు ప్రతి ఎకరానికి నీరు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైకాపా ఐదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాగునీటి పారుదల వ్యవస్థను దశలవారీగా చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క తొలగింపు, స్లూయిస్ల నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో పూడికతీత చేపట్టనున్నారు. ఒక్కో పని రూ. 10 లక్షల లోపు అంచనా విలువతో నిర్ణయించి, నామినేషన్ విధానంలో సాగునీటి సంఘాల సంఘాల ప్రతినిధుల పర్యవేక్షణలో చేపట్టనున్నారు. గత జగన్ పాలనలో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల సాగునీటి రంగం నిర్లక్ష్యానికి గురై ఏటా కనీస నిర్వహణ పనులు సైతం జరగలేదు. ఇప్పుడు వీరి పర్యవేక్షణలోనే కాలువల మరమ్మత్తు పనులు చేయడంవల్ల ఏడాది పొడవునా బాధ్యతాయుతంగా నిర్వహణ చేయడంతో పాటు, సమస్య ఉన్న ప్రాంతాల్లో దృష్టి సారించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అన్నదాతలకు మేలు జరిగేలా మండలంలోని కాలువల మరమత్తు పనులకు రూ.1.33 కోట్లు నిధులు కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. మండలానికి జీవనదిగా పేర్కొనే దశబందు మేజర్ కాలువ మరమత్తు పనులకు రూ. 33 లక్షలు కేటాయించారు. ఈ మేజర్ కింద 4384 ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీటి వనరుల మరమ్మత్తు పనుల పరిశీలనలో భాగంగా గురువారం ఇరిగేషన్ ఈ ఈ టి రమేష్ దశబందు కాలువ క్షేత్ర పర్యవేక్షణ చేసి పనులను పరిశీలించారు. పరిశీలనలో వారి వెంట డీసీ చైర్మన్ పోట్ల నరసింహారావు,డీఈ మురళీధర్,ఏఈ సుధాకరరావు, పలువురు సాగునీటి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 20వేల రూపాయలు చేసే సౌండ్ సిస్టం బహూకరణ.



మాచర్ల నియోజకవర్గం ఇంచార్జ్, వేల్పుల చిన్న గురవయ్య ( శుభోదయం న్యూస్)రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల వారి ఆధ్వర్యంలో గురువారం వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడు నందుగల ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొండవీటి కృష్ణకుమారి ఆ పాఠశాలకు సుమారు 20 వేల రూపాయలు ఖరీదు చేసే సౌండ్ సిస్టంను బహుకరించటం జరిగింది. దీని ద్వారా పాఠశాలలోని అనేక సామాజిక, జాతీయ పండుగలు ఉత్సవాలు, పాఠశాల వార్షికోత్సవాల వంటి కార్యక్రమాలలో, మోటివేషన్ వంటి క్లాసులు అవసరాల సందర్భంలో పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని రోటరీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య తెలియజేశారు. ఈ సందర్భంలో రోటరీ క్లబ్ సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ పాఠశాలకు అవసరమైన విద్యుత్ మరియు ఫ్యాన్ల మరమ్మత్తుల కొరకు అవసరమైన సహాయాన్ని అందించడం జరిగింది. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల వారు చేసిన సహాయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుని పద్మావతి కొనియాడారు. పాఠశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు హర్షాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ ఎలెక్ట్ తుమ్మల సత్యప్రసాద్, సెక్రెటరీ ఎలెక్ట్ ఆలేటి కోటేశ్వరరావు, పఠాన్ నాగూర్ వలి, శివపార్వతి, పాఠశాల డెవలప్మెంట్ చైర్మన్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తుమృకోటలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



రెంటచింతల, మండల రిపోర్టర్ –శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): వైవాహిక జీవితంలో తలెత్తిన ఇబ్బందులతో విరక్తి చెంది వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని తుమృకోటలో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలో వైవాహిక జీవితం గడుపుతున్న భార్యాభర్తలు పేరుపోగు సైదులు33) సాగరికలకు రిషి, ఝాన్సీ సంతానం. మద్యానికి బానిసైన భర్తతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా పిల్లలతో కలిసి సారంగపల్లి అగ్రహారం గ్రామంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. గత రెండేళ్లుగా వీరు విడివిడిగా ఉంటున్నారు.భార్య, పిల్లలు దూరమై మనోవేదనతో జీవితంపై విరక్తి చెందిన సైదులు గురువారం ఇంటి పైకప్పు ఇనుప గుగ్గిలకు తాడు బిగించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నేడు సాయి విహార్ లో షిరిడి సాయిబాబా పుష్కర వార్షికోత్సవ వేడుకలు




పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ – శీనివాసరావు (శుభోదయం నూస్): పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులో శ్రీ సాయి విహార్ (శ్రీరామ్నగర్ తూర్పు... జానపాడు) ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమైన పూజా కార్యక్రమాలు అభిషేకాలు హెూమ పూజలు అనంతరం ఈరోజు గురువారం చివరి రోజు శాంతి కళ్యాణం పూజా కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ వారు తెలిపారు..... మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు మహా అన్న ప్రసాదం జరుగుతుందన్నారు... సాయంత్రం 6 గంటలకు స్వామివారి పిడుగురాళ్ల పట్టణంలో పురవీధులలో ఊరేగింపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.... భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అన్నప్రసాదాలు తీసుకోవాలని కోరారు.

## కనేకల్లు నూతన తహసిల్దార్ గా పదవి బాధ్యతలు చేపట్టిన బ్రహ్మయ్య



కనేకల్లు, మండల విలేకరి – మా మాల్యం కిరణ్ కుమార్ జూన్ 20 (శుభోదయం న్యూస్) : కనేకల్ మండల నూతన తహసిల్దార్ గా బ్రహ్మయ్య పది బాధ్యతలు చేపట్టారు ఈ నేపథ్యంలోగురువారం కనేకల్ మండల వైఎస్సార్ సీపీ నాయకులు మండల కన్వీనర్ పార్టీ పాటిల్ బ్రహ్మనంద రెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారన్న పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి ఆది సద్గురు చంద్రశేఖర్ రెడ్డి మాజీ కన్వీనర్ ఆలూరు జక్కన్న బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు దాసరి శీను మారంపల్లి మహేష్ ఆది సద్గురు జయరాం రెడ్డి ఉడే గోళంనాగరాజు నూతన తహసిల్దార్ బ్రహ్మయ్య ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్డిటీని కాపాడుకుందాం కనేకల్ మండల వైసీపీ నాయకులు





కనేకల్, మండల్ విలేకరి – మాల్యం కిరణ్ కుమార్ జూన్ 20 (శుభోదయం న్యూస్): ఆర్డిటిని ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని మాజీ ఎంపీ తలారి రంగయ్య సేవ్ ఆర్ డి టి కార్యక్రమం భాగంగా ఆయన పాదయాత్ర ఎంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తిచ్చిందని కనేకల్ మండల వైసీపీ నాయకులు పేర్కొన్నారు ఇందులో భాగంగా కళ్యాణ్ దుర్గం నియోజకవర్గం నేటితోపూర్తయిన సందర్భంగా కనేకల్ మండల వైసీపీ నాయకులు జడ్పిటిసి దాసరి పద్మ వతి జిల్లా వైసీపీ పార్టీ ఉపాధ్యక్షులు మారంపల్లి మారన్న జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి మండల వైసీపీ కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి రామిరెడ్డి రాయదుర్గం నియోజకవర్గం ట్రేడ్ యూనియన్ విభాగం శ్రీనివాసులు జక్కల వాడి రమేష్ రాఘవరెడ్డి తిమ్మారెడ్డి పోలిచెర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ అకస్మాత్తుగా తనిఖీ చేసిన కడప జిల్లా ఎస్పీ...



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): పోరుమామిళ్ల ఆకస్మికంగా పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీకలసపాడు పోలీస్ స్టేషన్లో కడప జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఆకస్మిక తనిఖీ పలు రికార్డులు పరిశీలన శభాష్ అన్న ఎస్పీపోరుమామిళ్ల సర్కిల్ పరిధిలోని పనితీరును మెచ్చుకున్నా జిల్లా యాస్పి ఈ కార్యక్రమంలో డిఎస్పి రాజేంద్రప్రసాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి శ్రీనివాసులు ఎస్సై ఎల్ తిమోతి కలసపాడు పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ 55వ జన్మదిన శుభాకాంక్షలు....



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్): శ్రీ రాహుల్ గాంధీ గారి 55వ జన్మదినోత్సవ వేడుకలను బద్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం పగడాల నరసింహ మాట్లాడుతూ పేద,బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, కాబోయే భావి భారత ప్రధాని శ్రీ రాహుల్ గాంధీ గారు భారత్ జోడోయాత్ర ద్వారా దేశమంతా ప్రయాణించి మతసామరస్యం రాజ్యాంగ పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా జోడో యాత్ర చేయడం జరిగింది అని రాబోయే కాలంలో ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ నాయకులకు అండగా ఉండేది ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకోరావడానికి రాహుల్ గాంధీ గారు పెద్ద ఎత్తున కృషి చేస్తారని మాకు నమ్మకం ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ వై అచ్యుతరాజు గోపవరం మండల అధ్యక్షుడు సాంబయ్య, బద్వేలు పట్టణ బీసీ నాయకులు బత్తల వెంకటేష్, శివ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## మలేరియా పై అవగాహన కల్పించిన డాక్టర్స్....



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ):మలేరియా పై అవగాహన ఈరోజు అనగా 19/6 /25వ తేదీన బద్వేల్ మండలం తొట్టిగరిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వనంపుల సచివాలయం నంది పల్లె గ్రామం నందు మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవం సందర్భంగా మలేరియా పై అవగాహన మరియు లార్వా పరిశీలన చేయడమైనది.ఈ కార్యక్రమం హెల్త్ అసిస్టెంట్ వి. జనార్ధనరావు మాట్లాడుతూ ఇన్ఫెక్టెడ్ దోమ కుట్టిము ద్వారా వచ్చు మలేరియా, డెంగీ,చికెన్ గున్యా మెదడు వాపు, ఫైలేరియ మొ వ్యాప్తి చెందునని, నివారణకు పరిసరాల శుభ్ర ము ఉంచకవాలని, దోమలు కుట్టికుండ దోమ తెరలు వాడాలని , నీళ్లు నిల్వ ఉన్న ప్రదేశం శుభ్రం మరియు ఇంట్లో వాడే వస్తువులను శుభ్రం ఉంచి, ప్రతి శుక్రవారం వారంకి ఒక సరి శుభ్రం చేసుకోని శుభ్రం గా ఉంచాలని పేర్కొన్నారు, ఈ కార్యక్రమం లోహెల్త్ అసిస్టెంట్ వి. జన్ధనారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్యోస్తన, ఏ ఎన్ యం రమాదేవి, దీపిక ఆశలు, 104 సిబ్బంది పాలుగోన్నారు.

## ప్రధానమంత్రి సూర్య ఘర్ - ముఫ్త్ బిజిలీ యోజన అవగాహన సదస్సు...




బడ్జెట్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి( శుభోదయం న్యూస్): 20/6 /2025 తేదీన అనగా రేపు సాయంకాలం 3 గంటలకు ,బద్వేల్ సబ్–స్టేషన్ కాంపౌండ్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణము, మైదుకూరు రోడ్డు నందు ప్రధానమంత్రి సూర్య ఘర్ – ముఫ్త్ బిజిలీ యోజన కింద ఇంటి పైకప్పు మీద సోలార్ ఫలకలు ఏర్పాటు చేసుకునే పథకము మీద మన గౌరవ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ ఎన్.భరణి కృష్ణ అధ్యక్షతన మరియు గౌరవ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ ఎస్ రమణ గారి ముఖ్యఅతిథిగా అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగినది, ఇందులో సోలార్ రూపు టాప్ గురించి అలాగే విద్యుత్ బిల్లు తగ్గించడం గురించి వివరించడం జరుగుతుంది.

## ఇంట్లో అందరి పిల్లలకూ తల్లికి వందనం వర్తింపు: ఎన్ఎండి ఫిరోజ్





నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): తల్లికి వందనం పథకం అమలుతో పేద విద్యార్థుల ఇళ్లలో ఆనందం వ్యక్తమవుతోందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా గోస్పాడు మండలం జూలేపల్లి గ్రామం నందు థాంక్యూ సీఎం సార్ అంటూ సీఎం చంద్రబాబు నాయుడు , మంత్రులు నారా లోకేష్ , ఎన్ఎండి ఫరూక్ ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు . అనంతరం తల్లి అకౌంట్లో పడిన 13 వేల రూపాయల డబ్బులను తల్లిదండ్రులకు స్వయంగా ఫిరోజ్ అందజేశారు .ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంతో, జగన్ రెడ్డి, ఆయన పార్టీ నాయకులకే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ముఖ్యమైన తల్లికి వందనం పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు . ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సలిపెల ఓబుల్ రెడ్డి , గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , భాస్కర్ రెడ్డి , జి మనోహర్ రెడ్డి ,ఎం.సుబ్బారావు రెడ్డి , రవి , మహేష్ , ఫరూక్ హుస్సేన్ , మనోహర్ , సుబ్బయ్య మరియు గోస్పాడు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు పక్కన చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణం



నెల్లూరు జిల్లా ప్రతినిధి –శ్రీనివాసులు శుభోదయం న్యూస్ ( సైదాపురం ):గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన సైదాపురం తహశీల్దార్ కార్యాలయం కు దగ్గర లో మెయిన్ రోడ్డు పక్కన చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణం చేసుకున్నట్లు గా మృత దేహం కలకలం సృష్టించింది . పోలీసులు తెలిపిన ప్రకారం చంగనపల్లి రోడ్డుఏగోకులబృందవనం రోడ్డు సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్థానికులకు కన్పించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడికి సుమారు 40 ఏళ్ళ వయస్సు ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు షర్టు, బులుగు రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ మృతుడి వివరాలు తెలిసిన వారు మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే వారికి సమాచారం ఇవ్వాలని సైదాపురం ఎస్ ఐ ఎన్ క్రాంతి కుమార్ 9440796345 ను సంప్రదించాలని కోరారు.

## తహసిల్దార్ ఎస్ రవి ను మర్యాద పూర్వకంగా కలిసిన నాయకులు..



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): తుగ్గలి మండల తహసిల్దార్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్ .రవి ను గురువారం వివిధ రాజకీయ పార్టీల కు చెందిన నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలు మాలలతో సత్కరించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన చెన్నంపల్లి మా భాష, సిపిఐ పార్టీ చెందిన నబి రసూల్, రోల్లపాడు వెంకటేష్, సిపిఎం నాయకులు ఉప్పర్లపల్లి శ్రీరాములు, అలాగే వివిధ రాజకీయ పార్టీలు చెందిన నాయకులు కలిశారు. సందర్భంగా తహసిల్దార్ ఎస్. రవి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తాను 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. రెవెన్యూ పరంగా ఏ సమస్య వచ్చినా ఆ సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ లు సుధాకర్ రెడ్డి, రాముడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటరాముడు, మండల సర్వేయర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డిటి సంస్థ ను కాపాడాలంటూ ధర్నా..




తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఆర్డిటి సంస్థను కాపాడాలంటూ గురువారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన ప్రజలు ధర్నా చేశారు ఈ ధర్నాలో మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యులు నబి రసూల్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు రోల్లపాడు వెంకటేశు సిపిఎం మండల కార్యదర్శి ఉప్పర్లపల్లి శ్రీరాములు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంవత్సరాల నుండి కృషి చేస్తున్న ఆర్డిటి సంస్థకు ఇతర దేశాల నుండి నిధులు రాకుండా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిలుపుదల చేయడం సరికాదన్నారు అందువల్ల అన్ని రాజకీయ పార్టీ నాయకులు బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి విదేశాల నుండి ఆర్ డి టి సంస్థకు నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు అనంతరం తహసిల్దార్ కు వారు వినతి పత్రం అందజేశారు..

## శ్రీ దుర్గా వీరభద్ర స్వామి ఆలయం హుండీ లెక్కింపు.



లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ ) ఈ రోజు సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీ దుర్గా వీరభద్ర స్వామి ఆలయం లో ఆలయ చైర్మన్ కరణం శ్రీ రమనందన్ , ఆలయ నరసింహ రాజు , ఈఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో నేడు ఆలయ హుండీ లెక్కింపు జరిగింది.లిఆలయ హుండీ ఆదాయంలి8,16,341/– రూ,, వచ్చినట్టు ఆలయ అధికారులు,కమిటీ చైర్మన్, సభ్యులు, అర్చకులు అందరి సమక్షంలో వెల్లడించడం జరిగింది.

## 30 సంవత్సరాలుగా సిమెంటు రోడ్డు కోసం ఎదురు చూపులు





(శుభోదయం న్యూస్), బాపట్ల: గంపాల వెంకటేశ్వరరెడ్డి పాలెం గ్రామస్తులు, దివ్యాంగులు,వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, రైతులు, విద్యార్థిని విద్యార్థులు గత 30 సంవత్సారాలు గా కనీసం సిమెంటు రోడ్డు నిర్మించాలని వినతి 500 మంది ప్రత్యేక్షంగా 1500 మంది పరోక్షంగా సిమెంటు రోడ్డు లేక ఇబ్బంది పడుతున్న వైనం1.అనేక సార్లు గ్రీవెన్స్ లో వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోని అధికారులు.2. వైసీపీ ప్రభుత్వానికి మరియు ప్రస్తుత ప్రభుత్వానికి సంభందించిన ఎమ్మెల్యే లకు అనేక సార్లు ఇచ్చిన వినతి పత్రాలు.3. చదువులు కోసం మూడు రైల్వే ట్రాకులు దాటుతూ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు4. రైతులు పంటలను అదే రైల్వే ట్రాకులు దాటి మార్కెట్ కి తరలింపులు5. విద్య,వైద్యం కోసం అవస్థలు 6. ఊరులోకి ఇంతవరకు రాని అంబులెన్స్, స్కూల్ వ్యాను 7. కనీస అవసరాలు కోసం ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులు కుక్కల వారి పాలెం, దరివాద కొత్తపాలెం, మహాత్మాజీ పురం, గంపాల వెంకటేశ్వరరెడ్డి పాలెం గ్రామస్తులు సుమారు 30 సంవత్సరాలు గా రోడ్డు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు మూడు రైల్వే ట్రాకులు దాటలేక ప్రణాలు కోల్పోతున్నారు కనీసం అంబులెన్స్, స్కూల్ వ్యాన్ కూడా ఇంతవరకు ఆ ఊరులో చూడని వైనం అక్కడ ఉంది, గంపాల వెంకటేశ్వర రెడ్డి పాలెం నుండి కంకటాపాలెం రైల్వే రోడ్డు వరకు బందరు డొంక అనేది ఉంది దానిని పూర్తి సర్వే చేయించి రైతులకు నష్టం జరగకుండా రోడ్డు అనేది నిర్మించి ఇవ్వాలని కోరుతున్నాము మాట తప్పిన గత ప్రభుత్వం: 2019 –2024 వరకు ఎలెక్షన్ టైం లో రోడ్డు నిర్మిస్తానని మాట ఇచ్చి తప్పారు అలాగే ప్రస్తుత ఎమ్మెల్యే మరియు తమ అనుచరులు కూడా అదే మాదిరిగా మాట ఇచ్చారు ఈ ప్రభుత్వం వారు అయిన కనీసం సిమెంటు రోడ్డు నిర్మించాలని కోరుతున్నాము ప్రస్తుత కలెక్టర్ దగ్గరకు దివ్యంగుడైనా కోకి రాజశేఖర్ రెడ్డి ఇప్పటికి 3 సార్లు ఈ రోడ్డు నిమిత్తం అయ్యి వినతి పత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేదు గ్రామస్తులు అందరిచే సంతకాలు సేకరణ చేసి ఇచ్చిన ప్రయోజనం లేదుఎంతో కష్టపడి ఒక దివ్యంగుడు సేకరించిన ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి చెప్పిన ఉపయోగం లేదు బాపట్ల ప్రభుత్వ అధికారులకు, మరియు సిబ్బందికి , నాయకులకు, రాజకీయ నేతలకు వినతి



దయచేసి పంపాల వెంకటేశ్వర రెడ్డి పాలెం నుండి కంకట పాలెం రైల్వే గేటు వద్దకు కనీసం ఒక సిమెంటు రోడ్డు నిర్మించాలని కోరుతున్నాము. ఎట్టి పరిస్థితులలో ఇబ్బందులు ఉన్న అవి ప్రభుత్వం తీర్చి రోడ్డు నిర్మించాలని కోరుతున్నా దివ్యాంగుల నాయకులు స్థానిక ప్రజలు,

## కార్యకర్తల అభిప్రాయం మేరకే గ్రామ, మండల కమిటీల ఎన్నిక



లేపాక్షి, మండల రిపోర్టర్ - అమరేష్ (శుభోదయం న్యూస్) : తెలుగుదేశంపార్టీ గ్రామ,మండల స్థాయి ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని లేపాక్షి మండల పార్టీ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర వొక్కాలిగా సాధికార సమితి కన్వీనర్ వి ఎం పాండురంగప్ప అన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఆయన హిందూపురం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో గౌరవనేయులు హిందూపురం శాసనసభ్యులు పద్మభూషణ్, శ్రీ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు అయన కార్యాలయం లో వ్యక్తి గత సహాయకులు సురేంద్ర , బాలాజి , తో లేపాక్షి మండలం తెదేపా సంస్థగత ఎన్నికల ప్రక్రియపై సురేంద్ర తో, బాలాజి తో, కార్యకర్తలు సమావేశం తేదీ చర్చించి మండల,గ్రామ స్థాయి నాయకులకు తెలియచేసి సమావేశం ఏర్పాటు చేసి కమిటీలను ఎన్నుకొనే కార్యక్రమం ఏర్పాటు చేద్దాం అని చర్చించడం జరిగింది,ఈ సమావేశానికి హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్, హిందూపురం పట్టణ అధ్యక్షులు, వెంకటేష్, హిందూపురం రూరల్ మండలం పార్టీ అధ్యక్షులు హెచ్ ఎన్,రాము, లేపాక్షి మండల పార్టీ అధ్యక్షులు అబిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పందించిన అధికారులు



బీర్కూరు, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలో ఇటీవల 'వృథా అవుతున్న త్రాగు నీరు' అనే శీర్షిక తో పోచారం కాలనీ లో ప్రధాన రహదారి పైన ప్రధాన పైపులైనుకు 24 గంటలు నీరు వచ్చే విధంగా కాలనీ వాసుల నిత్యవసరాల నిమిత్తం ఓ కుళాయి ఏర్పాటు చేశారు ఇటీవల కుళాయి పాడవడం తో నీరు వృథా అవుతున్న విషయం శుభోదయం న్యూస్ పత్రికలో ప్రచూరితం అయిన వార్త కు స్పందించిన అధికారులు. కొత్త కుళాయి నీ ఏర్పాటు చేశారు. అధికారులకు ధన్యవాదాలు తెలిపిన కాలనీవాసులు.

## బీర్కూర్ లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్షనేత రాహూల్ గాంధీ జన్మదిన వేడుకలు బీర్కూరు పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు,మాజీ ఎంపీటీసీ సందీప్,యువనాయకులు మియ్యాపురం శశికాంత్,శంకర్,బస్వరాజ్ పటేల్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కౌశిక్ ఎలక్ట్రికల్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ యూనియన్ మీటింగ్.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): నిజామాబాద్ జిల్లా బోధన్ లో కౌశిక్ ఎలక్ట్రికల్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ యూనియన్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. బోధన్ లో కౌశిక్ ఎలక్ట్రికల్ నవీన్ ఆధ్వర్యం లో హావెల్స్ కంపెనీ ఎలక్ట్రికల్ మీటింగ్ లో హావెల్స్ కంపెనీ ప్రోడక్ట్. క్వాలిటీ గురించి ఎగ్జిక్యూటివ్ సుధాకర్ రెడ్డి వివరించారు. మరియు హావెల్స్ ఈ ప్లస్ యాప్ రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎలక్ట్రిషన్ కి ఒక లక్ష ఇన్సూరెన్స్ సదుపాయం కూడా ఇస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహ హిత్,కృష్ణ,సుధాకర్, ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ 54 వ జన్మదిన వేడుకలు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 54 వ జన్మదిన వేడుకలు వలిగొండ పట్టణలోని మల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో యూత్ కాంగ్రెస్ వలిగొండ మండల అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు,కార్యకర్తలు విద్యార్థులు రాహుల్ గాంధీకి 54 వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైసొల్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స్థానిక భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని భువనగిరి నియోజకవర్గంలో ప్రతి పాఠశాలకు ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నారని విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు పై చదువులు చదువుకొని మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వలిగొండ ఎం ఈ ఓ సుంకోజు భాస్కర్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకోజు చంద్రమౌళి ఉపాధ్యాయులు కిరణ్,అసెంబ్లీ యూత్ ప్రధాన కార్యదర్శి బుగ్గ ఉదయ్,యూత్ మండల ఉపాధ్యక్షులు మత్స్యగిరి మండల యూత్ ప్రధాన కార్యదర్శి తోట సాయి, సోమేశ్,అరుణ్, దుర్గ, వినోద్,బిక్షపతి, భార్గవ్,రవి యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు
## పండ్లు పంపిణీ మరియు అన్నదాన కార్యక్రమం
## టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) జూన్ 19: గురువారం గజ్వేల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి గజ్వేల్ పట్టణంలోని కేసరి హనుమన్ దేవాలయంలో పూజలు నిర్వహించి కేకు కట్ చేసి. అన్న ప్రసాద వితరణ చేసి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు మాట్లాడుతూ అన్ని అసమానతలతో పోరాడటం రాహుల్ గాంధీ వ్యక్తిత్వం అన్నారు బడుగు బలహీన అణగారిన వర్గాల పక్షాల నిలబడాలన్నది రాహుల్ గాంధీ దృక్పథం త్యాగం వారసత్వం పోరాటమే ఆయన తత్వం అన్నారు. రేపటి భవిష్యత్తు కోసం భారతదేశ ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ మరియు నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా ఈ రెండు సంస్థల విధివిధానాలు మరియు వ్యూహాలను రూపొందించడంలో రాహుల్ గాంధీ ముఖ్య పాత్ర పోషించారని. 2004 మరియు 2009 రెండు పర్యాయాలు ప్రధాని పదవిని త్యాగం చేసిన ఘనత రాహుల్ గాంధీకి దక్కిందన్నారు. దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా దేశవ్యాప్తంగా ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు భారత్ జూడో యాత్ర పేరుతో పాదయాత్ర చేసిన ఏకైక వ్యక్తి అన్నారు భారతదేశ ప్రజలను ఏకం చేయడం వారి సమస్యలను వినడం లక్ష్యంగా పెట్టుకొని యాత్రను విజయవంతం చేసి కోట్ల మంది గుండెల్లో ధైర్యం అనే జెండాను నాటి దానికి అండగా నిలుస్తున్న ఏకైక వ్యక్తి యువ కిశోరుడు భవి భారత ప్రధాని రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగం రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశంలో విద్య ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు శ్రమించి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ తేవాలని అన్నారు గజ్వేల్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరు మల్లారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జయాల వేణుగోపాల్, తూముకుంట విష్ణువర్ధన్ రెడ్డి, భూమ్ రెడ్డి హనుమంతరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు సయ్యద్ బాబా, మామిడి కృష్ణ, రాజలింగం గౌడ్ ,శాంతం స్వామి



బుచ్చిరెడ్డి, నాయకులు నాయకం శ్రీనివాస్ మంగలి యాదగిరి, మంగలి స్వామి, కుమ్మరి నందన్, నవీన్ గౌడ్, ఆర్ అండ్ ఆర్ కాలనీ ఏటిగడ్డ కృష్ణాపూర్ నాయకులు నాయిని శ్రీనివాస్ అరికెల స్వామి, నిమ్మరాజు రవి, నాయిని నరసింహులు, సందనమైన అశోక్, నాయిని వెంకటేష్ ,బానోతు నరేందర్ నాయక్ బానోతు రాజు నాయక్, నాయిని లింగం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదిహేనవ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన జెసిబి మినీ ఎక్స్ క వేటర్ యంత్రాన్ని అదనపు కలెక్టర్ కమిషనర్ తో కలిసి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రారంభించినారు



రామగుండం మండలం, రిపోర్టర్ - తిరుపతి, (శుభోదయం న్యూస్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి భాద్యతని రామగుండం శాసన సభ్యులు ఎం. ఎస్ . రాజ్ ఠాకూర్ అన్నారు. పదిహేనవ ఆర్థిక సంఘం టైడ్ నిధులు రూ 30.00 లక్షల అంచనా వ్యయంతో కొనుగోలు చేసిన జె సి బి మినీ ఎక్స్ కవేటర్



యంత్రాన్ని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) కమిషనర్ ( ఎఫ్ ఏ సి ) అరుణ శ్రీ తో కలిసి రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామగుండం నగరాన్ని పరిశుభ్రమైన సుందర నగరంగా తీర్చిదిద్దే క్రమంలో నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టడానికి ఆధునిక యంత్రాలు సమకూర్చుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ రోజు ప్రారంభించిన మినీ ఎక్స్ కవేటర్ యంత్రం ద్వారా ఇక ముందు మురుగు నీటి కాలువల్లో పూడిక తీత ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు. మౌళిక వసతులైన రోడ్లు , కాలువలు , వీధి దీపాలు , నల్లా కనెక్షన్ లు ఇచ్చే పనులు అన్ని డివిజన్లలోనూ చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) కమిషనర్ ( ఎఫ్ ఏ సి ) అరుణ శ్రీ నేతృత్వంలో అధికార బృందం అద్భుతంగా పని చేస్తుందని అన్నారు. త్వరలోనే రామగుండం నగరాన్ని అత్యద్భుతంగా తీర్చి దిద్దుతామని అన్నారు. కాలువలు, రోడ్లపై చెత్త పడవేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు రామగుండం నగర పాలక సంస్థ చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , సానిటరీ ఇన్స్పెక్టర్ కుమార స్వామి మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గము ఎన్నిక అధ్యక్షులు అవునూరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా తౌటం సతీష్



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్): తేదీ 18-06-2025 బుధవారం రోజున క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో క్లాత్



మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు గా అవునూరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా తౌటం సతీష్, కోశాధికారిగా అరకుల శ్రీనివాస్ మరియు కార్యవర్గమును గౌరవ అధ్యక్షులు ఇప్పలపల్లి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించినారు. తదుపరి క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులందరూ కృతజ్ఞతలు తెలియజేసినారు.

## వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్): వరంగల్ కాశిబుగ్గ సెంటర్ లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్రనేత లోక్ సభ సభ్యులు రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేయడం జరుగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేందర్ కుమార్, బస్వారాజు శిరీష శ్రీమన్, మాజీ కార్పొరేటర్లు దామెర సర్వేశం, జన్ను అరుణ్, తత్తరి లక్ష్మణ్, ధూపం సంపత్, బిల్లా శ్రీకాంత్, జన్ను రవి, సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్, వరంగల్ తూర్పు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి సలీం, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కుసుమ వరుణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోరంటల రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్




నాయకులు సేవాదళ్ రామ్ సింగ్, మోహన్, ఎండి సాదిక్, రాముల బాబు,అందే సునీల్, వస్కుల ఉదయ్, తోట బాలరాజు, జన్ను వేణు, పెండ్యాల కొమురయ్య, గుండేటి సతీష్, చిరంజీవి, సందేల దామోదర్, గజ్జెల లింగమూర్తి, కొమ్ము రాజకుమార్, రాచర్ల కుమార్, బుర్ర నటరాజ్, ఉమేందర్, జన్ను శ్యామ్, బండ్ల సురేందర్, వేణు, వెల్దండి వరుణ్, ఎండీ ఇమ్రాన్, శేఖర్, సిరిసిల్ల శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించిన

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) జూన్ -19: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, భావి భారత ప్రధానమంత్రి. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద గురువారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ. జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేసిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావుఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూదేశాన్ని పాలించే సత్తా గాంధీ కుటుంబానికి చెందిన ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీకే ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగిందని. దేశ భద్రత విషయంలో జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ నుండి మొదలు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ప్రతిసారి రాజీ పడలేదని స్పష్టం చేశారు. కానీ ఇటీవల కేంద్రంలోని బిజెపి ప్రధాన భాగస్వామ్య ఎన్డిఏ ప్రభుత్వం పాకిస్తాన్ యుద్ధం విషయంలో అవలంబించిన ధోరణి యావత్తు దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్తాన్ తో యుద్ధానికి సన్నద్ధం అయ్యే ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారని, కానీ యుద్ధం విరమించే ముందు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయో అందరికీ తెలిసిందే అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు అన్ని రాజకీయ పక్షాలు కేంద్రానికి ఇట్టి విషయంలో సంపూర్ణ మద్దతు ఇచ్చినప్పటికీ, ప్రధాని నరేంద్ర మోడీ అవలంబించిన వైఖరి ప్రజలను విస్మయానికి గురి చేసిందన్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన జూడో యాత్ర తో ఆయన పరిణితి చెందిన విధానం, నిబద్ధత, అంకుటిత దీక్ష, సత్తా దేశ ప్రజలందరూ గమనించారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేపడుతామని రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా తన వాణి వినిపించగా.. చివరకు నరేంద్ర మోడీ దిగి వచ్చి జన గణనతో పాటు కుల గణన చేపడుతామని పేర్కొన్నారని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. కానీ జన గణన ఉత్తర్వులలో కుల గణన ప్రస్తావన లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో కుల గణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే విజయరమణ రావు స్పష్టం చేశారు. భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీని చూసేందుకు దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఇందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సన్నద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్, పట్టణ అధ్యక్షుడు పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, డి. దామోదర్ రావు, కుమార్ కిషోర్, పన్నాల రాములు, బిరుదు కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గాంధీ కుటుంబ అభిమానులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ శుభోదయం న్యూస్ జూన్ 19: ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని,పిల్లలకు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం ద్వారా వారి భవిష్యత్తు లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు అనే ముఖ్య ఉద్దేశ్యం తో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో రెయిన్ బో ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ నియమాలపై ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నప్పటి నుండే పిల్లలలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం ద్వారా వారు చిన్నప్పుడు నేర్చుకున్న ట్రాఫిక్ నియమాలు, వారి తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు పాటించే విధంగా మరియు వారికీ భవిష్యత్తు లో ఉపయోగకరంగా ఉంటాయి అని సీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు నిర్వర్తించే ట్రాఫిక్ విధులను విద్యార్థులకు వివరించడమే కాకుండా, వారితో కలిసి ట్రాఫిక్ నియంత్రణను నిర్వహించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్లకలిగే నష్టాలు, రోడ్ సేఫ్టీ వంటి కీలక అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ మరియు రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించి సురక్షితంగా గమ్యస్థానాల చేరడం, వాహనదారుల భద్రత రక్షణ పోలీస్ బాధ్యత గా ప్రమాద రహిత ప్రాంతంగా మార్చడం కోసమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించి, వారికి విద్యార్థుల చేత గులాబీ పువ్వులు అందచేసి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ హరి శేఖర్, గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ సిబ్బంది రెయిన్బో స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డిఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని,పిల్లలకు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం ద్వారా వారు భవిష్యత్తు లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు అనే ముఖ్య ఉద్దేశ్యం తో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో రెయిన్ బో ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ నియమాలపై ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నప్పటి నుండే పిల్లలలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం ద్వారా వారు చిన్నప్పుడు నేర్చుకున్న ట్రాఫిక్ నియమాలు, వారి తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు పాటించే విధంగా మరియు వారికీ భవిష్యత్తు లో ఉపయోగకరంగా ఉంటాయి అని సీఐ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు నిర్వర్తించే ట్రాఫిక్ విధులను విద్యార్థులకు వివరించడమే కాకుండా, వారితో కలిసి ట్రాఫిక్ నియంత్రణను నిర్వహించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్లకలిగే నష్టాలు, రోడ్ సేఫ్టీ వంటి కీలక అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ మరియు రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించి సురక్షితంగా గమ్యస్థానాల చేరడం, వాహనదారుల భద్రత రక్షణ పోలీస్ బాధ్యత గా ప్రమాద రహిత ప్రాంతంగా మార్చడం కోసమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించి, వారికి విద్యార్థుల చేత గులాబీ పువ్వులు అందచేసి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ హరి శేఖర్, గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ సిబ్బంది రెయిన్బో స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహణ
## వైఫల్యం ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్న నిర్వాహకుల నిర్లక్ష్యం!

నిజామాబాద్ నగరంలోని ప్రముఖ కార్యక్రమాలకు వేదికగా మారిన న్యూ అంబేద్కర్ భవన్ నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యం కళ్లకు కనబడుతున్న అధికారులకు నిర్వాహకులు మాత్రం చోద్యం చూస్తున్నారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమాలు వందల మంది పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ కార్యక్రమాలు వేలాది రూపాయలు వెచ్చించి నిర్వహిస్తుంటారు..ప్రతి వారం ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్రస్థాయి నేతలు, వందలాది ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలు జరుగుతున్నాయి న్యూ అంబేద్కర్ భవన్ నిర్వహణ బాధ్యత వహిస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్టేజ్ ఎక్కే దారిలోనే వెలుగు కనిపించే స్థాయిలో విద్యుత్ సరఫరా అయ్యే బోర్డులు విరిగిపోయి, విద్యుత్ తీగలు బహిరంగంగా వేలాడుతున్నట్టు కనిపిస్తున్నాయి. అవి మరమ్మత్తులు లేకుండా అలాగే వదిలేయడమేగాక, ఎప్పుడైనా షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉంది. ఇది చిన్నపిల్లలు, మహిళలు, పెద్దలు చుట్టూ తిరుగుతున్న ప్రాంగణంలో ప్రమాదకరంగా మారింది. కానీ అక్కడి నిర్వాహకుల కళ్లకు మాత్రం కనబడడం లేదు..ఈ భవన్ కు ప్రభుత్వ పెద్దలు తరచూ వస్తుంటారు.

## సెటిల్మెంట్లకు అడ్డాగా పోలీస్ స్టేషన్లు: కెటిఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ హయాంలో సెటిల్మెంట్లకు అడ్డాగా పోలీస్ స్టేషన్లు మారాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు విమర్శించారు. తన భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేశాడని ఫిర్యాదు చేస్తే ఉల్టా తమ పార్టీ నేత కర్కబోయిన కుంటయ్యపైనే కేసు బనాయించి వేధించడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. సివిల్ మ్యాటర్ లో దూరి పోలీసులు సెటిల్మెంట్లు, అరాచకాలు చేయడం సమాజానికి ఎంత మాత్రం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ నేత భూమిని కబ్జా చేయడంతో ఆత్మహత్య చేసుకున్న బిఆర్ఎస్ మాజీ ఎంపిటిసి కర్కబోయిన కుంటయ్య కుటుంబాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇవాళ సిరిసిల్లలో పరామర్శించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఏం చేబితే అది చేయడాన్నే డ్యూటీగా భావించి పోలీసులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కుంటయ్య చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎవరిని వదిలిపట్టమన్నారు. తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ నేతలు ఎవరూ కూడా ఇంత చిల్లర, లేకి పనులు చేయలేదన్నారు. మొన్న ఎసిబి విచారణ జరుగుతున్నప్పుడు తన కోసం హైదరాబాద్ దాకా వచ్చి ధైర్యం చెప్పిన కుంటయ్య అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి తన మనసు కకావికలమైందన్నారు. రాజకీయ నాయకులు అంటే అందరూ ఏదోదో ఊహించుకుంటారని, బయటికి గంభీరంగా కనిపడ్డా లోపల దుఃఖాన్ని దాచుకొని ఓ వైపు ప్రజల కోసం పనిచేస్తూ మరోవైపు కుటుంబాన్ని కాపాడుకునే క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురవుతారన్నారు. తన భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేయడం, పోలీసులు కూడా ఆయనకే వత్తాసు పలకడంతో కుంటయ్య ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పార్టీ నేతలను పంపి ఆయనను కాపాడుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. పార్టీలో నిబద్దత కల నాయకుడు, నిఖార్సైన గులాబీ సైనికుడు కుంటయ్య ఇద్దరు పిల్లల చదువులు, వారి పెళ్లిళ్లు , ఇతర సమస్యలు అన్నింటికీ తనదే బాధ్యత అని కెటిఆర్ స్పష్టం చేశారు. కుంటయ్య కుటుంబానికి పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు కుంటయ్యకి జరిగింది రేపు మరొకరికి జరిగే అవకాశం ఉందని, ఈ అరాచకాలను ప్రభుత్వం అదుపు చేయాలన్నారు. ఈ ఆపద సమయంలో కుంటయ్య కుటుంబానికి మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నారు. పెద్దకర్మ జరిగేదాకా పార్టీ జిల్లా నాయకత్వమే అన్ని పనులు దగ్గరుండి చూసుకుంటుందన్నారు. కుంటయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని కెటిఆర్ ప్రార్థించారు.

## అమిత్ షాతో నారా లోకేష్ భేటీ



**అమరావతి,:** ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా గడపుతున్నారు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్.. ఇక, ఈ పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.. 25 నిమిషాలకు పైగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలతో పాటు.. తాజా రాజకీయ పరిణామాలపై కూడా చర్చించినట్టుగా తెలుస్తోంది.. ఈ సందర్భంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, కేంద్ర సహకారంతో అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను అమిత్‌షాకు వివరించారు నారా లోకేష్.. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని.. విశాఖలో ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ కొత్తప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని అమిత్ షాకు అందజేశారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన లోకేష్ ను అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు గారి సుదీర్ఘ పాలన అనుభవం ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి బాటలో నడిపిస్తుంది, ఏపీలో డబుల్ ఇంజన్ సర్కారుకు కేంద్ర సహకారం కొనసాగుతుందని అమిత్ షా భరోసా ఇచ్చారు.. ఇక, అంతకుముందు, భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు నారా లోకేష్.. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో సాధించిన విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాను. మరింత వేగవంతమైన అభివృద్ధికి మీ వంతు సహాయ, సహకారాలను అందించాలని కోరాను. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పగా, ఉపరాష్ట్రపతి ధన్కర్ గారు స్పందిస్తూ అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతిని వివరించాను. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశానికి గత 40ఏళ్లలో ఎప్పుడూ గెలవని మంగళగిరిని నేను ఎంచుకున్నానని చెప్పగా, తాను కూడా తొలిసారి పరిచయం లేని నియోజకవర్గాన్నే ఎంచుకుని పోరాడానని ధన్కర్ తెలిపారు. ఈ సందర్భంగా యువగళం పుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి అందజేశాను అని ట్వీట్ చేశారు మంత్రి నారా లోకేష్..

## ఎన్ని కుయుక్తులు పన్నినా.. జగన్ ప్రవాహాన్ని అడ్డుకోలేరు!



**అమరావతి,:** రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యం చెందిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జగ్గంపూడి రాజా అన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న జనాన్ని చూసి ఓర్వలేక పోలీసులు ఆంక్షలు విధించారని మండిపడ్డారు. ఎన్ని కుయుక్తులు పన్నినా.. జగన్ ప్రవాహాన్ని అడ్డుకోలేరన్నారు. గతంలో ఎవరు ఇన్ని ఆంక్షలు పెట్టలేదని ఫైర్ అయ్యారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అవసరం వచ్చినప్పుడు సరైన గుణపాఠం చెబుతారు అని జగ్గంపూడి రాజా పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో మాజీ సీఎం వైఎస్ పర్యటిస్తున్నారు. అయితే ఈ పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు. జగన్ కాన్వాయ్‌తో పాటు మూడు వాహనాలు, వంద మందికి మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జగ్గంపూడి రాజా మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యం చెందింది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌కు వస్తున్న జనాన్ని చూసి ఓర్వలేక పోలీసులు ఆంక్షలు పెట్టారు. ఎన్ని కుయుక్తులు పన్నినా జగన్ ప్రవాహాన్ని అడ్డుకోలేరు. గతంలో ఎవరు ఇన్ని ఆంక్షలు పెట్టలేదు. మీ పరామర్శలకు ఇన్ని ఆంక్షలు ఉన్నాయో ఓసారి గుర్తుచేసుకోండి' అని అన్నారు. 'కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సంక్షేమ పథకాలను తెప్ప తగలేశారు.సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం డబ్బులు ఏవి?. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేస్తాం. వాలంటీర్లు నెత్తిన శఠగోపం పెట్టారు. ఎండీయూ వాహనాలను తొలగించి రేషన్ కోసం ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు' అని జగ్గంపూడి రాజా మండిపడ్డారు.

# విమానయానం గాలిలో దీపం



ఈ ఏడాది కేదార్‌నాథ్ యాత్ర సీజన్‌లో వరసగా చోటు చేసుకొంటున్న హెలికాప్టర్ ప్రమాదాలు ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఆదివారం కేదార్‌నాథ్‌నుంచి గౌరీకుండ్‌కు వస్తున్న హెలికాప్టర్ గుప్తకాశి వద్ద కూలిపోవడంతో పైలట్, రెండేళ్ల చిన్నారి సహా హెలికాప్టర్‌లోని మొత్తం ఏడుగురూ చనిపోయారు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైన నెలన్నర రోజుల్లోనే ఇది అయిదో హెలికాప్టర్ ప్రమాదం కావడం గమనార్హం. ఇంతకు ముందు కూడా గత మే 8న ఉత్తర కాశీలో గంగోత్రికి యాత్రికులను తీసుకు వెళ్తున్న హెలికాప్టర్ లోయలో పడిపోవడంతో ఆరుగురు ప్రయాణికులు చనిపోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో మూడు హెలికాప్టర్ ప్రమాదాలు సంభవించినప్పటికీ అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. అయితే నెలన్నర వ్యవధిలోనే ఇన్ని హెలికాప్టర్ ప్రమాదాలు ఎందుకు జరిగాయి? దీనికి కారణాలేమిటి? అన్న ప్రశ్నలు ప్రతిఒక్కరిలో తలెత్తుతున్నాయి. ఆదివారం జరిగిన ప్రమాదానికి వాతావరణం హటాత్తుగా ప్రతికూలంగా మారడమే కారణమని తెలుస్తోంది. పైలట్ దట్టమైన పొగమంచు మధ్యలోకి వెళ్లి ఉండవచ్చని, ఎదురుగా ఏముందో కూడా కనిపించని స్థితిలో హెలికాప్టర్ కొండను ఢీకొని కూలిపోయి ఉంటుందని నిపుణులు అంటున్నారు. అయితే ప్రమాదం జరిగిన తీరు గమనిస్తే నిర్వాహకుల నిర్లక్ష్యం కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ ప్రమాదం తెల్లవారు జామున 5.17 గంటల సమయంలో జరిగింది. వాస్తవానికి కేదార్‌నాథ్ లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉదయం 6 గంటలతర్వాతినుంచి సాయంత్రం వరకు మాత్రమే హెలికాప్టర్ సేవలకు అనుమతి ఉంది. దీనికి భిన్నంగా ఆర్యన్ ఏవియేషన్ లిమిటెడ్‌కు చెందిన హెలికాప్టర్ తెల్లవారుజామునే బయలుదేరడాన్ని గమనిస్తే నిర్వాహకుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం అవుతుంది. కేదార్‌నాథ్ ఆలయం హిమాలయ పర్వతాల మధ్య ఉంది. ఇక్కడ వాతావరణం క్షణాల్లో మారిపోతూ ఉంటుంది. పైగా అంతా నిటారయిన కొండలు, లోయలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం. అలాంటప్పుడు భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఉత్తరాఖండ్ ప్రభుత్వం హెలికాప్టర్ సేవలకు అనుమతించింది కానీ భద్రత విషయాలను పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించదు. కంట్రోల్ టవర్స్ కానీ, వాతావరణానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని అందించే ఏర్పాట్లు కానీ లేకపోవడంతో హెలికాప్టర్ ఆపరేటర్లు తమ ఇష్టానుసారం హెలికాప్టర్ సర్వీసులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదాయానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రయాణికుల భద్రతను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హెలికాప్టర్ ప్రమాదం తర్వాత ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి చేసిన ప్రకటన సైతం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అత్యవసర సమావేశం నిర్వహించాక రెండు రోజులు పాటు కేదార్‌నాథ్‌కు హెలికాప్టర్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలకోసం కఠినమైన నిబంధనావళిని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతేకాకుండా డిజిసిఎ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కూడా ఏవియేషన్ కంపెనీలను ఆదేశించారు. హెలికాప్టర్ సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటుగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సిఎం ప్రకటించారు. ఇదంతా బాగానే ఉంది కానీ చార్‌ధామ్ యాత్రకోసం చాలా ఏళ్ల క్రితమే హెలికాప్టర్ సర్వీసులను ప్రారంభించిన రాష్ట్రప్రభుత్వం ఇంతకాలంగా ఈ అంశాలపై ఎందుకు దృష్టిపెట్టలేదనే ప్రశ్న ఎవరికైనా వస్తుంది. 2010లో హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభమయ్యాయి కానీ ఇప్పటివరకు భద్రత విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకున్నట్లు కనిపించదు. వాస్తవానికి కేదార్‌నాథ్ యాత్ర అత్యంత శ్రమతో కూడుకున్నది. గతంలో దుర్గమమైన పర్వత మార్గంలో కాలినడకన, వృద్ధులు, పిల్లలు లాంటి వారయితే గుర్రాల మీద ఆలయానికి చేరుకునే వారు. అయితే హెలికాప్టర్ సర్వీసును ప్రవేశపెట్టిన తర్వాత రోజు రోజుకు దానికి ఆదరణ పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ ఏజన్సీ ఐఆర్‌సిటిసితో పాటుగా పలు ప్రైవేటు ఏవియేషన్ కంపెనీలు హెలికాప్టర్ బుకింగ్‌తో పాటు సర్వీసులను కొనసాగిస్తున్నాయి. యాత్రికులు సైతం ఈ సర్వీసులకే ఎక్కువ మొగ్గ చూపుతుండడంతో ఏవియేషన్ కంపెనీల మధ్య అనారోగ్యకరమైన పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఏటా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది. ముఖ్యంగా ఈ ఏడాది కేవలం 40 రోజుల్లోనే అయిదు ప్రమాదాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో దాదాపు 280 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్ల ముందు మెదులుతున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదాలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. దట్టమైన మంచు కారణంగా చార్‌ధామ్ యాత్రలో భాగమైన నాలుగు ఆలయాలను ఏడాదిలో ఆరు నెలల పాటు మూసి ఉంచుతారనే విషయం అందరికీ తెలిసిందే. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి పర్యాటకం ప్రధాన ఆదాయ వనరు కావడంతో ఈ యాత్ర కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తూ ఉంటుంది. దీంతో భక్తుల సంఖ్య కూడా ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. అదే ఇప్పుడు సమస్యలకు కారణమవుతోంది. ఆదాయంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపైన కూడా శ్రద్ధ చూపించాల్సి ఉంటుంది. వరస ప్రమాదాల తర్వాతనైనా రాష్ట్రప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించడం మంచి పరిణామమే. హెలికాప్టర్ సేవలపై నిఘాతో పాటుగా వాటి క్రమబద్ధీకరణ, వాతావరణంపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయడంలాంటి చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చు. ఎంతో శ్రమకు ఓర్చి చార్‌ధామ్ యాత్రకు వచ్చే భక్తులు క్షేమంగా, యాత్ర ముగించుకుని స్వస్థలాలకు చేరుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

# రాజకీయంగా డీలాపడ్డా కరీంనగర్



తొలి విడత మంత్రి వర్గ విస్తరణలో మంథని ఎంఎల్ఎ దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు మంత్రి వర్గంలో చోటు కల్పించారు. రెండవ విడత మంత్రి వర్గంలో పలువురు మంత్రి పదవులు ఆశించినా ధర్మపురి ఎంఎల్ఎ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించింది. కరీంనగర్ జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో మంత్రి శ్రీధర్ బాబు మాత్రమే అధికార కార్యక్రమాలైన జెండా పండుగలకు హాజరు అవుతున్నారు. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు అడ్లూరి, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తారంటు ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. ఒకప్పుడు మంత్రులతో కళకళలాడిన కరీంనగర్ నేడు మంత్రులు లేక జిల్లా కేంద్రం వెలవెలబోతున్న ది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది కరీంనగర్ దుస్థితి. తెలంగాణ సాధన కో సం ఏది తలపెట్టాలన్నా కరీంనగర్ నుంచే ప్రారంభం అయ్యేది. అలాంటి పేరున్న కరీంనగర్ జిల్లా కేంద్రానికి కాంగ్రెస్ పాలనలో అసలైన నాయకుడు లేక తల్లడిల్లుతున్నది. కరీంనగర్ కేంద్రం ఒక ప్పుడు మంత్రులతో రాకతో ఎర్రబుగ్గ కారులు కుయ్యి.. కుయ్యి అనే శబ్దాలతో కాన వచ్చిన కన్నారం ఇప్పుడు మాత్రం కానరావడం లేదని అందరి నోటా అదే మాట వినిపిస్తున్నది. సమస్యలు చెప్పుకుని.. విప్పుకుందామన్న సరై'అయి'నా లీడర్ లేకపాయే ప్రజల మంచికో.. చెడుకో జిల్లా కేంద్రంగా మంత్రి ఉండాలని కోరుకుంటున్నారు.

### రాజకీయంగా డీలాపడ్డా కరీంనగర్

కరీంనగర్ జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా.. వెలుగులు వెలిగిన జిల్లా.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించింది. తెరాస 14 సంవత్సరాల పాలనలో ఉమ్మడి జిల్లాలో నలుమూలల నుండి మూడు నియోజక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించి మంత్రి పదవులు ఇచ్చారు. కరీంనగర్ జిల్లాకు మంత్రి వర్గ విస్తరణలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అధిక ప్రాధాన్యత కల్పించారు. నగరం స్మార్ట్ సిటీ నిధులతో అద్భుతంగా మారినప్పటికీ అధికార పార్టీకి అసలైన నేత లేక జిల్లా ఇప్పుడు వెలవెలబోతున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 13 నియోజక వర్గాల్లో హుస్నాబాద్, సిద్దిపేట కొత్త జిల్లాలో ఉండగా, మిగతా 12 నియోజక వర్గాలు మాత్రం పాత కరీంనగర్‌లోనే ఉన్నాయి. 13 నియోజక వర్గాల్లో 5 స్థానాలైనా సిరిసిల్ల, కరీంనగర్, హుజురాబాద్, కోరుట్ల, జగిత్యాలలో గులాబీ జెండా ఎగిరింది. మిగతా 8 స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగిరింది. తొలి విడత మంత్రి వర్గ విస్తరణలో మంథని ఎంఎల్ఎ దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు మంత్రి వర్గంలో చోటు కల్పించారు. రెండవ విడత మంత్రి వర్గంలో పలువురు మంత్రి పదవులు ఆశించినా ధర్మపురి ఎంఎల్ఎ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించింది. కరీంనగర్ జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో మంత్రి శ్రీధర్ బాబు మాత్రమే అధికార కార్యక్రమాలైన జెండా పండుగలకు హాజరు అవుతున్నారు. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు అడ్లూరి, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తారంటు ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. రెండు పార్లమెంట్ నియోజక వర్గాలు ఉండగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని చెన్నూరు, మంథని, ధర్మపురి నియోజకవర్గాల ఎంఎల్ఎలకు మాత్రం మంత్రి పదవులు దక్కగా, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్ ఎంఎల్ఎ పొన్నం ప్రభాకర్‌కు మాత్రమే మంత్రి వర్గంలో చోటు లభించింది. కరీంనగర్ పాత జిల్లా ఒకప్పుడు వెలుగులు వెలుగగా ఇప్పుడు మాత్రం మంత్రులతో విడిపోయిన జిల్లాలు వెలుగులు వెలుగుతున్నాయని అందరినోటా అదే మాట వినిపిస్తున్నది. కాంగ్రెస్ పార్టీలో వర్గపోరుతో కరీంనగర్ జిల్లాకు సరైనా పదవులు రావడం లేదని ఆ పార్టీ నేతల్లో చర్చ జరుగుతున్నది. ఇటీవల ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో తోపులాట, కుస్తీలాటే.. దీనికి నిలువెత్తు సాక్షం ఏఐసిసి నేతలే అని చెప్పక తప్పదు. అప్పటి తెలంగాణ తొలి సిఎం కెసిఆర్ అండదండలతో స్మార్ట్ సిటీ హోదా దక్కించుకున్న విషయం అందరికీ తెలిసిందే. కరీంనగర్ అభివృద్ధికి నిధుల కొరత లేకున్నా నేడు అభివృద్ధి పనులకు ఆటంకాలు కలుగక తప్పడం లేదు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత కూడా కరీంనగర్ ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ప్రతి పథకాన్ని కరీంనగర్ నుండే ఆనాటి సిఎం కెసిఆర్ శ్రీకారం చుట్టారు. ఇప్పుడు మాత్రం ప్రభుత్వ పాలకుల మదిలో కానరావడం లేదు. ఎలాంటి అభివృద్ధి ముందుకు సాగడం లేదని, పని చేసే వారికి గుర్తింపు ఇవ్వడం లేదని జరిగిన కాంగ్రెస్ సమావేశాలో పార్టీ శ్రేణులు ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసి నిరసన తెలపగా, అగ్రనేతల బుజ్జగింపులతో నిరసనలు సద్దుమణిగాయి. కరీంనగర్‌కు లీడర్ అనే వ్యక్తి లేకపోవడంతో అధికారులు సైతం తమకు పని చేయడం లేదని ఆ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న లీడర్ వద్దకు వెళ్దామన్నా మరో లీడర్‌కు సమాచారం వెళుతుందని గుట్టుచప్పుడు కాకుండా ఉంటున్నారు. ఉద్యమ పోరు జిల్లా కేంద్రంలో ఒక మంత్రినే ప్రతి కార్యకర్తకూ, ప్రతి ఒక్కరికీ పని జరుగుతుందని చెప్పుకుంటున్నారు. బిఆర్ఎస్ మాత్రం ఇచ్చిన హామీలు కాంగ్రెస్ నెరవేర్చడం లేదని వ్యతిరేక ప్రచారం చేస్తుంటే వారి ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు సలహాలతో కూడిన కార్యక్రమాలను చేద్దామని కాంగ్రెస్ శ్రేణులు ఉన్నా కూడా ముందుకు నడిపించే నేత లేదని వారిలో చర్చ మొదలైంది. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించి కరీంనగర్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# భారత్‌కు పశ్చిమాసియా సెగ



ఉరుము ఉరిమి మంగలంమీద పడిన చందంగా ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య రగిలిన యుద్ధజ్వాలల ప్రభావం పరోక్షంగా భారత్‌పై పడే సూచనలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇరాన్- ఒమన్ దేశాలను విభజిస్తూ, పర్షియన్ గల్ఫ్‌కు దారితీసే కీలకమైన హర్మూజ్ జలసంధికి యుద్ధం విస్తరించినట్లు తాజాగా ఆ ప్రాంతంలో మూడు నౌకలు దగ్ధమవడాన్ని బట్టి తెలుస్తోంది. అదే నిజమైతే, భారత్ సహా అనేక దేశాలు చమురు సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడే పరిస్థితి ఎంతో దూరంలో లేదు. అత్యంత ఇరుకైన హర్మూజ్ జలసంధి ద్వారానే పశ్చిమాసియా దేశాలనుంచి ప్రపంచానికి రోజూ కోట్లాది పీపాల చమురు రవాణా అవుతూ ఉంటుంది. పశ్చిమాసియా దేశాలనుంచి భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం ఈ మార్గం ద్వారానే వస్తుంది. యుద్ధ సమయంలో ఈ మార్గం గుండా వెళ్తున్న చమురు ఓడలపై దాడులు చేసి, వైరిపక్షాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించడం కద్దు. నాలుగు దశాబ్దాల కిందట ఇరాన్ ఇరాక్ మధ్య యుద్ధం మొదలైనప్పుడు హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే చమురు ఓడలపై పరస్పరం దాడులు జరుపుకోవడంతో ప్రపంచ దేశాలు చమురు సంక్షోభంలో చిక్కుకున్న విషయం విస్మరించరాని అంశం. ఇరాన్ ఒమన్ దేశాలను విడదీసే హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌దే ఆధిపత్యం. యుద్ధం ముదిరితే ఈ జలసంధిని ఇరాన్ మూసివేసే ప్రమాదం ఉంది. అలాగే ఇరాన్ నుంచి చమురును రవాణా చేసే ఓడలపై ఇజ్రాయెల్ దాడులు చేయనూవచ్చు. దీంతో చమురు అందక అనేక దేశాలు అల్లాడిపోవడం తథ్యం. భారత్‌కు సైతం ఒకప్పుడు ఇరానే అతి పెద్ద చమురు ఎగుమతిదారు. 2019లో అమెరికా ఆంక్షలు విధించడంతో ఇరాన్ నుంచి చమురు దిగుమతులు తగ్గించుకుని, రష్యా, ఇరాక్, సౌదీ అరేబియాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. హర్మూజ్ జలసంధిలో దాడులు పెరిగితే చమురు రవాణా స్తంభించిపోయి, ధరలు ఆకాశాన్నంటితే ఆ పరిణామం భారత్‌కూ ప్రమాద హేతువే. మరోవైపు దౌత్యపరంగానూ భారత్ చిక్కుల్లో పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలతో భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. రెండింటిలో ఏదో ఒక దేశాన్ని ఎంచుకోమంటే అది భారత్‌కు ఆత్మహత్యాసదృశమే అవుతుంది. అందుకే ఎప్పటిలాగే తటస్థ వైఖరిని అవలంబిస్తోంది. ఇటీవల షాంఘై సహకార సంస్థ ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని నిర్ద్వంద్వంగా ఖండించగా, భారత్ మాత్రం దౌత్యపరమైన మార్గాల ద్వారా యుద్ధానికి పరిష్కారం కనుగొనాలంటూ మధ్యేమార్గాన్ని అనుసరించింది. షాంఘై సహకార సంస్థలో ఇరాన్, భారత్ రెండూ సభ్యదేశాలే అయినప్పటికీ భారత్ గోడమీది పిల్లివాటాన్ని ప్రదర్శించడం అనేక విమర్శలకు దారితీసింది. బ్రెజిల్‌లో వచ్చే నెలలో జరగనున్న బ్రిక్స్ సదస్సు కూడా భారత్‌కు సంకటంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. బ్రిక్స్ దేశాల కూటమిలో ఇరాన్‌కు కూడా సభ్యత్వం ఉండటంతో భారత్ పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యి చందంగా మారబోతోంది. ఇరాన్‌ను సమర్థించడం ద్వారా ఇజ్రాయెల్‌తో విభేదిస్తే అమెరికాతో కోరి కయ్యం తెచ్చుకున్నట్లే అవుతుంది. ఇక, ఇరాన్‌లో భారత్ ఇప్పటికే చేపట్టిన చాబహార్ ఓడరేవు నిర్వహణపై కూడా యుద్ధ మేఘాలు కమ్ముకున్నట్లే కనిపిస్తోంది. ఈ ఓడ రేవు కోసం భారత్ ఇప్పటికే కోట్లాది డాలర్లు ఖర్చు చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఓడరేవు దెబ్బతింటే, అది భారత్‌కు తీరని నష్టం కలిగిస్తుంది. మరోవైపు ఇరాన్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులను క్షేమంగా స్వదేశానికి తీసుకురావలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. యుద్ధ నేపథ్యంలో ఇరాన్ గగనతలాన్ని మూసివేయడంతో టెహ్రాన్ నుంచి భూమార్గం ద్వారానే విద్యార్థుల్ని తీసుకురావలసి ఉంటుంది. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధానికి చరమగీతం పాడేందుకు అగ్రదేశాలు చేయీచేయీ కలపకపోతే చమురు సంక్షోభం ప్రపంచాన్ని కుదిపివేయడం తథ్యం. ఇప్పటికే చమురు ధరలు అంతకంతకూ ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో, యుద్ధం మరింత ముదిరితే ద్రవ్యోల్బణం పెచ్చుమీరి, అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం కావచ్చు.

అయితే, అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేస్తే తప్ప ఈ యుద్ధం ఆగేది కాదని అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ మొండికేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ తోనూ, ఇజ్రాయెల్ తోనూ స్నేహ సంబంధాలు గల భారత్ మధ్యవర్తిత్వానికి నడుం బిగించాలి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను నివారించే సామర్థ్యం భారత ప్రధానికి ఉందంటూ భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం.

శుభోదయం

సంపాదకీయం

# వ్యవస్థీకృతమైన పోలీసు హింస

దేశంలో జైళ్లు 5.70 లక్షలమంది ఖైదీలతో నిండిపోయాయి. గత దశాబ్దంలో ఖైదీల సంఖ్య 50శాతం కంటే పెరిగిపోగా, అనేక రాష్ట్రాల్లో ఉండాల్సిన దాని కంటే 200 శాతం ఎక్కువగా ఖైదీలు జైళ్లలో... 'దేశంలో జైళ్లు 5.70 లక్షలమంది ఖైదీలతో నిండిపోయాయి. గత దశాబ్దంలో ఖైదీల సంఖ్య 50శాతం కంటే పెరిగిపోగా, అనేక రాష్ట్రాల్లో ఉండాల్సిన దాని కంటే 200 శాతం ఎక్కువగా ఖైదీలు జైళ్లలో మగ్గిపోతున్నారు. నిద్రపోయేందుకు సరైన స్థలం కూడా దాదాపు 31శాతం ఖైదీలకు లభించడం లేదు. మొత్తంగా 20శాతానికి పైగా ఖైదీలు మూడేళ్లకు పైగా విచారణ లేకుండా మగ్గిపోతున్నారు. జైళ్లలో 30శాతం పైగా సిబ్బంది పోస్టులు ఖాళీలు ఉన్నాయి.' మంగళవారంనాడు ఢిల్లీలో విడుదలైన 'ఇండియా జస్టిస్' రిపోర్ట్ సారాంశమిది. మాజీ న్యాయమూర్తులు, న్యాయనిపుణులు, పలు పౌర సంస్థలు కలిసి రూపొందించిన నివేదిక ఇది. దేశంలో నేర న్యాయవ్యవస్థ తీరుతెన్నులను అది వెల్లడించింది. రూల్ ఆఫ్ లా అమలు చేయడంలో భారతదేశం 142 దేశాల్లో 77వ స్థానంలో ఉన్నది! నేర న్యాయవ్యవస్థను అమలు చేయడంలో 89వ స్థానంలో ఉన్నది!! భారతదేశంలో నేరాలను అదుపు చేయడంలో ఫోరెన్సిక్ సైన్స్, కృత్రిమ మేధ (ఏఐ) వంటి టెక్నాలజీలను సమర్థంగా ఉపయోగిస్తున్నామని, ప్రజలకు న్యాయాన్ని సకాలంలో సంతృప్తికరంగా అందించేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం నాడు అఖిల భారత ఫోరెన్సిక్ సైన్స్ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ అన్నారు. కేంద్ర హోంమంత్రి మాటలకూ, ఆచరణలో కనిపిస్తున్న దానికీ పొంతన లేదు. తాను మాట్లాడిన ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలోనే 50శాతానికి పైగా ఖాళీలు ఉన్న విషయం ఆయనకు తెలియనిది కాదు. జైళ్లు నిండిపోకుండా ఉండాలంటే, ప్రజలకు సకాలంలో న్యాయం అందాలంటే న్యాయ వ్యవస్థ సరిగా పనిచేయాలి. కాని దేశంలో హై కోర్టులు, జిల్లా కోర్టుల్లో 5.1 కోట్ల మేరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సగటున మూడేళ్లకు పైగా 61 శాతం కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. 1987లో లా కమిషన్ దేశంలో ప్రతి పదిలక్షల మందికి కనీసం 50 మంది న్యాయమూర్తులు ఉండాలని తెలిపింది. కాని ఏ రాష్ట్రంలోనూ ఈ పరిస్థితి లేదు. ప్రతి పదిలక్షల మందికీ కేవలం 15 మంది న్యాయమూర్తులే ఉన్నారు. జిల్లా కోర్టుల్లో ప్రతి జడ్జిపైనా 2200 కేసుల భారం ఉంది. ఈ పరిస్థితి మూలంగా క్రింది కోర్టుల్లో మూడేళ్లకు మించిన పెండింగ్ కేసులు 25 నుంచి 45 శాతానికి పెరిగిపోయాయి. బిహార్‌లో అయితే క్రింది కోర్టుల్లో 71 శాతం కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టుల్లో ఈ పరిస్థితి ఇంతకంటే ఘోరంగా ఉన్నది. దేశంలోని 25 హైకోర్టుల్లో అయిదేళ్లకు మించి పెండింగ్‌లో ఉన్న కేసులు 51 శాతానికి పై మాటే. సుప్రీంకోర్టులో అయితే 81వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దేశం అత్యాధునిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందాలంటే నేర న్యాయవ్యవస్థ, రూల్ ఆఫ్ లా సక్రమంగా ఉండడం ముఖ్యం. ఒక దేశం అభివృద్ధి చెందిందని చెప్పేందుకు కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కొలమానం కాదు. సామాజిక శాంతి, అందరికీ సమాన న్యాయం కూడా అభివృద్ధికి కొలమానాలే. కాని ఇక్కడ ప్రజలకు సకాలంలో న్యాయం అందడం అనేది ఒక సుదూర స్వప్నంగా మిగిలిపోయింది. న్యాయం ఆలస్యం కావడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే అన్నది ఒక నానుడి. కాని మన నేతలు ఎంత టెక్నాలజీ గురించి మాట్లాడుతున్నా. కోర్టులు, పోలీసు స్టేషన్లకు వెళ్లిన వారికి మనం ఎన్ని దశాబ్దాలు వెనుకగా ఉన్నామో అర్థమవుతోంది. ప్రజలకు న్యాయం అందడమే కష్టమైనప్పుడు దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు అన్న తేడా లేకుండా సమాన న్యాయం అందడానికి మనకు ఎంత కాలం పట్టాలి? దేశంలో పేరుకుపోయిన కేసులన్నీ పరిష్కారం కావాలంటే 324 సంవత్సరాలు పడుతుందని నీతీ ఆయోగ్ ఒక నివేదికలో పేర్కొంది. న్యాయవ్యవస్థలో మహిళలు, దళితులు, ఆదివాసీలు, బీసీల శాతం గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల్లో కేవలం 14 శాతం మంది ఎస్సీలు కాగా హై కోర్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందినవారు అయిదు శాతం మంది మాత్రమే ఉన్నారు. బీసీలు కేవలం 25.6 శాతం మంది మాత్రమే. న్యాయవ్యవస్థ వేగంగా న్యాయం అందించకపోవడానికి న్యాయమూర్తుల సంఖ్య, మౌలిక సదుపాయాలు లేకపోవడం కారణమైతే, ప్రజలు చట్టం, న్యాయం పట్ల నమ్మకం కోల్పోవడానికి పోలీసు వ్యవస్థ కూడా కారణం. భారతదేశంలో పోలీసింగ్ పరిస్థితిపై కామన్ కాజ్, లోక్‌నీతి%-%సీఎస్‌డీఎస్ వారం రోజుల క్రితం విడుదల చేసిన నివేదిక అనేక పచ్చి నిజాలను వెలికితీసింది. దేశంలోని 8వేల మంది పోలీసులను ఈ సంస్థలు ప్రశ్నించి నివేదికను రూపొందించాయి. దేశంలో నేరాలను పరిష్కరించాలంటే చట్టవ్యతిరేకంగా బలప్రయోగం చేయడమే సరైనదని పోలీసుల్లో అత్యధికులు భావిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. వారికి రూల్ ఆఫ్ లా అన్నా, నిబంధనలు పాటించడమన్నా లెక్కలేదని తెలిపింది. సమాచారం రాబట్టాలంటే హింస తప్పదని సగానికి పైగా పోలీసులు చెప్పారని వెల్లడించింది. వ్యవస్థ నేరస్థులను రక్షిస్తుందని ఈ నివేదిక తెలిపింది. ప్రజల్లో భయం ఉండాలంటే బలప్రయోగం తప్పదని 55 శాతం మంది పోలీసులు చెప్పారని, సీరియస్ కేసుల్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించాల్సిందేనని 30శాతం మంది సమర్థించుకున్నారని, చిన్ననేరాలకు కూడా హింసించకపోతే నిజాలు బయటకురావని 9శాతం మంది పోలీసులు చెప్పారని తెలిపింది. అరెస్టుకు నిబంధనల ప్రకారం వ్యవహరించాలంటే ప్రతిసారీ సాధ్యం కాదని 24శాతం మంది పోలీసులు అంగీకరించారని తెలిపింది. పోలీసుల ప్రతాపానికి గురైన వారిలో అత్యధికులు దళితులు, ముస్లింలు, ఆదివాసీలు, మురికివాడల్లో నివసించేవారే కావడం గమనార్హం. దీంతో చట్టాలు ఎవరికి అనుకూలంగా పనిచేస్తున్నాయో అర్థమవుతుంది. ఎలాంటి ఫోరెన్సిక్ నైపుణ్యం లేకుండానే డాక్టర్లు వైద్యపరీక్షలు చేయడం, మెజిస్ట్రేట్లు తరుచూ మౌన ప్రేక్షకులుగా ఉండిపోవడం సహజ పరిణామం. ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారమే 2011-2022ల మధ్య పోలీసు కస్టడీలో 1107 మంది మరణించారు. కాని ఒక్క పోలీసు అధికారికి కూడా శిక్షపడలేదు అసలు భారత న్యాయవ్యవస్థనే పోలీసు హింస కమ్మి వేసిందని, టెక్నాలజీ, ఏఐ గురించి ఎంత మాట్లాడుకున్నా ఒక రకంగా పోలీసు హింస అనేది దేశంలో వ్యవస్థీకృతంగా మారిందని వ్యాఖ్యానించింది. భారత రాజ్యాంగం పోలీసు కస్టడీలో హింసాకాండను పూర్తిగా నిషేధించింది. నాగరిక సమాజంలో న్యాయం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలు ప్రధానం. హింస అనేది ఆటవిక సంస్కృతిని ప్రతిబింబించడమే కాదు, మానవ సంబంధాలను హరించివేస్తుంది. సమాజంలో అన్ని వర్గాలకు చట్టం ?సమరీతిలో వర్తించాలంటే పోలీసులు వృత్తి నైపుణ్యం, జవాబుదారీతనంతో వ్యవహరించాలి. హింసాకాండకు వ్యతిరేకంగా అనేక దేశాలు అంతర్జాతీయ ఒడంబడికలకు అనుగుణంగా చట్టాలు చేసినప్పటికీ మన దేశం మాత్రం ఈ విషయంలో పెద్ద పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. హింస, చట్టవ్యతిరేక హత్యలకు రాజకీయ వ్యవస్థలు ప్రోద్బలం కలిగించడమే ఇందుకు కారణం. ఈ క్రమంలో మానవ హక్కుల సంఘాలు కూడా కోరలు లేని నామమాత్ర సంస్థలుగా మిగిలిపోయాయి. 1997లో డికె బసు వర్సెస్ ఆఫ్ స్టేట్ ఆఫ్ బెంగాల్ కేసులో సుప్రీంకోర్టు పోలీసు కస్టడీలో హింసాకాండ, మరణాలు పెరిగిపోతున్నాయని పేర్కొంది. పోలీసు కస్టడీలో హింసాకాండ మానవ హక్కులను పూర్తిగా హరించి వేసి మనిషి ఉనికికే ముప్పుగా మారిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్వీ రమణ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. దాదాపు 19 సంవత్సరాల క్రితం సుప్రీంకోర్టు పోలీసు సంస్కరణలపై సమగ్రమైన తీర్పు నిచ్చింది. కాని ఇంతవరకూ ఈ సంస్కరణలపై ఏ ప్రభుత్వమూ దృష్టి సారించలేదు. ఈ సంస్కరణలు కావాలని సుప్రీంకోర్టులో పోరాడిన ఉత్తరప్రదేశ్ మాజీ డీజీపీ ప్రకాశ్‌సింగ్ పోలీసులు, రాజకీయ నాయకులు పరస్పరం ఆధారపడడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు. పోలీసులు లేకుండా రాజ్యం కోరలు లేనిదవుతుందని అన్నారు. రాజకీయ నాయకులు పోలీసులు తమ అడుగులకు మడుగులొత్తాలని, తమ రాజకీయ ఎజెండా అమలు చేయాలని అనుకుంటారని, పోలీసులపై రాజకీయనేతల పెత్తనం లేకుండా కొంత స్వతంత్రత ఏర్పర్చడం అవసరమని అన్నారు. పోలీసుల శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతల నుంచి దర్యాప్తు బాధ్యతలను వేరు చేయాలని చెప్పిన సుప్రీంకోర్టు, వారు జవాబుదారీగా వ్యవహరించేందుకు అనేక ప్రతిపాదనలూ చేసింది. డీజీపీలను తాత్కాలికంగా నియమించకుండా యూపీఎస్సీ ద్వారా నియమించాలని తెలిపింది. డీజీపీలకు నిర్దిష్టంగా రెండేళ్ల కాలపరిమితిని విధించి రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, బదిలీలు, పోస్టింగులు పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డుకు అప్పగించాలని, పోలీసులపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, కేంద్ర స్థాయిలో జాతీయ సెక్యూరిటీ కమిషన్ నియమించి నియామకాల బాధ్యతలు అప్పగించాలని తెలిపింది. ఈ సూచనలేవీ ప్రభుత్వాలు పాటించడం లేదని, అనేక రాష్ట్రాల్లో నిబంధలను ఉల్లంఘించి పోలీసులను నియమిస్తున్నారని, ఈ నియామకాల్లో తీవ్రమైన అవినీతి జరుగుతోందని ఇటీవల ప్రముఖ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, దుష్యంత్ దవే సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తాము మే నెలలో పోలీసు సంస్కరణలపై దృష్టి సారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా చెప్పారు. అప్పటికి ఆయన పదవీవిరమణ చేస్తారు. ఆ తర్వాత కొత్త సీజే ఈ తీర్పులపై దృష్టిసారిస్తారో కాలగర్భంలో కలిపివేస్తారో చెప్పలేం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో కనీసం మూడో స్థానానికి చేరాలనుకుంటున్న భారతదేశం ఆ దేశాల్లో ఉన్న ప్రమాణాలకు అనుగుణంగా న్యాయ, భద్రతా వ్యవస్థలను సంస్కరించుకోకపోతే అభివృద్ధికి అర్థం లేనట్లే.

# జీవితపు ఎడారిలో..



తోబుట్టువులు, అన్నదమ్ముల జీవితాలలో వెలుగులు నింపడం కోసం ఎడారి ప్రవాసానికి వచ్చే అనేక మంది చివరకు కుటుంబ జీవితాలకు... తోబుట్టువులు, అన్నదమ్ముల జీవితాలలో వెలుగులు నింపడం కోసం ఎడారి ప్రవాసానికి వచ్చే అనేక మంది చివరకు కుటుంబ జీవితాలకు, ఆప్యాయతలకు దూరమవుతున్నారు. ఈ కారణంగా మానసిక ఒత్తిళ్ళకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్న ప్రవాసులు ఎందరో ఉన్నారు. అహర్నిశలు కష్టపడి పైసకు పైసా జతచేసి కుటుంబాలకు పంపితే కష్టం తెలియని కుటుంబాలు డబ్బుతో మాత్రమే తమకు పని అని, మనిషితో కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. యవ్వనంలోకి అడుగుపెట్టిన తొలినాళ్ళలోనే ఎడారులకు చేరుకుని అరబ్బుల పెత్తనంపై పోరాడి గెలిచినప్పటికీ ఇంట్లో అన్నదమ్ములతో ఓడిపోయి చివరకు రిక్తహస్తాలతో, నిరాశా నిస్పృహలతో కొట్టామిట్టాడుతున్నారు. అనారోగ్యంతో మరణించిన తండ్రి, అడుగడుగున ఉన్న అప్పులు, పట్టించుకోని బంధువులు. అరకొరగా కూలీ చేసి సంపాదించే అన్నకు తోడుగా కుటుంబానికి చేయూతనిచ్చేందుకు వచ్చిన నెల్లూరు జిల్లా యువకుడు ఒకరు తన ఆప్తుల కోసం సర్వం త్యాగం చేశాడు. యజమాని కాఠిన్యాన్ని భరిస్తూ ఆకలితో గడిపాడు. అలా ఎంతో కష్టపడి సంపాదించిందంతా ఆ యువకుడు అన్నకు పంపగా, అతడు తన పిల్లల పెళ్ళిళ్లు చేశాడు, చదువులు చెప్పించాడు. తమ్ముడు పంపిన డబ్బుతో తన పేర ఆస్తులను కొను గోలు చేసిన ఆ అన్న ఇప్పుడు మొత్తం తనదేనంటున్నాడు. అన్యాయం జరిగితే న్యాయస్థానానికి వెళ్ళి కేసు వేసుకోమంటున్నాడు. ఏళ్లకు ఏళ్ళు కష్టపడి, స్వదేశానికి తిరిగి వెళ్ళిన తమ్ముడు తనకు జరిగిన మోసం గురించి బంధుమిత్రులతో చెప్పి బోరుమన్నాడు. చేసేది లేక పాత మిత్రుల సహాయంతో వీసా పొంది మళ్ళీ గల్ఫ్‌కు తిరిగి వచ్చాడు కానీ అనారోగ్యం వల్ల సక్రమంగా ఉద్యోగం చేయలేకపోతు న్నాడు. అలాగని ఆర్థిక కారణాలతో స్వదేశానికి వెళ్ళడానికి వెనుకంజ వేస్తున్నాడు, షుగర్ వ్యాధితో కళ్ళు సరిగ్గా కనిపించకపోయినా తన పిల్లల కోసం ఏడ్చుకొంటూ పని చేస్తు న్నాడు, ఇక్కడి నుంచి అతడు పంపే డబ్బు కొరకు భార్య, పిల్లలు ప్రతి నెలా ఆతృతగా ఎదురు చూస్తుంటారు. మెదక్ జిల్లాకు చెందిన మరో యువకుడికి ఏడుగురు తమ్ముళ్ళు, చెల్లెళు ౖ. టైలరింగ్ పని చేసే తండ్రి అనారోగ్యంతో మంచం పాలవగా అప్పులు పెనుభారంగా మారాయి. కుటుంబం గడిచీ గడవక నెట్టుకొచ్చేది. దానికి తోడు పెళ్ళికి ఎదుగుతున్న చెల్లెళ్లు, తమ్ముళ్ళ చదువు ఎలాగా అనుకుంటూ అందరికంటే పెద్దవాడయిన అన్న డిగ్రీ చదువును వదిలిపెట్టి అప్పులు చేసి ఎడారి విమానమెక్కాడు. చెల్లెళ్ల వివాహాలను ఘనంగా జరిపించాడు. సంపాదించిన ప్రతి నయా పైసా ఇంటికి పంపించాడు. లక్షలలో సంపాదించినా కనీసం బ్యాంకు ఖాతా కూడ తెరుచుకోలేదు. అన్న గల్ఫ్‌కు వెళ్ళేవరకు అన్నం కోసం తిప్పలు పడ్డ ఆ కుటుంబం గతాన్ని మరిచిపోయింది. కాపురానికి వచ్చిన భార్య భర్త కష్టార్జితం రాళ్ళపాలవుతోందని గ్రహించే సరికి కుటుంబ కలహాలు పెరిగాయి. సంపాదించిన ఆస్తులను తమ్ముళ్ళు, బావలు గుంజుకున్నారు. జీవితంలో ఎక్కువకాలం విదేశాలలో గడపడంతో తోబుట్టులను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాడు. ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా కనీసం ఇంట్లోకి అతడి పిల్లలను కూడ రానివ్వలేదు. ఎవరి కోసం తాను రేయింబవళ్ళు కష్టపడ్డాడో వాళ్లే పరాయివారు కావడాన్ని తట్టుకోలేకపోయాడు. పని చేసేందుకు ఓపిక లేకపోయినా తన పిల్లల కోసం కష్టపడ్డాడు. చివరకు అతడు ప్రవాసంలోనే అనారోగ్యంతో కన్నుమూయగా స్వదేశంలో అతడి పిల్లలు, భార్య అతికష్టంగా బతుకీడుస్తున్నారు. భార్య పగటిపూట ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, రాత్రి పూట ఇంట్లో బట్టలు కుడుతుండగా ఆమె భర్త సంపాదనతో ఎదిగిన వారందరు హాయిగా ఉన్నారు. ఈ రకంగా కుటుంబ బాధ్యతలతో చిన్న వయస్సులో ఎడారులకు వచ్చి చివరకు తమ జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకున్న తెలుగు ప్రవాసులు అసంఖ్యాకంగా ఉన్నారు. వారి మనోవేదన అర్థం చేసుకోగల వారెవ్వరు?

# బంగ్లాదేశ్ జాతిపితగా ముజిబుర్ పేరు తొలగింపు



బంగ్లాదేశ్‌లోని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ జాతిపితగా బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ పేరును తొలగించింది. ఈ మేరకు ఆ దేశ లా అండ్ జస్టిస్ పార్లమెంటరీ సంబంధాల మంత్రిత్వ శాఖ మంగళవారం రాత్రి ఆర్డినెన్స్ జారీచేసింది. స్వాతంత్ర్య సమరయోధుడు.. పదానికి కొత్త నిర్వచనం ఇస్తూ, ఓ చట్టాన్ని యూనస్ ప్రభుత్వం సవరించిందని, జాతిపిత అన్న బిరుదును షేక్ ముజిబుర్ రెహమాన్‌కు తొలగించినట్టు 'ఢాకా ట్రిబ్యూన్' వార్తా కథనం పేర్కొన్నది. మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ చిత్రపటాన్ని కరెన్సీ నోట్ల నుంచి తొలగించిన కొద్ది రోజుల్లోనే యూనస్ ప్రభుత్వం ఈ చర్యను చేపట్టింది. 'బంగ్లాదేశ్ విముక్తి యుద్ధానికి యూనస్ ప్రభుత్వం కొత్త నిర్వచనం తీసుకొచ్చింది. బంగబంధు స్వాతంత్ర్య పిలుపు మేరకు యుద్ధం జరిగిందని, బంగ్లాదేశ్ విమోచనం పొందిందని ఇంతకుముందున్న చట్టం పేర్కొన్నది' అని అంటూ 'ద డెయిలీ స్టార్' న్యూస్ పేపర్ పేర్కొన్నది.

# రాజస్థాన్‌లో నకిలీ ఎరువుల రాకెట్




నకిలీ ఎరువులు, నాణ్యత లేని విత్తనాలను తయారు చేస్తున్న 30 పరిశ్రమలపై రాజస్థాన్ ప్రభుత్వం దాడులు చేసింది. జైపూర్, కిషన్‌గఢ్, శ్రీ గంగా నగర్ తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో ఇటీవల ఈ సోదాలు కొనసాగాయి. పాలరాయి వ్యర్థాలు, రాతి తునకలు(స్టోన్ డస్ట్), రంగులను వాడి తయారు చేసిన నకిలీ ఎరువులను మార్కెట్లోని కొన్ని రకాల బ్రాండ్ల పేరుతో అమ్ముతున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. ఇఫ్కో లేబుల్ కలిగిన ఈ నకిలీ ఎరువులను నిత్యం రెండు లక్షలకు పైగా సంచుల చొప్పున రాజస్థాన్‌తో పాటు హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని వేలాది మంది రైతులకు విక్రయిస్తున్నట్టు తేలింది. ఈ నకిలీ ఎరువుల దందాకు కొందరు పర్యవేక్షక అధికారులు సహకరించారని, వారి నిర్లక్ష్యం వల్లే ఈ నకిలీ ఎరువుల అమ్మకాలు యథేచ్ఛగా సాగాయని దర్యాప్తు అధికారులు తెలిపారు.

# విచక్షణ కోల్పోయిన అభిమానం



ఒకప్పుడు అభిమానం అనేది ఆదరణ, ప్రేమ, గౌరవభావాలతో ఉండేది. కానీ, ఇప్పుడు అది తన పరిధులు, పరిమితులను దాటి మానసిక రోగంగా మారింది. విచక్షణ కోల్పోయి ప్రాణాల మీదికి తెచ్చే ఫ్యానిజంగా రూపాంతరం చెందింది. మన దేశంలో ఇటీవల జరిగిన కొన్ని దురదృష్టకర ఘటనలే అందుకు తార్కాణం. కొన్ని నెలల కిందట హైదరాబాద్‌లోని ఓ సినిమా థియేటర్‌లో నటులను చూసేందుకు వేల మంది అభిమానులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళ మరణించింది. ఆమె కుమారుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సెలబ్రిటీలను చూసేందుకు జనం ఎగబడటం, థియేటర్ యాజమాన్యం సరైన భద్రతాచర్యలు చేపట్టకపోవడం, ప్రభుత్వ యంత్రాంగ నిర్లక్ష్యం ఫలితంగా ఓ కుటుంబం ఛిన్నాభిన్నమైంది. తాజాగా బెంగళూరులో లక్షల మంది పాల్గొన్న క్రికెట్ విజయోత్సవ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 11 మంది మరణించారు. తమ అభిమాన టీం గెలిచిన ఆనందాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి వెళ్లిన 50 మందికిపైగా గాయపడ్డారు. ఇలాంటి దుర్ఘటనల్లో తప్పెవరిది? గుడ్డిగా సెలబ్రిటీలను ఆరాధించే అభిమానులదా? భద్రతా చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ యంత్రాంగాలదా? కార్యక్రమాలు నిర్వహించే ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలదా? తప్పెవరిదైనా కావచ్చు.. చాలా మంది ఫ్యానిజానికి బానిసై తమ వ్యక్తిత్వాన్ని, వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతున్నారు. 'నేను ఎవరు?' అనే ప్రశ్నకు 'ఫలానా సెలబ్రిటీ అభిమాని' అని చెప్పుకొనేందుకు వెంపర్లాడుతున్నారు. చదువు, కెరీర్, కుటుంబ బాధ్యతల కంటే సినిమా రిలీజ్, హీరో, క్రికెట్ తదితర విషయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. సెలబ్రిటీ ట్కస్టైల్, డైలాగ్‌లు, దుస్తులు, మాట్లాడే తీరు అన్నింటినీ అనుకరిస్తూ, మరో ప్రపంచంలో బతుకుతూ తమ జీవితాన్ని పూర్తిగా మరచిపోతున్నారు. విదేశాల్లో అభిమాన సంస్కృతి ఇలా ఉండదు. వన్డే ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టు కోసం అక్కడి అభిమానులు రోడ్డెక్కలేదు. న్యూజిలాండ్, అమెరికాలోనూ అంతే. అక్కడ అభిమానాన్ని ఆచరణాత్మకంగా, సమతుల్యంగా చూస్తారు. విదేశాల్లో అభిమానం ఒక అనుభవమే. కానీ, మన దేశంలో అది బానిసత్వంగా మారుతున్నది. అక్కడ సెలబ్రిటీలు కూడా దేవుళ్లలా కాదు, ప్రజల్లో ఒకరిలా మాత్రమే ఉంటారు. ఒకరిని చూసి ఊగిపోయేముందు 'నేనెందుకు హీరో కాలేను?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మీరు కూడా ఏదో ఒక రంగంలో మేటి కావచ్చు కదా! ఆ రంగంలో మీరెందుకు హీరో కాలేరు? వాళ్లు శ్రమించారు.. క్రికెటర్లయ్యారు. వీళ్లు కష్టపడ్డారు.. నటులయ్యారు. వాళ్లు కొత్త దారులు వెతికారు.. నాయకులయ్యారు. ప్రయత్నిస్తే మీరెందుకు సాధించలేరు? వాళ్ల విజయాలను చూసి స్ఫూర్తి పొందడంలో తప్పు లేదు. కానీ, వాళ్ల కోసం జీవితాన్ని పణంగా పెట్టడం తప్పు. అభిమానం మార్గనిర్దేశం కావాలే తప్ప, మరణం కాకూడదు. మీ జీవిత లక్ష్యాలు, మీ కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తు కోసం శ్రమించండి. మీ లక్ష్యాలు, కష్టాలు, స్వప్నాలను గౌరవించండి. యువత మారితేనే దేశం మారుతుంది.

# అదానీకి ఎల్ఐసీ పలహారం




జీవితబీమా తప్పనిసరి అనే భావన స్థిరపడిపోయిన రోజులివి. అందుకే ఇప్పుడు బీమా అనేది బిగ్ బిజినెస్ జాబితాలోకి చేరిపోయింది. ఆర్థిక సరళీకరణలు వచ్చేవరకూ బీమా రంగంలో భారతీయ జీవిత బీమా (ఎల్ఐసీ) సంస్థ ఏకచ్ఛత్రాధిపత్యం చెలాయించేది. 2000 సంవత్సరంలో ప్రైవేటు కంపెనీలను బీమాలోకి అనుమతించడంతో ఇబ్బడిముబ్బడిగా కంపెనీలు వచ్చాయి. అయినా ఎల్ఐసీదే అగ్ర స్థానం. ప్రభుత్వానికి ఎల్ఐసీ భారీగా డివిడెండ్లు, లాభాలు చెల్లించడమే కాకుండా రుణ నిర్వహణలోనూ తోడ్పడుతుంది. ఇది సంస్థ పట్ల ప్రజల నమ్మకానికి అద్దంపట్టే సంగతి. కానీ, ఇప్పుడు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ బంగారు బాతును తమ ప్రియతమ వాణిజ్యవేత్త అదానీ సేవకు వినియోగిస్తున్నది. పూర్తిగా ప్రభుత్వ యాజమాన్యంలోని ఈ సంస్థలోకి ప్రైవేటు పెట్టుబడులను అనుమతించడం ఒక ఎత్తయితే ఇప్పుడు సంస్థ పెట్టుబడులను ప్రైవేటు కంపెనీ చేతుల్లో పెట్టడం మరొకెత్తు. అదానీ పోర్టు కంపెనీ ఇటీవల జారీచేసిన రూ.5,000 కోట్ల బాండ్లను గుండుగుత్తగా ఎల్ఐసీ కొనుగోలు చేయడంపై మార్కెట్‌లో దుమారం చెలరేగింది. ఆ బాండ్లను కొనుగోలు చేసేందుకు సంస్థాగత పెట్టుబడిదారులెవరూ ముందుకురాని ప్రతికూల పరిస్థితుల్లో ఈ నిధులను బాండ్ల పేరిట మళ్లించడం గమనార్హం. ఇది పెట్టుబడి నిర్ణయంగా కాకుండా సమస్యల సుడిగుండంలో ఉన్న సంస్థను బయటపడేసేందుకు అందిస్తున్న ఆపన్నహస్తంగా కనిపిస్తున్నది. ఇంకా సూటిగా చెప్పాలంటే ఎల్ఐసీ లోగోలోని రెండు చేతుల మధ్య ప్రాణదీపాన్ని తీసేసి అదానీ గ్రూపును పెట్టడం తప్ప మరోటి కాదు. ఎవరూ నమ్మని సంస్థను ఎల్ఐసీ మాత్రం ఎందుకు గుడ్డిగా నమ్మాలి? అదానీ గ్రూపులో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టడం ఇదే మొదటిసారి కాదు. ఈ సరికే అవి రూ.60 వేల కోట్లు దాటాయి. ఇప్పుడు మరో విడత నిధులు అందిస్తున్నారు. అదానీ గ్రూప్ బాండ్లకు చెల్లించబోయే 7.7 శాతం వడ్డీ మహా ఎక్కువ అన్నట్టుగా ఎల్ఐసీ అధికారులు సెలవిస్తున్నారు. రిస్క్‌తో రాబడి సరిపోలడం లేదనేదనేది మార్కెట్ విశ్లేషణ. రేపు అదానీ గ్రూపు అప్పుల భారం కింద నలిగిపోతే బీమా పాలసీదారుల నష్టాలకు ఎవరు జవాబు చెప్తారు? బీజేపీ ఒక పథకం ప్రకారం ప్రజల సంపదను అడ్డూఅదుపూ లేకుండా ప్రైవేటు జేబుల్లో పెడుతున్నదనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? ఎల్ఐసీ భారత ప్రజల సంస్థ. అందులో ఉండేది ప్రజల సొమ్ము. దానిని ప్రమాదకరమైన రీతిలో ప్రైవేటుపరం చేయడం ఏ మాత్రం భావ్యం కాదు. కార్పొరేట్లకు కొమ్ముకాసే బీజేపీ పాలనలో ఎల్ఐసీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ అదానీ గ్రూప్‌నకు ఏటీఎంగా మారడం విచారకరం.

# మూడేండ్లకే గ్యారెంటీ లేదు!


మరో పదిహేను రోజుల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరు నెలల క్రితం ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన మరిచిపోయారు. ఎవరూ గుర్తు చేసే పరిస్థితి లేదు. ఇప్పుడు గ్రామాల్లో సర్పంచ్ కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తామని, తమ సత్తా చూపిస్తామని మీడియా సమావేశంలో సవాల్ చేసినవాళ్లు తోక ముడిచారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ఏమవుతుందో, ఫలితాలెలా ఉంటాయో అన్నది అందరికన్నా అధికారంలో ఉన్నవాళ్లకే బాగా తెలుసు. అందుకే వాళ్లు ఎన్నికల ఊసెత్తడం లేదు. పదిహేను రోజుల మాట దేవుడెరుగు, ఇంకా మిగిలి ఉన్న మూడేండ్ల కాలంలో కూడా ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం కాంగ్రెస్ సర్కారుకు లేదు. కాంగ్రెస్ ఎప్పుడు అధికారంలో ఉన్నా పంచాయతీ ఎన్నికల నిర్వహణ పట్ల ఆసక్తి చూపదు. 'ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు అందరూ మా వారే' అని టీడీపీ ఆవిర్భావానికి ముందు సీఎంగా ఉన్న టి.అంజయ్య ప్రకటించారు. పంచాయతీ ఎన్నికలు ఎలాగూ పార్టీ రహితంగా జరుగుతాయి. అంజయ్య తరహాలో 'గెలిచినవాళ్లంతా మా వాళ్లే' అని చెప్పుకోనైనా ఎన్నికలు జరపవచ్చు. కానీ, రేవంత్ ప్రభుత్వం ఆ ధైర్యం కూడా చేయడం లేదు. అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఇంతటి వ్యతిరేకతను గతంలో ఏ ప్రభుత్వమూ మూటగట్టుకోలేదు. ఆరు గ్యారెంటీల అమలు మాట దేవుడెరుగు, బీఆర్ఎస్ అమలుచేసిన పథకాలు సైతం ప్రజలకు అందడం లేదు. విద్యు త్తు కోతలను ప్రజలకు తిరిగి రుచి చూపిస్తున్నారు. హామీల అమలుకు దిక్కు లేదు.. పంచాయతీ ఎన్నికల మాట ఎలా ఉన్నా, అసలు రాష్ట్రంలో పాలన ఉందా? అనే అనుమానం కలుగుతున్నది. రిటైరై ఏడాది గడిచినా ప్రభుత్వ ఉద్యోగులకు బెనిఫిట్స్ దక్కడం లేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, అప్పులు చేద్దామన్నా ఎవ్వరూ నమ్మడం లేదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభల్లో చెప్తున్నారు. ఓ వైపు అప్పు కోసం వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్లే దొంగలా చూస్తున్నారని గత నెలలోనే చెప్పిన ఆయన, రాష్ట్రావతరణ వేడుకల్లో మాత్రం 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుస్తానని ప్రగల్భాలు పలికారు. నెల రోజుల్లో తెలంగాణలో ఏం మారిందో మరి? సీఎంకు ఉపన్యాసాలు రాసిచ్చే పీఆర్వోలు మారి ఉండవచ్చు. అంతేతప్ప, చెప్పులు ఎత్తుకెళ్లే దొంగల స్థితి నుంచి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చే పునాదుల నిర్మాణమే జరగలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం, కాంగ్రెస్ హై కమాండ్‌ను మచ్చిక చేసుకోవడం, కాంగ్రెస్ సీనియర్ల బలహీనతలపై సీఎంకు బాగానే అవగాహన ఉండవచ్చు. కానీ, తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చే వ్యూహం, అవగాహన, ప్రణాళిక ఆయన వద్ద లేవు. కోటి మంది మహిళలను వచ్చే మూడేండ్లలో కోటీశ్వరులను చేసేస్తామని హామీ కూడా ఇచ్చేశారు. కల్యాణలక్ష్మితోపాటు ఇస్తామన్న తులం బంగారం అడిగితే డబ్బులు లేవని చెప్తున్నారు. తులం బంగారం ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ, మూడేండ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తారట. విజన్-2047 కూడా రేవంత్‌రెడ్డి సొంత డైలాగ్ కాదు. ఈ ప్రచారం రేవంత్‌రెడ్డికి తెలియదని కాదు. 'నేను ఫొటోలు దిగి ఎవరికో నిరూపించాల్సిన అవసరం లేదు' అని చెప్తున్నారు తప్ప, అపాయింట్‌మెంట్ సాధించి ఆ ప్రచారానికి మాత్రం ఆయన చెక్ పెట్టలేకపోతున్నారు. వచ్చే మూడేం డ్లు తన పదవికే గ్యారెంటీ లేని ముఖ్యమంత్రి 2047 నాటికి, అంటే ఇంకో 22 ఏండ్లలో ఏం చేస్తారో చెప్తున్నారు. ముందు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే అదే అద్భుతం. చంద్రబాబు అయినా, మరో ప్రాంతీయ పార్టీ నాయకుడు అయినా విజన్-2020, విజన్-2047 అని ఏం చెప్పినా చెల్లుబాటు అవుతుంది. అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీ వారి చేతుల్లోనే ఉంటుంది. మరో 50 ఏండ్ల తర్వాత విజన్ గురించి కూడా వాళ్లు చెప్పుకోవచ్చు. కాంగ్రెస్‌లో హై కమాండ్ ఇష్టాలే తప్ప, సొంత ఇష్టాయిష్టాలు ఏముంటాయి? 'రాష్ట్ర అధికారిక చిహ్నంలోని చార్మినార్, కాకతీయ తోరణాలు రాచరికానికి చిహ్నాలు. నాకు నచ్చలేదు. వాటిని మారుస్తాను' అని అధికారంలోకి రాగానే సీఎం ప్రకటించారు. హై కమాండ్ అక్షింతలతో ఆ మార్పు నిరవధిక వాయిదా పడింది. అధికార చిహ్నంపైనే అధికారం లేని సీఎం 2047 వరకు ఏం చేస్తారో చెప్పడం హాస్యాస్పదం. మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేద్దురు కానీ, ముందు ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లించండి.

# తన పార్టీకి మెడికల్ వింగ్ ప్రకటించిన హీరో విజయ్

**నటుడు విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పార్టీలో నూతన వైద్య విభాగం ప్రారంభం**

**డాక్టర్ టి. శరవణన్‌ను కోఆర్డినేటర్‌గా నియమించిన విజయ్**

**వైద్య విభాగానికి 14 మంది సభ్యులతో జాయింట్ కోఆర్డినేటర్ల బృందం**



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తమ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా మరో కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా గురువారం నాడు పార్టీ ప్రత్యేక వైద్య విభాగాన్ని ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలను విస్తరించుకోవడం, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను ముమ్మరం చేయడం అనే తమ విస్తృత వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. టీవీకే అధ్యక్షుడు విజయ్ ఈ మేరకు ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య విభాగానికి తొలితరం ఆఫీస్ బేరర్ల వివరాలను కూడా ఆయన వెల్లడించారు. డాక్టర్ టి. శరవణన్‌ను ఈ విభాగానికి కోఆర్డినేటర్‌గా నియమించారు. పార్టీ ఆధ్వర్యంలో తమిళనాడు వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలకు ఆయన నేతృత్వం వహిస్తారు. ఈ వైద్య విభాగం కార్యకలాపాలకు తోడ్పాటు అందించేందుకు, 14 మంది వైద్య నిపుణులతో కూడిన బృందాన్ని సంయుక్త కోఆర్డినేటర్లుగా నియమించారు. వీరిలో డాక్టర్ కె. విష్ణు, డాక్టర్ ఎం.ఎస్. రవి, డాక్టర్ ఎ. అరుణ్ ప్రసాద్, డాక్టర్ ఎస్. నరేష్, డాక్టర్ ఎస్. అరవింద్, డాక్టర్ టి. ప్రీతింగ, డాక్టర్ ఎస్. కార్తీక్, డాక్టర్ సిత్తార్ పాండియన్, డాక్టర్ ఎం. మణిమేఘలై, డాక్టర్ ఎం. హరి, డాక్టర్ సి. జగధ, డాక్టర్ సినోరా పి.ఎస్. మోహిత్, డాక్టర్ సి. తమిళినియన్, డాక్టర్ సి. వివేక్ పాండియన్ ఉన్నారు. నూతనంగా నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ విజయ్ మాట్లాడుతూ, "నా మార్గదర్శకత్వం, ఆదేశాల మేరకు, ముఖ్యంగా పార్టీ నిర్మాణాత్మక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలకు సంబంధించి ఈ బృందం వైద్య విభాగం బాధ్యతలను నిర్వహిస్తుంది" అని చెప్పారు. టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ పర్యవేక్షణలో ఈ వైద్య విభాగం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. వైద్య విభాగానికి, దాని కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సహకరించాలని తమిళనాడు వ్యాప్తంగా ఉన్న టీవీకే కార్యకర్తలు, నాయకులకు విజయ్ పిలుపునిచ్చారు. "ఈ వైద్య నిపుణుల బృందం మా సామాజిక సంక్షేమ, ప్రజా సేవా లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుందని నేను విశ్వసిస్తున్నాను" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే భూస్థాపితం చేస్తారా?: జగన్



అమరావతి: వైఎస్ఆర్ సిపి పార్టీ శ్రేణులను పరామర్శిస్తే తప్పా?, ఎందుకు ఇన్ని ఆంక్షలు? అని ఆ పార్ట అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. మొన్నటి పొదిలి పర్యటనలోనూ తనకు ఇబ్బందులు సృష్టించారని మండిపడ్డారు. గురువారం జగన్ మీడియాతో మాట్లాడారు. 40వేల మందిపై రాళు వేసే ప్రయత్నం చేశారని, రైతులు సంయమనం పాటించారని, అయినా కేసులు పెట్టారని, రైతులను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే భూస్థాపితం చేస్తారా? టాపిక్ డైవర్ట్ చేయడానికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేశారని చురకలంటించారు. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వనని అన్నందుకు చెవిరెడ్డి గన్‌మెన్‌ను హింసించారని, ఆ గన్‌మెన్ స్వయంగా డిజిపి, రాష్ట్రపతికి లేఖలు రాయాల్సి వచ్చిందన్నారు. చెవిరెడ్డి కుమారుడిని కూడా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, లిక్కర్ కేసులో సంవత్సరం నుంచి చెవిరెడ్డి భాస్కర్ పేరే లేదన్నారు. చంద్రగిరిలో ఎదురు ఉండకూడదనే చెవిరెడ్డిపై కేసులు పెట్టారని జగన్ ఆరోపణలు చేశారు. సడెన్‌గా గిరి అనే కానిస్టేబుల్‌ను తెరపైకి తీసుకొచ్చారని, ఇరికించాలనుకుంటే ఎవరినైనా ఇరికించొచ్చన్నారు. లిక్కర్ కేసులో లేని ఆధారాలను తయారు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిన్నెల్లిపైనా తప్పుడు కేసులు పెట్టారని, నందిగం సురేష్‌పైనా కేసుల మీద కేసులు పెడుతున్నారని, వల్లభనేని వంశీని 60రోజులుగా జైలులో పెట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బీహార్‌ను చేయడంలో చంద్రబాబుకు మించిన గొప్ప నాయకుడు ఎవరూ లేరని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ఫ్యూలాంటి పరిస్థితుల మధ్య తన పర్యటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## అజెండా 5ను ఎందుకు దాచారు?



హైదరాబాద్ : బోడిగుండుకు మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడు అని మరోసారి రుజువైందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు పేర్కొన్నా రు. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కెసిఆర్ చెప్పిన వాటిని దురుద్దేశపూర్వకంగా వక్రీకరించారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. రాజకీయ లబ్ధి పొందాలనే వక్ర బుద్ధే తప్ప,తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన లేదని అన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోని అజెండా 5లోని అంశాలు దాచిపెట్టి, అజెండా నెం.1 అంశాలను మాత్రమే ప్రస్తావించారని విమర్శించారు. గోదావరి -కృష్ణా నదుల అనుసంధానం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదు అని కెసిఆర్ అజెండా 5లో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం అసత్యాలను సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల ముందు ఉంచారని, ఈ విషయంలో సిఎం మీడియాను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. అబద్దాల పునాదుల మీద జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరు అని హరీష్‌రావు పేర్కొన్నారు.

## ఇజ్రాయిల్ ఆర్మీ స్థావరాలపై ఇరాన్ దాడి.. పలువురికి గాయాలు



ఇరాన్ : ఇరాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన దాడుల వల్ల వందలాది మంది ప్రజలు మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే ఇజ్రాయిల్ దాడులకు ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగింది. తాజాగా గురువారం ఇజ్రాయిల్ ఆర్మీ స్థావరాల్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణి దాడికి పాల్పడింది. దక్షిణ ఇజ్రాయిల్‌లోని నాలుగు ప్రదేశాల్లో ఇరాన్ జరిపిన క్షిపణుల దాడుల వల్ల ఇజ్రాయిల్‌కి తీవ్ర నష్టం కలిగిందని ఇరాన్ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈరోజు జరిగిన దాడుల్లో ఇజ్రాయిల్‌లోని సోరోకా ఆసుపత్రి కూడా ఉందని మీడియా పేర్కొంది. కాగా, ప్రధానంగా దక్షిణ ఇజ్రాయిల్‌లోని ఇజ్రాయిల్ ఆర్మీ కమాండ్ అండ్ ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయం, ఇజ్రియల్ సిటీలో బిర్షెబాలోని గవ్ - యామ్ టెక్నాలజీ పార్క్‌లోని సైనిక నిఘా శిబిరాల్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడి చేసిందని ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ టెలిగ్రామ్‌లో వెల్లడించింది. అయితే ఆర్మీ ప్రధాన స్థావరాలు బిర్షెబాలోని సోరోకా ఆసుపత్రి పక్కనే ఉండడంతో ఈ దాడుల ప్రభావం ఆ ఆసుపత్రిపై కూడా పడిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఈ దాడిలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయని, రెండు డజన్ల మంది స్వల్పంగా గాయపడ్డారని ఇజ్రాయిల్‌కు చెందిన మాగెన్ డేవిడ్ అడోమ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ తెలిపింది

## నాకు కాంగ్రెస్ నాయకత్వంతో విభేదాలు ఉన్నాయి



తిరువనంతపురం : గత కొన్నిరోజులుగా కాంగ్రెస్ నేత శశిథరూర్ వ్యవహారశైలి.. మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంది అని స్పష్టమవుతోంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీలో కీలక పదవిలో ఉన్న శశిథరూర్.. బాహాటంగానే అధికరపక్షానికి మద్దతుస్తూ, ప్రశంసిస్తూ వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. శశిథరూర్‌కి కాంగ్రెస్‌కి విబేధాలున్నాయని, ఆయన ఆ పార్టీ నుంచి వీడి బిజెపిలోకి చేరతారని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ ఊహాగానాల నేపథ్యంలో.. 'నాకు కాంగ్రెస్ నాయకత్వంతో విభేదాలు ఉన్నాయి' అని శశిథరూర్ వెల్లడించారు. అయితే కాంగ్రెస్ పార్టీ అన్నా.. ఆ పార్టీ కార్యకర్తలన్నా తనకెంతో ప్రియమైన వారని ఆయన అన్నారు. గురువారం కేరళ తిరువనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మీకు తెలిసినట్లుగా.. ప్రస్తుతం నాకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో విభేదాలున్నాయి. వాటిలో కొన్ని ప్రజాక్షేత్రంలో ఉన్నాయి. వాటిని పార్టీలోనే పరిష్కరించుకోవడం మంచిది. నిలంబూర్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారానికి పార్టీ నుండి నాకు ఆహ్వానం అందలేదు. అందుకే పార్టీ అభ్యర్థి తరపున నేను ప్రచారం చేయలేదు. కాంగ్రెస్ పార్టీ, దాని విలువలు, ఆ పార్టీ కార్యకర్తలు నాకు చాలా ప్రియమైనవారు. నేను గత 16 సంవత్సరాలుగా వారితో కలిసి పనిచేస్తున్నాను. వారి నిబద్ధత, అంకితభావం, ఆదర్శవాదం నేను చూశాను' అని అన్నారు. కాగా, ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మీకు కాంగ్రెస్ హైకమాండ్‌తోనా, లేక రాష్ట్ర నాయకత్వంతోనా విభేదాలు అని ప్రశ్నించినప్పుడు.. 'అసెంబ్లీ ఉప ఎన్నిక ఓటింగ్ జరుగుతున్న సమయంలో దీని గురించి మాట్లాడకూడదు' అని ఆ ప్రశ్నను శశిథరూర్ దాటవేశారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్యదాన్ షౌకత్ గెలవాలని కోరుకుంటున్నట్లు శశిథరూర్ మీడియాకు పేర్కొన్నారు.


# నరమేధంపై గ్రేటా తెగువ





హిట్లర్, ముస్సోలినీలను మించి నరమేధం సాగిస్తున్న నెతన్యాహు సర్కారుపై, దానికి సమస్త వనరులను కట్టబెడుతున్న అమెరికా తీరుపై ప్రపంచవ్యాప్తంగా యువతలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. పసిబిడ్డలు, మహిళలనుసైతం శత్రువులుగా చూస్తూ సహాయ కేంద్రాల వద్దకు ఆహారం కోసం వచ్చిన వారిని సైతం చంపుతున్న ఇజ్రాయిల్ దుర్మార్గం యువతను కదిలించివేస్తోంది. ప్రముఖ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్, పాలస్తీనా సంతతికి చెందిన యూరోపియన్ పార్లమెంట్‌లో ఫ్రెంచి సభ్యురాలు రిమాహసన్‌తోపాటు పన్నెండు మంది యువ కార్యకర్తల బఅందం ఈ నెల ఒకటిన సిసిలీ నుంచి బ్రిటీష్ నౌక మాడ్‌లీన్‌లో గాజాకు బయల్దేరింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆ స్థాయికి మించి 55 వేలమందికిపైగా అమాయ కులను, అందులోనూ అత్యధికంగా మహిళలు, చిన్నారులను ఇజ్రాయిల్ పొట్టన పెట్టుకుంది. ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థి కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ నాశనం చేసింది. ఇరవై లక్షలకుపైగా నివాసాలను భస్మీపటలం చేయడంతోపాటు డేరాల కింద తలదాచుకుంటున్న వారిని మాటిమాటికీ ఖాళీ చేయిస్తోంది. గాజాలోకి ఆహారం, ఇతర నిత్యావసరాలు తీసుకొచ్చే మానవతా సాయాన్ని సైతం అడ్డుకుంటోంది. పాలస్తీనా జాతి నిర్మూలన చేయాలన్న లక్ష్యంతో మానవతా విపత్తులోకి నెట్టిన ఇజ్రాయిల్ దుర్మార్గం మత, జాతి ఉన్మాదులకు మానవత్వం ఉండదనడానికి మరో రుజువు. ఈ ఘాతుకాలన్నీ అంతర్జాతీయంగా చర్చనీయాంశం చేయాలని, ఇజ్రాయిల్ సముద్ర దిగ్బంధనాన్ని ఛేదించి పిల్లల కోసం పాలు, ఆహార పదార్థాలు, అత్యవసర వైద్య పరికరాలు, ఇతర జీవనావసరాలను అందజేసేందుకు ఫ్రీడమ్ ఫ్లోటిల్లా ఆధ్వర్యాన బ్రిటీష్ నౌక మాడ్‌లీన్ బయల్దేరింది. గాజాకు 200 కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ జలాల్లోనే ఈ నౌకను ఇజ్రాయిల్ నిర్బంధించడం, సహాయం అందకుండా చేయడం అమానుషం. నిర్బంధంలోకి తీసుకున్న గ్రెటా థన్‌బెర్గ్‌తో సహా నలుగురిని స్వదేశాలకు పంపివేసింది. ఇజ్రాయిల్ నిర్బంధంలోనే ఉన్న మిగిలిన వారు స్వదేశాలకు వెళ్లడానికి నిరాకరించి, ఆందోళన చేస్తున్నారు. తనను, తన సహచరులను అంతర్జాతీయ జలాల్లో కిడ్నాప్ చేశారన్న గ్రెటా ఇజ్రాయిల్ అధికారులు తమ పట్ల వ్యవహరించిన అమానవీయమైన తీరు పాలస్తీనియన్ల వేదనతో పోలిస్తే లెక్కలోకి రాదన్నారు. దిగ్బంధనాన్ని ఛేదించడం దేశాల చట్టపరమైన బాధ్యత, మనందరి నైతిక బాధ్యత అన్న ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దూత ఫ్రాన్సెసా అల్బనీస్ మాటలను లెక్కచేయని ఇజ్రాయిల్, అమెరికాల తీరు దుర్మార్గం. ఈ ప్రతిఘటన ద్వారా ఇజ్రాయిల్ నరమేధాన్ని మరోసారి అంతర్జాతీయ సమాజం ముందుంచిన గ్రెటా థన్‌బర్గ్ బృందం కృషి అభినందనీయం. ఇంతటి రాక్షసకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు నేటికీ అమెరికా వంత పాడుతూనే ఉంది. గ్రెటాకు కాస్త కోపం ఎక్కువనుకుంటా, ముందుగా ఆమె కోపాన్ని తగ్గించుకునే క్లాసులకు వెళ్లాలంటూ ట్రంప్ ఉచిత సలహా ఇచ్చారు. 'ఏముకలు క్రుళ్లిన, వయస్సు మళ్లిన సోమరులారా చావండి! నెత్తురుమండే శక్తులు నిండే సైనికులారా రారండి' అన్న శ్రీశ్రీ 'మరో ప్రపంచం' పిలుపు యువతకు అభ్యుదయ మార్గానికి దిశానిర్దేశం చేస్తూనే ఉంటుంది. అందువల్ల అటువంటి చచ్చు సలహాలు ఉద్యమకారుల స్ఫూర్తిని ఏమాత్రం ప్రభావితం చేయవు. ఇజ్రాయిల్ దుర్మార్గాలపై ఇటీవల అమెరికా గడ్డ మీద గర్జించిన యువ విజ్ఞాన వేత్త మేఘా వేమూరిని గుర్తు చేసుకోవడం అవసరం. 'మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మా జీవితంలో ముందుకు సాగడానికి సిద్ధమవుతుంటే, గాజాలో విశ్వవిద్యాలయాలే లేకుండా పోయాయి' అంటూ తన భవిష్యత్‌ను సైతం పణంగా పెట్టి ప్రశ్నించిన ఆమె తీరు యువతకు స్ఫూర్తిదాయకం. పాలస్తీనాకు అనుకూలంగా మాట్లాడటమే నేరమన్నట్టు ప్రతిష్టాత్మక హార్వర్డ్ సహా పలు యూనివర్సిటీలకు నిధులను నిలిపివేస్తున్న, విద్యార్థులను విచక్షణా రహితంగా అరెస్టులు చేస్తూ, బేడీలు వేసి పంపిస్తున్న మితవాద ట్రంప్ పాలనలో భారత సంతతికి చెందిన మేఘా చూపినపాటి తెగువ చూపలేని మోడీ సర్కారు తీరు సిగ్గుచేటు. మనదేశంలో పెరుగుతున్న ఉన్మాదాన్ని ఆదిలోనే అడ్డుకోవడం ఎంత అత్యవసరమో ఇజ్రాయిల్ పరిణామాలు హెచ్చ రిస్తున్నాయి. దురాక్రమణదారైన ఇజ్రాయిల్ పట్ల సందిగ్ధ, బుజ్జగింపు ధోరణిని ఇప్పటికైనా కేంద్రం విడనాడాలి. అమాయకుల ఊచకోతను, యుద్ధ నేరాలను ఖండించాలి. సైనిక, భద్రతా సహకారాన్ని నిలిపివేయాలి. శతాబ్దానికిపైగా పాలస్తీనాకు అండగా నిలిచిన మనదేశ చారిత్రక వైఖరిని కొనసాగించాలి. కేంద్రంపై ఒత్తిడిని పెంచేందుకు సంఘీభావం కోసం ఇచ్చిన వామపక్షాల పిలుపునకు సమస్త ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు, పార్టీలు, శాంతికాముకులు మద్దతుగా నిలవాలి.

# విద్యలో ప్రమాణాలు మిథ్య



విద్య, వైద్యం అందించడంలో తీవ్రమైన అసమానతలు ఉన్నాయి. ప్రభుత్వ -ప్రైవేటు, ప్రభుత్వ- ప్రభుత్వ, ప్రైవేట్ -ప్రైవేట్ విద్య, వైద్య సంస్థల మధ్య నిర్వహణలో, ఏర్పాట్లలో స్పష్టమైన తేడాలు, అసమానతలున్నాయి. నవోదయ విద్యాలయాలు, ఎస్‌సి, ఎస్‌టి గురుకుల విద్యాలయాలు, సైనిక పాఠశాలలు, రైల్వే పాఠశాలలు, సింగరేణి పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్స్, మున్సిపల్ స్కూల్స్, ప్రభుత్వ పబ్లిక్ స్కూల్స్, కస్తూరీబా బాలికల స్కూల్స్, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సక్సెస్ స్కూల్స్, మోడల్ స్కూల్స్, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, క్రైస్తవ మిషనరీ స్కూల్స్, ముస్లిం మైనారిటీ విద్యా సంస్థలు, ప్రైవేట్, కార్పొరేట్ తెలుగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల నిర్మాణంలో, నిర్వహణలో నెలకొన్న అసమానతలకు ప్రత్యక్ష ఉదాహరణలు. నవోదయ పాఠశాలల పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం జిల్లా పరిషత్ పాఠశాలలపై లేదు. నిర్మాణంతోపాటు, నిర్వాహణాపరమైన లోపాలే దీనికి ప్రధాన కారణం. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్య-, వైద్య సంస్థల నిర్మాణం, నిర్వహణలో వ్యత్యాసం తీవ్ర స్థాయిలో ఉంది. విద్య, వైద్య రంగాలలో ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలు ఆడిందే ఆట పాడిందే పాట. వీళ్ళకు ప్రజాస్వామిక విలువలు, మానవత విలువలు ఏమీ పట్టవు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించరు. విద్య, -వైద్యాన్ని సేవలుగా కాకుండా వ్యాపారంగా నిర్వహించడమే వీరి ప్రధాన లక్ష్యం. విద్య, -వైద్యాన్ని కొనడం, -అమ్మడం ద్వారా కోట్ల రూపాయలు గడించి విద్య, వైద్య వ్యాపార సామ్రాజ్యాన్ని ప్రాంతాలుగా విస్తరించడమే వీరి ప్రధాన ఆశయం. వీరి దృష్టిలో మనీ సంబంధాలే తప్ప మానవ సంబంధాలు ఉండవు. సేవా ముసుగులో ప్రైవేట్- కార్పొరేట్ శక్తులు కొనసాగిస్తున్న ఆర్థిక దోపిడీకి అంతు లేదు. ప్రజాప్రతినిధులను, ప్రభుత్వాలను ప్రభావితం చేస్తూ తమ దోపిడీ మార్గాలను విస్తరించుకుంటూ పదిలపరుచుకుంటున్నారు. ప్రైవేట్ -కార్పొరేట్ విద్య-, వైద్య సంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులకు, వైద్యులకు, ఇతర సిబ్బందికి జీతభత్యాలు ప్రభుత్వ సిబ్బందితో పోల్చుకుంటే చాలా తక్కువ. ప్రైవేట్, కార్పొరేట్ విద్య-, వైద్య సంస్థల యాజమాన్యాలు ప్రజలనుండి ఆర్థిక దోపిడీ, సిబ్బంది నుండి శ్రమదోపిడీ నిరాటంకంగా కొనసాగిస్తూ అక్రమ లాభాలను తిరిగి పెట్టుబడిగా పెడుతూ హైటెక్ ప్రచారంతో బహుళ అంతస్థులతో ప్రజలను మురిపిస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్య-, వైద్య సంస్థల్లో అందరూ అనుకుంటున్నట్లు అంతా బాగుందనేది కూడా ఒక భ్రమ మాత్రమే. ప్రైవేట్-, కార్పొరేట్ యాజమాన్యాలు పిఆర్ఓ (దళారులు)లను నియమించుకొని అన్ని గ్రామాలలో తిప్పుతూ విద్యలో రాణిస్తున్న మెరికల్లాంటి విద్యార్థుల జాబితాను సేకరించి డబ్బు, ఉచిత చదువు, భోజనం, వసతి వంటి ప్రలోభాలకు గురిచేస్తూ తమ విద్యా సంస్థలో చేర్చుకుంటున్నారు. ఆ విద్యార్థులు సాధించిన విజయాలను తమ విద్యా సంస్థ సాధించిన విజయాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. తల్లి దండ్రులను, విద్యార్థులను, ప్రజలను భ్రమల్లో ముంచుతున్నారు. అప్పటి వరకు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనేక రకాలుగా శ్రమపడిన ప్రభుత్వ విద్యా సంస్థలను, అక్కడి ఉపాధ్యాయులను అవహేళనకు గురి చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మొదటి, ద్వితీయ శ్రేణి విద్యార్థులను ప్రైవేట్ -కార్పొరేట్ యాజమాన్యాలు కొనుగోలు చేయగా, తృతీయ శ్రేణి విద్యార్థులే ప్రభుత్వ పాఠశాలల్లో మిగులుతున్నారు. తృతీయ శ్రేణి విద్యార్థుల ఫలితాలే వాస్తవ ఫలితాలుగా భావించే ప్రజలు ప్రభుత్వ విద్యా సంస్థలపట్ల పెదవి విరుస్తున్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థల్లో విజయాలు సాధించిన విద్యార్థుల పూర్వచదువు వివరాలను సేకరిస్తే వాస్తవాలు తేటతెల్లమవుతాయి. ప్రైవేట్, -కార్పొరేట్ యాజమాన్యాల జిమ్మిక్కులు బట్టబయలవుతాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుల శ్రమవిజయాలు కార్పొరేట్ యాజమాన్యాల వశమవుతున్నాయి. ఈ కారణంచేత నిరంతరం అంకిత భావంతో కష్టపడి పని చేస్తున్న కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషి, పట్టుదల కుదేలవుతున్నది. ఈ మొత్తం తతంగంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, -విద్యా సంస్థలు చేయని నేరానికి శిక్ష అనుభవిస్తూ ప్రజలకు దూరమవుతున్న సందర్భం కనపడుతున్నది. విద్య-, వైద్య రంగాలో విచ్చలవిడిగా ప్రైవేట్-, కార్పొరేట్ యాజమాన్యాలు వచ్చి చేరిన తర్వాతే ఈ పరిణామం చోటుచేసుకున్నది. ప్రాథమిక దశ నుండి సాధారణ విద్యార్థులను మెరిట్ విద్యార్థులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ఉపాధ్యాయుల వంతు కాగా, మెరిట్ విద్యార్థులను ఆశలు ఎర చూపి తమ విద్యాసంస్థల్లో చేర్చుకొని, వారి ద్వారా వచ్చిన విజయాలను తమ విజయాలుగా ప్రచారం చేసుకుంటూ గొప్పలు చెప్పుకోవడం ప్రైవేట్, -కార్పొరేట్ యాజమాన్యాల వంతుగా మారింది. ఈ తంతు 1990 దశకం నుండి ప్రారంభమైంది. కార్పొరేట్ విద్య, వైద్య సంస్థల అధిపతులు ప్రజాప్రతినిధులుగా, ప్రభుత్వ పెద్దలుగా మారడం దుష్పరిణామం. చాలా వరకు ప్రైవేట్-, కార్పొరేట్ సంస్థలు సరైన అనుభవం గాని, అర్హతలు గాని లేని వారితో నిర్వహిస్తున్నారు. అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వానికి రికార్డులు నివేదిస్తారు. వాస్తవానికి చాలా ప్రైవేట్ -కార్పొరేట్ విద్య, వైద్య సంస్థల్లో సరైన మౌళిక వసతులు లేవనేది యదార్థం. ఇదే సందర్భంలో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు బాధ్యతలు విస్మరిస్తున్నారనేది వాస్తవం. నవోదయ విద్యాలయాల్లో చేర్పించడానికి పోటీపడుతున్న తల్లిదండ్రులు ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేర్పించడానికి ఎందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారనేది ఆలోచించవలసిన విషయం. ఈ రెండు విద్యాసంస్థలను ప్రభుత్వమే నిర్వహిస్తున్నది. కాని ఒకే విధంగా నిర్వహించడం లేదు. ఉపాధ్యాయులు తప్ప మిగతా అన్నింటిలో తీవ్రమైన వ్యత్యాసం వుంది. సొసైటీల రూపంలో విద్య, వైద్య రంగాలలోకి ప్రైవేట్-, కార్పొరేట్ శక్తులు ప్రవేశించాయి. సొసైటీలను అడ్డం పెట్టుకొని అనేక రాయితీలు, మినహాయింపులు ప్రభుత్వం నుండి పొందుతున్నారు. విచ్చలవిడిగా, పెద్ద మొత్తంలో విద్యార్థుల నుండి అనేక రకాలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజుల రూపంలో నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం ఉండదు. ఫీజుల నిర్ణయం, వసూలులో ప్రైవేట్, -కార్పొరేట్ యాజమాన్యాలదే అంతిమ నిర్ణయం. ప్రభుత్వ నియమ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పాటించిన దాఖలాలు లేవు. నేడు సమాజంలో పేద, అతి పేద, దిగువ మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, ధనిక, అతి ధనిక వర్గాలుగా ప్రజలు విడిపోయి ఉన్నారు. వారివారి ఆర్థిక-సామాజిక స్థితిగతులను బట్టి విద్య, -వైద్య సదుపాయాలు అందుతున్నాయి. అందరికీ మెరుగైన, నాణ్యమైన, ఒకే విధమైన విద్య, -వైద్య సదుపాయాలు మాత్రం అందడం లేదు. ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

# చదువరుల పాలిట అక్షయపాత్ర




స్మార్ట్‌ఫోన్లు ఒకప్పుడు పుస్తకాలంత సర్వసాధారణంగా మారిన ఈ యుగంలో, మొబైల్ లైబ్రరీ యాప్‌లు ఒక శక్తివంతమైనమార్పుగా ఆవిర్భవించాయి. జ్ఞానసంపదను నేరుగా మన జేబుల్లోకి తీసుకొస్తున్నాయి. ఈ డిజిటల్ వేదికలు ఎప్పుడైనా, ఎక్కడైనా యాక్సెస్ చేయగలిగే సామర్థ్యంతో ఉన్నాయి. మనం సాహిత్యం, పరిశోధన లేదా ఏ ఇతర అభ్యాసంతో ఎలా సంబంధం కలిగి ఉంటామో అలాగే మార్చివేస్తున్నాయి. ఇకపై లైబ్రరీ అనే స్వరూపం, ఉనికి భౌతిక గోడలకు మాత్రమే పరిమితం కాకుండా, ఒక్క ట్యాప్‌తో ఎనలేని పుస్తకాలు, ఆడియో బుక్‌లు, అనేక విద్యా సంబంధిత వనరులను పాఠకులు అన్వేషించవచ్చు. ఈ సాంకేతికత, సాహిత్య సమ్మేళనం కేవలం సౌలభ్యం మాత్రమే కాదు. ఇది జ్ఞానానికి ప్రజాస్వామ్య యాక్సెస్‌ను ప్రోత్సహించే లక్షణం. జీవితకాల అభ్యాస సంస్కృతిని పెంపొందించే విప్లవం. మొబైల్ లైబ్రరీ యాప్‌ల ఆకర్షణ, వాటి అసమానమైన యాక్సెసిబిలిటీలో ఉంది. సాంప్రదాయ లైబ్రరీలు నిర్దిష్ట పని గంటలు, ప్రత్యేక స్థలాలలో పనిచేస్తాయి. కానీ ఈ యాప్‌లు 24/7 అందుబాటులో ఉంటాయి. బిజీగా ఉన్న ప్రొఫెషనల్స్, విద్యార్థులు, పరిశోధకులు, సాధారణ రీడర్స్ రాత్రి, పగలు సమయంలో చదివే వారి షెడ్యూళ్లకు అనుగుణంగా ఎప్పుడంటే అప్పుడు అందుబాటులో ఉంటాయి. రద్దీగా ఉన్న రైలులో ప్రయాణిస్తున్నా లేదా డాక్టర్ కార్యాలయంలో వేచి ఉన్నా, ఒక లైబ్రరీ యాప్ ఖాళీ క్షణాలను జ్ఞాన సమృద్ధి అవకాశాలుగా మార్చగలదు. ఉదాహరణకు, ఓవర్‌డ్రైవ్ అభివృద్ధి చేసిన 'లిబ్బీ యాప్', స్థానిక పబ్లిక్ లైబ్రరీ కార్డ్‌తో ఈ-బుక్‌లు, ఆడియోబుక్‌లను అరువుగా తీసుకోవడానికి అనుమతిస్తుంది. న్యూయార్క్‌లోని ఒక పాఠకుడు సబ్‌వేలో ప్రయాణిస్తూ 'చిమమండా ఎన్‌గోజీ అడిచీ' నవలను చదవగలడు, అదే సమయంలో భారతదేశంలోని గ్రామీణ ప్రాంతంలోని ఒక విద్యార్థి తన ఫోన్‌లో విద్యా జర్నల్‌లను యాక్సెస్ చేయగలడు. భౌగోళిక, ఆర్థిక అంతరాలను తగ్గిస్తూ సాధారణ సౌలభ్యానికి మించి, మొబైల్ లైబ్రరీ యాప్‌లు భౌతిక లైబ్రరీల సేకరణలకు సమానమైన, కొన్ని సార్లు వాటిని అధిగమించే విస్తృత వనరులను అందిస్తాయి. 'హూప్లా', 'స్క్రిబ్డ్' వంటి ప్లాట్ ఫారమ్‌లు బెస్ట్‌సెల్లర్‌లనుండి అస్పష్టమైన విద్యాగ్రంథాల వరకు 'కామిక్స్', 'షీట్ మ్యూజిక్', 'పాడ్‌కాస్ట్‌ల'తో సహా మిలియన్ల కొద్దీ శీర్షికలను అందిస్తాయి. ఈ వైవిధ్యం విభిన్న ఆసక్తులు, అభ్యాస శైలులను తీరుస్తుంది. సాధారణ పాఠకుల నుండి పరిశోధకుల వరకు అందరికీ విలువైనది ఏది కావాలో దానిని అడిగిందే తడవుగా 'అక్షయ పాత్ర లా అందిస్తుంది. ఉదాహరణకు చరిత్ర పరీక్షకు సిద్ధమవుతున్న ఒక ఉన్నత పాఠశాల విద్యార్థి జోస్టర్ యాప్ ద్వారా ప్రాథమిక మూల డాక్యుమెంట్‌లను డౌన్‌లోడ్ చేయగలడు. అదే సమయంలో ఒక తల్లిదండ్రులు లాంగ్ డ్రైవ్ సమయంలో తమ బిడ్డను అలరించడానికి 'లిబ్బీ'పై పిల్లల ఆడియోబుక్‌ను స్ట్రీమ్ చేయవచ్చు. అందుబాటులో ఉన్న కంటెంట్ విస్తృత సమగ్రతను ప్రోత్సహిస్తుంది. ఈ యాప్‌లను విద్య, వినోదానికి అనివార్య సాధనాలుగా మారుస్తుంది. అంతేకాకుండా మొబైల్ లైబ్రరీ యాప్‌లు భౌతిక పుస్తకాలు అందించలేని ఫీచర్ల ద్వారా చదివే అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. అనుకూలీకరించదగిన టెక్ట్ సైజులు, సర్దుబాటు చేయగల బ్యాక్‌గ్రౌండ్ రంగులు, అంతర్నిర్మిత నిఘంటువులు దృష్టి లోపం లేదా భాషా అడెక్కులు ఉన్న పాఠకులకు యాక్సెసిబిలిటీని ప్రోత్సహిస్తాయి. 'కిండిల్', 'గూగుల్ ప్లే బుక్స్' వంటి యాప్‌లు పాఠకుల అభిరుచులకు తగిన భాగాలను హైలైట్ చేయడానికి, నోట్స్ తీసుకోవడానికి, వారి పురోగతిని ఫోన్, ట్యాబ్ లేదా ఈ-రీడర్‌లలో సమకాలీకరించడానికి అనుమతిస్తాయి. సజావుగా చదివే అనుభవాన్ని సృష్టిస్తాయి. ఆడియోబుక్ ఫీచర్లు, 'వేరియబుల్ ప్లేబ్యాక్ స్పీడ్' ల వంటివి. వినియోగదారులు తమ సొంత వేగంతో కంటెంట్‌ను ఆస్వాదించడానికి అనుమతిస్తాయి. ఈ ఆవిష్కరణలు చదవడాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడమే కాక, ఆధునిక వినియోగదారుల వేగవంతమైన, బహుళ-పనుల జీవనశైలిని కూడా సమన్వయం చేస్తాయి. అయితే, మొబైల్ లైబ్రరీ యాప్‌ల ఆవిర్భావం సవాళ్ల లేకుండా లేదు. డిజిటల్ డివైడ్‌లు ఇప్పటికీ ఉన్నాయి. చాలా మంది, ముఖ్యంగా సేవలు అందని ప్రాంతాలలో, నమ్మదగిన ఇంటర్నెట్ లేదా అనుకూల పరికరాలకు యాక్సెస్ లేకపోవడం ఒక సమస్య. అదనంగా, కొన్ని యాప్‌లు వినియోగదారు సమాచారాన్ని సేకరించడం వల్ల డేటా గోప్యత గురించి ఆందోళనలు ఉన్నాయి. ఈ సౌకర్యం కొన్ని సందర్భాలలో దుర్వినియోగం కావచ్చు. లైబ్రరీలు అలాగే యాప్ డెవలపర్‌లు సమాన యాక్సెస్‌ను ప్రోత్సహించడం, పారదర్శక గోప్యతా విధానాలను అమలు చేయడం ద్వారా ఈ సమస్యలను పరిష్కరించాలి. ఈ అడ్డంకులు ఉన్నప్పటికీ, మొబైల్ లైబ్రరీ యాప్‌లు సంఘాలను సాధికారపరచే సామర్థ్యం అసాధారణమైనది. 'వరల్డ్‌దర్' వంటి కార్యక్రమాలు, తక్కువ-ఆదాయ దేశాలలో పిల్లలకు ఉచిత ఈ-బుక్‌లను అందించడం ద్వారా, భౌతిక లైబ్రరీలు అరుదుగా ఉన్న ప్రాంతాలలో సాక్షరత, విద్యను పెంపొందించడం ద్వారా జీవితాలను మార్చగలవు. మొబైల్ లైబ్రరీ యాప్‌ల సాంస్కృతిక ప్రభావం వ్యక్తిగత పాఠకులను అధిగమిస్తుంది. జ్ఞానాన్ని సార్వత్రికంగా యాక్సెస్ చేయగలిగేలా చేయడం ద్వారా, ఈ యాప్‌లు విద్య, ప్రచురణలలో సాంప్రదాయ గేట్ కీపింగ్‌ను సవాలు చేస్తాయి. అవి అట్టడుగు స్వరాలను సాధికార పరుస్తాయి, స్వీయ-ప్రచురిత రచయితలకు, అలాగే ఓపెన్- యాక్సెస్ విద్యా రచనలకు వేదికలను అందిస్తాయి. ఇవి బుక్‌స్టోర్ షెల్ఫ్‌లకు ఎప్పటికీ చేరకపోవచ్చు. ఒక గ్రామంలోని రచయిత వాట్‌ప్యాడ్‌పై తమ కథను ప్రచురించి, ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను చేరుకోవచ్చు, అదే సమయంలో ఒక పరిశోధకుడు రీసెర్చ్ గేట్‌పై తమ ఆవిష్కరణలను పంచుకోవడం ద్వారా అంతర్జాతీయ సహకారాన్ని ప్రేరేపించవచ్చు. కంటెంట్ సృష్టి, వినియోగం ఈ ప్రజాస్వామ్యీకరణ సాహిత్య దృశ్యాన్ని మార్చివేస్తోంది. మరింత సమగ్రమైన పరస్పర సంబంధిత ప్రపంచాన్ని పెంపొందిస్తోంది.

## హౌసింగ్ పథకంలో ముస్లింలకు 15 శాతం కోటా..

### కాంగ్రెస్ సర్కార్ ఆమోదం..



**న్యూఢిల్లీ,:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహనిర్మాణ పథకాల్లో ముస్లింలకు 15 శాతం రిజర్వేషన్లను పెంచే ప్రతిపాదనను కర్ణాటక క్యాబినెట్ ఈ రోజు ఆమోదించింది. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ, గ్రామీణాభివృద్ధి శాఖలు అమలు చేసే అన్ని హౌసింగ్ పథకాల్లో ముస్లింలకు ప్రత్యేక కోటాను మంజూరు చేసింది. మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్లను ప్రస్తుత 10 శాతం నుండి 15 శాతానికి పెంచే ప్రతిపాదనకు గృహనిర్మాణ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ మద్దతు ఇచ్చారు. "వాస్తవానికి మనం జనాభాను బట్టి ఆలోచించాలి, పట్టణ జనాభాలో ఎక్కువ మంది మైనారిటీలు, పేదలు ఉన్నారు." అని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ రిజర్వేషన్లను సమర్థించారు. ఇళ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని ఇతరులకు కేటాయించలేదని, అందుకే ముస్లిం కోటాను 10 నుంచి 15 శాతానికి పెంచామని అన్నారు. మైనారిటీలు చాలా కాలంగా రిజర్వేషన్లు పెంచాలని అభ్యర్థిస్తున్నారని, దీంతో ఖాళీగా ఉన్న భవనాలను నింపే క్రమంలో 15 శాతం కోటా కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని మంత్రి ఎంసీ సుధాకర్ కూడా సమర్థించారు. కేంద్రం ఇప్పటికే మైనారిటీలకు 15 శాతం కేటాయింపులు చేస్తోందని, దానికి అనుగుణంగా రాష్ట్రం కూడా చర్యలు తీసుకుందని చెప్పారు. మరోవైపు, కర్ణాటక ప్రభుత్వ కొనుగోళ్లలో పారదర్శకత(సవరణ) బిల్లు-2025ను ప్రవేశపెట్టింది. రూ. 2 కోట్ల కన్నా తక్కువ విలువ చేసే ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బిల్లును ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అయితే, ఈ బిల్లును మే 22న కర్ణాటక గవర్నర్, రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. ప్రధాని మోడీ కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలుమార్లు విమర్శించారు. మతం ఆధారంగా టెండర్లలో రిజర్వేషన్ మంజూరు చేస్తున్నారని, ఇది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కుల్ని హరిస్తుందని ఆరోపించారు.

## తెలంగాణలో ప్రాజెక్టులు కట్టాలా వద్దా?..

## సీఎం వ్యాఖ్యలపై ఈటల కౌంటర్



**హైదరాబాద్, :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా కేబినెట్ లో ఆమోదం లేకుండా ఏమి జరగదు.. ఆయన మంత్రి వర్గంలో ఉన్నవారే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు, వారిని అడగవచ్చు అని సూచించారు. కేసీఆర్ మొదలు పెట్టిన ప్రాజెక్ట్ అని నేను చెప్పాను, అది ఎప్పుడు మొదలయ్యిందో తెలుసుకోవాలి అని పేర్కొన్నారు. సుందిళ్ళ, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులు రీ డిజైన్ లో కేసీఆర్ చేర్చారు.. అవినీతి జరిగితే విచారణ జరపండి, విచారణ జరిగిన చర్యలు తీసుకుంటారాని నమ్మకం లేదు, అందుకే సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు ఏటిఎంలుగా మారాయని ఎంపీ ఈటల తెలిపారు. అయితే, మొదట పిల్లర్లు రిపేర్ చేసి నీళ్లు ఇచ్చే పని పెట్టుకోండి అని రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ప్రాజెక్టులు కట్టడం తప్పు కాదు, వాటి పేరుతో అక్రమాలు చేయడం తప్పు అన్నారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రతి నిర్ణయం కేబినెట్ రాటిఫికేషన్ జరుగుతుంది.. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని డాక్యుమెంట్స్ మీకు పంపిస్తాను అని చెప్పుకొచ్చారు. మీ డిపార్ట్మెంటో ఏ నిర్ణయం తీసుకోవాలి అనుకున్నా.. కేబినెట్ లో పెట్టండి అని కేసీఆర్ చెప్పే వారు ఇది నిజం కాదంటే నేను దేనికైనా సిద్ధం అని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మించడం, అవినీతి వేరువేరుగా చూడాలి.. ప్రాజెక్ట్ నిర్మించాలి కానీ వాటిని అడ్డం పెట్టుకొని సంపాదించడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తుందని బీజేపీ ఎంపీ ఈటల చెప్పారు. ఇక, తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగింది అని ఈటల రాజేందర్ తెలిపారు. నేను జైళ్లకు పోయిన, నా రక్తం చిందిది, పెట్రోల్ మంటల్లో యువత కాలిపోయింది, ఫలితంగా వచ్చిన తెలంగాణలో ప్రాజెక్ట్ కట్టాలా వద్దా? అని ప్రశ్నించారు. అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే మొదలు పెట్టారు కానీ పూర్తిచేయలేదు.. జలయజ్ఞంలో భాగంగా ప్రాణహిత- చేవెళ్ల ఐదేళ్లలో పూర్తి చేసే ప్రాజెక్టేనా కదా?.. ఎందుకు పూర్తి చేయలేదన్నారు. కమీషన్ త్వరగా పూర్తి చేయాలి అవినీతి నిగ్గు తేల్చాలి.. బీజేపీ అయితే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుంది.. బీజేపీ ప్రాజెక్ట్స్ కట్టడానికి వ్యతిరేకం కాదు.. అధికారం అడ్డం పెట్టుకొని టెండర్లు లేకుండా పనులు పంచుకోవడం తప్పు అని ఎంపీ ఈటల పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ..



**న్యూఢిల్లీ,:** కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేడు తన 55వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ నాయకుడికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి మోడీ తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ఎక్స్'లో 'లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన దీర్ఘాయుష్షుతో, ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను' అని రాశారు. రాహుల్ గాంధీ జూన్ 19, 1970న న్యూఢిల్లీలో జన్మించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ దంపతుల సంతానం. ప్రస్తుతం ఆయన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఉన్నారు. అలాగే.. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు. ఆయన భారత్, విదేశాలలో విద్యను అభ్యసించారు. ఫ్లోరిడాలోని రోలిన్స్ కళాశాల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని ట్రినిటీ కళాశాల నుంచి ఎం.ఫిల్. డిగ్రీని పొందారు. తన చదువు తర్వాత.. లండన్‌లోని మానిటర్ గ్రూప్ అనే కన్సల్టింగ్ సంస్థలో కొంతకాలం పనిచేశారు. తరువాత భారత్‌కు వచ్చి ముంబైలో టెక్నాలజీ అవుట్‌సోర్సింగ్ కంపెనీ అయిన బ్యాక్‌ఆప్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించడంలో సహాయపడ్డారు. రాహుల్ గాంధీ 2004లో తన తండ్రి సాంప్రదాయక సీటు అయిన ఉత్తరప్రదేశ్‌లోని అమేథి లోక్‌సభ స్థానానికి పోటీ చేసి గెలిచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు.

## దేశంలో ఇంగ్లీష్ మాట్లాడే వారు త్వరలోనే సిగ్గుపడతారు..

**న్యూఢిల్లీ,:** భారతీయ భాషలు దేశ గుర్తింపుకు ఆత్మ వంటివని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం అన్నారు. భారతదేశ భాషా వారసత్వాన్ని తిరిగి పొంది, మాతృభాషల పట్ల గర్వంతో ప్రపంచానికి నాయకత్వం వహించాల్సిన సమయం వచ్చిందన్నారు. మాజీ సివిల్ సర్వెంట్ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రచించిన 'మెయిన్ బూంద్ స్వయం, ఖుద్ సాగర్ హూన్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతూ అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ దేశంలో, ఇంగ్లీష్ మాట్లాడేవారు త్వరలోనే సిగ్గుపడతారు . అటువంటి సమాజం ఏర్పడటం ఎంతో దూరంలో లేదు. దృఢ సంకల్పం ఉన్నవారు మాత్రమే మార్పు తీసుకురాగలరు. మన దేశ భాషలు మన సంస్కృతికి రత్నాలు అని నేను నమ్ముతున్నాను. మన భాషలు లేకుంటే, మనం నిజంగా భారతీయులుగా ఉండటం మానేస్తాము." అని అమిత్ షా అన్నారు. "మన దేశాన్ని, మన సంస్కృతిని, మన చరిత్రను, మన మతాన్ని అర్థం చేసుకోవడానికి, ఏ విదేశీ భాష కూడా సరిపోదు. పూర్తి భారతదేశ ఆలోచనను విదేశీ భాషల ద్వారా ఊహించలేము. ఈ యుద్ధం ఎంత కష్టమో నాకు పూర్తిగా తెలుసు, కానీ భారత సమాజం దానిని గెలుస్తుందని కూడా నాకు పూర్తిగా నమ్మకం ఉంది. మరోసారి, ఆత్మగౌరవంతో, మన దేశాన్ని మన స్వంత భాషలలో నడుపుతాము, ప్రపంచాన్ని కూడా నడిపిస్తాము" అని అన్నారు. "ప్రధాని మోడీ అమృత కాలం కోసం 'పంచ్ ప్రాణ్' (ఐదు ప్రతిజ్ఞలు) కు పునాది వేశారు. అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క లక్ష్యాన్ని సాధించడం, బానిసత్వం యొక్క ప్రతి జాడను వదిలించుకోవడం, మన వారసత్వం పట్ల గర్వపడటం, ఐక్యత మరియు సంఘీభావానికి కట్టుబడి ఉండటం, ప్రతి పౌరుడిలో విధి స్ఫూర్తిని రగిలించడం - ఈ ఐదు ప్రతిజ్ఞలు 130 కోట్ల మంది ప్రజల సంకల్పంగా మారాయి. అందుకే 2047 నాటికి మనం శిఖరాగ్రంలో ఉంటాం, ఈ ప్రయాణంలో మన భాషలు ప్రధాన పాత్ర పోషిస్తాయి" అని చెప్పారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన పుస్తకం గురించి మాట్లాడుతూ.. పరిపాలన అధికారుల శిక్షణలో మార్పు అవసరమని కేంద్ర హోం మంత్రి చెప్పారు. ఏదైనా పాలకుడు లేదా నిర్వాహకుడు సానుభూతి లేకుండా పాలిస్తే, వారు పాలన యొక్క నిజమైన లక్ష్యాన్ని సాధించలేరని అన్నారు. మన దేశం కటిక చీకటిలో ఉన్నప్పుడు కూడా మన సాహిత్యం, మన మతం, స్వేచ్ఛ, సంస్కృతి దీపాలను వెలిగించిందని అన్నారు. సాహిత్య మన సమాజానికి ఆత్మ అని కేంద్ర హోంమంత్రి చెప్పారు.

## ఒక్కమాటే..మంత్రము

## వాయిస్ కమాండ్‌తో అన్నీ చకచకా

## భారతీయ భాషలన్నీ అర్థం చేసుకునేలా..

## వాయిస్ ఏఐ మోడళ్ల తయారీ

## 5 ఏళ్లలో రూ.10వేల కోట్ల వ్యయం

# కేంద్ర ప్రభుత్వ 'ఇండియా ఏఐ మిషన్'



మనం ఆన్‌లైన్లో ఏదైనా కొనాలన్నా.. ఆహారం ఆర్డర్ చేయాలన్నా.. బైక్/కారు బుక్ చేయాలన్నా.. ఏ భాషలోనైనా సమాచారం కావాలన్నా.. ఇకమీదట ఫోన్లో టైప్ చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు. నేరుగా ఏం కావాలో 'మాట' మాత్రంగా చెప్తే చాలు.. పని జరిగిపోతుంది. దేశంలోని అన్ని భాషలనూ అర్థం చేసుకుని, ఆయా భాషల్లో సేవలు అందించే 'వాయిస్ ఏఐ' రోజులు వస్తున్నాయి. ఇందుకోసం భారత ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన 'ఇండియా ఏఐ మిషన్' జోరందుకుంది. రోజువారీ పనులను చక్కబెట్టుకోడానికీ 'వాయిస్ ఏఐ' అనే కృత్రిమ మేధ మనకోసం 'కార్యేషు కమాండర్'లా సిద్ధం కాబోతోంది. దేశంలో ప్రస్తుతం ఉన్న 90 కోట్ల మంది ఇంటర్‌నెట్ వినియోగదారులు ఉన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు, గ్రామాల్లో.. ఇంగ్లీష్ వ్యాప్తి తక్కువగా ఉంటుంది. డిజిటల్ అక్షరాస్యత ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది. ఈ ప్రాంతాల్లోని వారు వాయిస్ కమ్యూనికేషన్ ద్వారా తమ పనులు చక్కబెట్టేందుకు ఇష్టపడుతున్నారు. ఇలా టెక్స్‌ట్‌ను టైప్ చేయటానికి ఇష్టపడని, లేదా టైప్ చేయటం రాని వారి కోసం ఒక సరళమైన, స్పష్టమైన 'వాయిస్ ఇంటరాక్షన్' విధానాన్ని వృద్ధి చేసేందుకు భారతీయ కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్ కంపెనీలు కృషి చేస్తున్నాయి.

### చెబితే చాలు... చేసి పెడుతుంది!

రైతులు, గ్రామీణ వ్యాపారులు, గిగ్ వర్కర్లు, గృహిణులు సహా ఆన్‌లైన్ వినియోగదారులందరూ ఈ వాయిస్ ఎఐతో ఇంటర్నెట్ వాడకం స్వరూపాన్నే మార్చేయబోతున్నారని భారతీయ వాయిస్ ఏఐ స్టార్టప్ కంపెనీలు చెబుతున్నాయి. రైతులు ఇప్పటికే తమ ఫోన్‌లో ఒక్క మాట కూడా చదవకుండానే, ఒక్క బటన్ కూడా నొక్కకుండానే పంటల బీమా, క్రెడిట్ అర్హత, వాతావరణ పరిస్థితులకు తట్టుకునే వ్యవసాయ విధానాల సమాచారం తెలుసుకుంటున్నారు. జ్ఞాని.ఏఐ ప్రయోగాత్మకంగా ఇటీవలే దేశంలోని 120 గ్రామాలలో 15 వేల కంటే ఎక్కువ మంది రైతులకు ఈ విధానంలో సమాచారాన్ని అందించింది. ఒక బాట్ (సాఫ్ట్‌వేర్ అప్లికేషన్) ద్వారా వారికి 3 నిమిషాల వాయిస్ కాల్ వచ్చింది. ఇది వాళ్ల స్థానిక భాష, యాసలోనే వాళ్లకు కావాల్సిన సూచనలూ, సలహాలూ అందించడం విశేషం.

### నాలుగు కంపెనీల ఎంపిక

'ఇండియా ఏఐ మిషన్' కింద భారత ప్రభుత్వం రూ.10,372 కోట్ల పంచ వర్ష బడ్జెట్ కేటాయింపులతో 'సర్వమ్', సోకెట్ ల్యాబ్స్, జ్ఞాని.ఏఐ, గాన్.ఏఐ అనే నాలుగు స్టార్టప్ కంపెనీలను ఎంపిక చేసింది. ప్రాథమిక వాయిస్ ఏఐ మోడళ్లను, అత్యాధునిక లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎమ్) తయారుచేసే బృహత్తర బాధ్యతలను వీరికి అప్పగించింది. 'సర్వమ్' ఏఐ.. 10 భారతీయ భాషల్లో శిక్షణ పొందిన వ్యవస్థను రూపొందించింది. ఇది గణితం, కోడింగ్, బహుభాషా అవగాహన వంటి అనేక ప్రక్రియలను సులభంగా చేయగలదు. జ్ఞాని.ఏఐ 12 భారతీయ భాషలు సహా మొత్తం 40 ప్రపంచ భాషలను గుర్తించి సేవలు అందిస్తుంది. సోకెట్ ల్యాబ్స్ భారతీయ భాషలకు అనుగుణంగా 'ప్రజ్ఞ-1బి' అనే ప్రాథమికమైన ఏఐ మోడల్‌ని (ఓపెన్ ఏఐ, చాట్ జీపీటీ మాదిరిగా) రూపొందించింది. గాన్.ఏఐ అనేది ఇన్‌స్టంట్ ఏఐ వీడియోలు తయారుచేస్తుంది. 'భారత్‌లోనే తయారవ్వాలి - భారతదేశ అభివృద్ధికే పనిచేయాలి.. ఇదే ఇండియా ఏఐ మిషన్ ప్రధాన ఉద్దేశం' అని కంపెనీల ఎంపిక సందర్భంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

### 'స్వదేశీ వాయిస్' సవాళ్లు!

భారతీయ స్టార్టప్‌లు నేటికీ పాశ్చాత్య డేటాసెట్‌లపై శిక్షణ పొందిన ఓపెన్ ఏఐ, డీప్‌గ్రామ్ వంటి నమూనాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఇవి భారతీయ భాషలు, అందులోని యాసలు, పేర్లు లేదా స్థానిక సూక్ష్మాంశాలను తరచుగా తప్పుగా అర్థం చేసుకుంటున్నాయి. ఈ అంతరాన్ని తగ్గించడానికి, అందుకు అవసరమైన సాంకేతికను సాధించేందుకే కేంద్రం 'ఇండియా ఏఐ మిషన్'కు శ్రీకారం చుట్టింది.

### భవిష్యత్తంతా మాటలదే..!

గూగుల్ నివేదిక ప్రకారం స్మార్ట్ ఫోన్ వాడేవారిలో 60 శాతం భారతీయులు వాయిస్ అసిస్టెంట్‌ల ద్వారా సంభాషిస్తున్నారు. 'వాట్ కన్సల్ట్' నివేదిక ప్రకారం నెట్ సేవల్ని పొందే భారతీయుల్లో 76 శాతం మందికి స్పీచ్, వాయిస్ రికగ్నిషన్ టెక్నాలజీపై అవగాహన ఉంది. దీన్ని బట్టి, మాతృభాషలో స్మార్ట్‌ఫోన్‌తో మాట కలిపి దైనందిన పనుల్ని చక్కబెట్టుకునే అలవాటు దేశ ప్రజల్లో ఎంతలా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. ఆంగ్ల భాష లేదా ఇతర భాషలలో ఉండే ఆప్షన్‌లను ఫోన్‌లో చేతి వేళ్లతో నొక్కటం ద్వారా ముందుకు సాగే 'గ్రాఫికల్ యూజర్ ఇంటర్ఫేస్' (జి.యు.ఐ.) విధానానికి ఉన్న పరిమితులకు పరిష్కారంగా వచ్చిన ఈ 'వాయిస్ ఏఐ'దే భవిష్యత్తంతా అని నిపుణులు అంటున్నారు. 2022లో మొత్తం ఏఐ స్టార్టప్‌లలో 702 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడితే.. అందులో సుమారు 437 మిలియన్ డాలర్లు సంభాషణాపరమైన / వాయిస్ ఏఐ స్టార్టప్‌లలో పెట్టారు.

### ఎవరెవరు ఏమేం చేస్తారంటే..

కొత్తగా తయారుచేయబోయే ఈ ఏఐ మోడళ్ల స్థాయిని వాటిలో ఉండే పారా మీటర్ల ఆధారంగా అంచనా వేస్తారు. ఎన్ని ఎక్కువ పారామీటర్లు ఉంటే అంత శక్తిమంతమైన మోడల్ అన్నమాట. సర్వమ్ ఏఐ రూపొందించిన సర్వమ్: ఎమ్, 2,400 కోట్ల పారామీటర్లు ఉండే మోడల్. ఇది భారతీయ భాషలన్నింటిలోనూ శిక్షణ పొందింది. స్టార్టప్‌లకు చేయూత నివ్వడం, సీసీటీవీ కెమెరాల్లాంటి భారతదేశంలో తయారయ్యే ఏఐ హార్డ్‌వేర్ వంటి వాటిని ప్రోత్సహించడం వంటి అదనపు బాధ్యతలు దీనికి అప్పగించింది ప్రభుత్వం. సోకెట్ ఏఐ: ఇది భారత దేశ మొట్ట మొదటి ఓపెన్ సోర్స్ ఏఐ మోడల్‌ను తయారుచేస్తుంది. 12,000 కోట్ల పారామీటర్లతో అనేక భారతీయ భాషల్లో పనిచేసే దీన్ని ఆరోగ్య సంర క్షణ, విద్య, రక్షణ రంగాల్లో వాడతారు. జ్ఞాన్ ఏఐ: 1,400 కోట్ల పారామీటర్లతో రూపొందించే ఈ వాయిస్ మోడల్ వివిధ భారతీయ భాషలను అర్థం చేసుకోగలదు. రియల్ టైమ్‌లో కూడాస్పందించగలదు. కేవలం మాటలతోనే స్మార్ట్‌ఫోన్లో పనులు చేయాలనుకునేవారి కోసం స్మార్ట్ వాయిస్ అసిస్టెంట్లు, టూల్స్‌ను ఇది తయారుచేస్తుంది.

# జీ7 మేల్కొనదా?!




నానాటికీ మసకబారుతున్న ప్రతిష్ఠను కాస్తయినా పునరుద్ధరించుకోవాలన్న స్పృహ కూడా లేకుండా ఎప్పటిలా జీ7 రెండు రోజుల సమావేశాలు కెనడాలోని ఆల్బెర్టాలో పేలవంగా ముగిశాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అంతూ దరీ లేకుండా కొనసాగుతుండగా, తాజాగా ఇరాన్‌పై అమెరికా అండతో ఇజ్రాయెల్ దండెత్తింది. కానీ రెండు విషయాల్లోనూ తన వైఖరి ఎలావుండాలో, ఏం చేయాలో జీ7 తేల్చుకోలేకపోయింది. సమావేశాల ముగింపులో లాంఛనంగా విడుదల కావాల్సిన ఉమ్మడి ప్రకటన కరవైంది. ఏకపక్షంగా ఇరాన్‌పై దాడులకు దిగి పశ్చిమాసియాలో మరో మహాసంగ్రామానికి తెరలేపిన ఇజ్రాయెల్‌ను పల్లెత్తు మాట అనకుండా తప్పంతా ఇరాన్‌దేనని ఈ దేశాలు తేల్చాయి. ఆ యుద్ధం పర్యవసానాలు తమను సైతం చుట్టుముడతాయనీ, అమెరికా ఆ ఊబిలోకి దిగితే అది మరో ప్రపంచ యుద్ధంగా పరిణమించే ప్రమాదం ఉన్నదనీ తెలిసినా కిక్కురుమనలేదు. ఇరాన్‌ను ఏదో ఒకటి అనకపోయినా... రష్యాను నిందించే ప్రయత్నం చేసినా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆగ్రహం కలుగుతుందన్న భయం జీ7 దేశాలను వెన్నాడింది. సమావేశాలకు ముందు బ్రిటన్, కెనడాలు రష్యాపై మరిన్ని ఆంక్షలుంటాయని ఆర్భాటంగా ప్రకటించాయి. కానీ ట్రంప్ తీరు చూశాక వాటికి నోరుపెగల్లేదు. గాజా విషయంలో ఇజ్రాయెల్‌ను తప్పుబట్టినట్టు కనబడుతూనే, ఇరాన్‌పై దండయాత్ర విషయంలో ఒక్క మాట అనలేకపోయాయి. అసలే జీ7 'నిన్నటి క్లబ్' అని పేరుబడింది. ఆ అపకీర్తిని మరింత పెంచుకోవటానికే సభ్యదేశాలు పాటుపడుతున్నట్టు కనబడుతోంది! ఒకప్పుడు జీ7 మహా శక్తిమంతమైనది. 1980వ దశకంలో ప్రపంచ జీడీపీలో దాని వాటా ఏకంగా 70 శాతం. నిరుడు ఆ వాటా 30 శాతానికి కాస్త అటూ ఇటూగా ఉంది. ఆర్థిక కార్యకలా పాలు పశ్చిమం నుంచి తూర్పు దిశకు వలసవచ్చి చాన్నాళ్లవుతోంది. ఈ పారిశ్రామిక దేశాలకు చైనా సవాలుగా నిలిచింది. ఆర్థికంగా బలపడుతోంది. ఆ దేశానికి జీ7లో చోటు లేదు. అటు రష్యాకు మధ్యలో కొన్నాళ్లు సభ్యత్వం ఇచ్చినా 2014లో క్రిమియాను దురాక్రమించటంతో వెళ్లగొట్టారు. మన దేశం సైతం ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. అయినా పరిశీలక హోదాయే తప్ప సభ్యత్వం లేదు. ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక ప్రపంచ సంస్థలను అమెరికా చిన్నచూపు చూడటం మొదలైంది. భద్రతామండలికి విలువే లేకుండా పోయింది. తానే నిర్మించిన డబ్ల్యూటీవోను అమెరికా బేఖాతరు చేస్తోంది. ప్యారిస్ ఒప్పందం నుంచి, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి బయటికొచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా ఏర్పడుతున్న ఖాళీని భర్తీ చేయొచ్చన్న ఆలోచనగానీ, అందుకు తగిన ప్రణాళికలుగానీ జీ7 దగ్గర లేవు. ఎంతసేపూ అమెరికా తోకపట్టుకు పోవాలన్న ధోరణే. ట్రంప్ మాటలు గమనిస్తే ఆయనకు ప్రధాన ఎజెండా అయిన వాణిజ్యంపై ధ్యాసలేదన్న సంగతి తెలుస్తుంది. సదస్సులో ఎక్కువసేపుంటే ఉక్రెయిన్ విషయంలో ఒత్తిడి తప్పదన్న భయం వల్లనో, ఇరాన్ సంగతి తేల్చాలన్న ఆవేశంతోనో ఆయన మధ్యలోనే నిష్క్రమించారు. వెళ్లేముందు రష్యా దురాక్రమణకు మీరే కారణమంటూ నిందించారు. తమ మాజీ అధ్యక్షుడు ఒబామా, అప్పటి కెనడా ప్రధాని స్టీఫెన్ హార్పర్‌లు 2014లో రష్యాను జీ7నుంచి బయటకు నెట్టకపోతే ఇవాళ ఆయన సమావేశాల్లో ఉండేవారని, యుద్ధం ఆపటానికి ఒత్తిడి తెచ్చేవారమని నిష్ఠూరమాడారు. అసలు యుద్ధమే వచ్చి వుండేది కాదని కూడా ఆయన చెప్పుకొచ్చారు. అందుకే, ఇక్కడ న్యాయానికి చోటులేదని గ్రహించారో ఏమో... ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం సమావేశాలకు మధ్యలోనే గుడ్‌బై చెప్పారు. నిరుడు జూన్‌లో జరిగిన జీ7 సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్‌కు 5,000 కోట్ల డాలర్ల రుణమిస్తామని తీర్మానించారు. దాని ప్రకారం నెలకు వంద కోట్లు ఉక్రెయిన్‌కు అందించాలి. కానీ ట్రంప్ రాకముందే డిసెంబర్‌లోనే అప్పటి అధ్యక్షుడు బైడెన్ దానికి కోత పెట్టారు. ఆయనొచ్చాక ఇక చెప్పేదేముంది? ఈ భారాన్ని ఇతర సభ్య దేశాలు మోస్తున్నాయి. నిజానికి, గత వైభవం మళ్లీ దక్కాలంటే జీ7 పరిపూర్తి చేయాల్సిన లక్ష్యాలు చాలానే ఉన్నాయి. అంతర్జాతీయ శాంతికి, భద్రతకు తమ వంతు కృషి అవసరం. కృత్రిమ మేధ, క్వాంటమ్‌లకు కావాల్సిన అత్యంత కీలకమైన ఖనిజాల సరఫరా ఆటంకం లేకుండా చూసుకోవాలి. పటిష్ఠమైన మౌలిక సదుపాయాల కల్పనకూ, యువతకు భారీయెత్తున ఉద్యోగావకాశాలు వచ్చిపడే రంగాలపై దృష్టి సారించాలి. కానీ ఇవన్నీ సాకారం కావాలంటే యుద్ధాలు లేని ప్రపంచం ఉండాలి. మరి దానికోసం జీ7 చేసిందేమిటి? ఈ దేశాలన్నీ అమెరికా సాగించిన యుద్ధాల్లో భాగస్వాములుగా మారి చేజేతులా ఆర్థిక వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసుకున్నాయి. నిజానికి ఇజ్రాయెల్‌ను పూర్వంలా యూరప్ దేశాల్లో జనం వెనకేసుకు రావటం లేదు. ఇరాన్ అణ్వస్త్రం తయారు చేయటం అనర్థమన్న అభిప్రాయం ఉన్నా ఆ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి దాన్ని ఒప్పించాలని మెజారిటీ జనం భావిస్తున్నట్టు సర్వేల్లో తేలింది. అయినా జీ7 దేశాలకు పట్టదు. మనవరకూ చూస్తే ఈ సదస్సు ఎంతో కొంత తోడ్పడిందని చెప్పాలి. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత నేరుగా పారిశ్రామిక దేశాధినేతలందరినీ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా కలిసి ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్తాన్ తీరు గురించి, దానిపై చర్య తీసుకోక తప్పని పరిస్థితి గురించి వివరించగలిగారు. ఏదేమైనా ఇలాంటి సదస్సులు మొక్కుబడిగా, బాతాఖానీ క్లబ్‌లుగా మారితే ఫలితం ఉండదు. కనీసం వచ్చే సమావేశాల నాటికైనా జీ7 దేశాలు ఈ సంగతి గ్రహించాలి.

# రక్త రుగ్మతను అరికట్టాలి




సికిల్ సెల్ వ్యాధి లేదా సికిల్ సెల్ అనీమియా లేదా కొడవలి కణ రక్తహీనత అనేది వంశపారంపర్యంగా సంక్రమిస్తున్న రక్త రుగ్మత. సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్రరక్త కణాలు గుండ్రంగా పెప్పర్‌మింట్ల ఆకారంలో ఉంటాయి. ఈ కణాలు రక్తనాళాల ద్వారా శరీరమంతా ప్రయాణిస్తూ వివిధ అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుం టాయి. అయితే కొంతమందిలో జన్యుసంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్త కణాలు కొడవలి (సికిల్) ఆకారంలోకి మార్పు చెందుతాయి. ఈ సికిల్ సెల్ ఉన్నవారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్ సెల్ గానూ, ఒకటి మామాలుగానూ ఉన్నట్లయితే అటు వంటి వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారు. వీళ్లకి మామూలుగా ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. అయితే వివాహం చేసుకున్న దంపతులకు ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి పుట్టిన పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయి. అటువంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. సాధారణ రక్త కణాల జీవితకాలం 120 రోజులైతే సికిల్ సెల్ రక్త కణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే. సికిల్ సెల్ రక్త కణాల జీవిత కాలం తక్కువగా ఉండడం వలన, వేగంగా కొత్త ఎర్రరక్త కణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి కలిగిన వారు రక్తహీనతకు గురవుతారు. అంతేకాక సికిల్ సెల్ రక్తకణాలు వంపుతిరిగి ఉండటం వల్ల రక్తనాళాల్లో రక్తం సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందటం తగ్గిపోతుంది. అందువల్ల ఈ వ్యాధి ఉన్నవారు తగిన చికిత్స తీసుకోకపోతే చిన్న తనంలోనే చనిపోతారు. ఈ వ్యాధి కలిగిన వారి సగటు జీవిత కాలం 42-48 సంవత్సరాలు. జన్యుపరమైన మార్పుల వలన ఏర్పడుతున్న ఈ రక్తహీనత జబ్బుకు సరైన మందులు లేవు. సికిల్ సెల్ వ్యాధిని ప్రజా ఆరోగ్య సమస్యగా గుర్తించాలని 2008 డిసెంబర్ 22న జరిగిన ఐక్య రాజ్య సమితి 63వ జనరల్ అసెంబ్లీ ప్లీనరీ సమావేశం ప్రత్యేకంగా తీర్మానించింది. సికిల్ సెల్ డిసీజ్ పై ప్రపంచ దేశాలన్నీ ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవ సరమైన చర్యలు తీసుకోవాలని ఐక్య రాజ్య సమితి సభ్య దేశాలను ఆదేశించింది.2009 నుండి ప్రపంచ దేశాలన్నీ జూన్ 19న అంతర్జాతీయ సికిల్ సెల్ డిసీజ్ దినోత్సవాన్ని జరుపుతూ ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాయి. మన దేశంలో 17 రాష్ట్రాల్లో సికిల్ సెల్ డిసీజ్ సుమారు ఇరవై లక్షల మంది కలిగి ఉన్నారని అంచనా. 2020 నాటికి సికిల్ సెల్ అనీమియా అనే జన్యు పరమైన వ్యాధిని కలిగిన వారిలో ఉన్న రక్తహీనత నిర్మూలించడానికి 2018లో కేంద్ర ప్రభుత్వం "అనీమియా ముక్త్ భారత్" కార్యక్రమాన్ని ప్రారంభించింది. కానీ నిర్దేశించిన లక్ష్యాన్ని 2025 నాటికి కూడా చేరుకోలేదు. 2023-24 బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన మిషన్ మోడ్-2047 పథకం అమ లులోనూ నిర్లక్ష్యం కనిపిస్తున్నది. సికిల్ సెల్ అనీమియాతో పాటు రక్త రుగ్మతలు, రక్తాన్ని ప్రభావితం చేసే అనేక రకాల వ్యాధులను నివారిం చడానికి కేంద్ర కుటుంబ ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన మార్గదర్శకాలు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. దేశవ్యాప్తంగా 200 జిల్లాల్లో 40 ఏండ్ల లోపు వయస్సు కలిగిన ఏడు కోట్ల మంది గిరిజనులకు 2025-26 నాటికి ప్రత్యేకంగా వ్యాధి నిర్ధారణ కోసం స్క్రీనింగ్ చేయాలని నిర్ణయించింది. ప్రపంచలోనే వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న దేశాల్లో మన దేశంలో రెండో స్థానంలో ఉంది. ఏడాదికి సుమారు 40వేల మంది పిల్లలు ఈ వ్యాధితో పుడుతున్నారని అంచనా. ప్రతియేటా 50శాతం మంది పిల్లలు ఐదేండ్లకంటే ముందే చనిపోతున్నారు. "తల్లిదండ్రులిద్దరిలో సికిల్ సెల్ హిమోగ్లోబిన్ లక్షణాలు ఉంటే ఈ వ్యాధి ఒక తరం నుండి మరొక తరానికి వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. భారతదేశంలోని అధిక రాష్ట్రాల్లో ఈ వ్యాధి నివారణకు ప్రత్యేక నివారణ ప్రాజెక్టులను చేపట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యేక పరిశోధనాలయం కూడా ఉంది. ఈ వ్యాధి నివారణకు, దీనిపై పరిశోధనకు రారుపూర్‌లో ప్రత్యేకంగా సికిల్ సెల్ ఇన్‌స్టిట్యూట్‌నే నెలకొల్పి 12.43 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. 2008లో గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులు అధికంగా ఉండే 12 జిల్లాల్లో సికిల్ సెల్ అనీ మియా కంట్రోల్ ప్రాజెక్టును చేపట్టింది. గుజరాత్ లో 18.28 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు జరిపి జబ్బుతో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించి, సికిల్ సెల్ క్యారియర్ల మధ్య వివాహాలు జరగకుండా వారిని చైతన్య పరచి మంచి ఫలితాలు సాధించారు. కేరళలో ఈ వ్యాధి బారిన పడినవారికి వైద్య ఖర్చుల కోసం రూ.20 వేలు ఇస్తున్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ కూడా ఇలాంటి ఆర్థిక సహాయం చేయడం లేదు.ఈ వ్యాధి నిర్ధారణ ప్రాథమిక పరీక్షను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయిలోనే జరపవచ్చు.సికిల్ సెల్ వ్యాధి చికిత్సకు సరైన మందులు లేనందున, సికిల్ సెల్ క్యారియ ర్లను గుర్తించి వారి మధ్య వివాహాలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు. ఈ వ్యాధిని త్వరి తంగా నివారించాలని, నివారించకపోతే దుష్పరిణామాలు తప్పవని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా పాలకులు ఏమాత్రం పట్టిం చుకోవడం లేదు. ఇప్పటికైనా మిషన్ మోడ్ 2047 సికిల్ సెల్ డిసీజ్ నిర్మూలనకు దోహదపడేవిధంగా అమలు చేయాల్సిన అవసరం ఉన్నది.